www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 2-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 138 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: దశమి తె. 3:53 తదుపరి ఏకాదశి, నక్షత్రం: మూల రా.9.51 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: 8.07-9.51, దుర్ముహూర్తం: ఉ.8.32-9.22, రా.10.13-10.59, అమృతఘడియలు: మ.2.56-4.39, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అఫ్ఘాన్‌లో భూకంపం

800 మందికి పైగా మృతి



కునార్‌లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

2,800 మందికి గాయాలు

మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం

భారత్ తక్షణ సాయం.. 15 టన్నుల ఆహారం, వెయ్యి గుడారాలు

ఆదుకోవాలని అన్ని దేశాలకూ తాలిబన్ ప్రభుత్వం వినతి

కాబూల్/ న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: భారీ భూకంపం అఫ్ఘానిస్థాన్‌ను కుదిపేసింది. ఇంతవరకు 802 మంది మరణించగా, 2,800 మంది గాయపడ్డారని అధికారవర్గాలు తెలిపాయి. మారుమూల పర్వత ప్రాంతాల్లో భూకంపం సంభవించడం, అక్కడ ఎడతెరిపి లేకుండా భారీగా వర్షాలు కురుస్తుండడం, కొండచరియలు

మిగతా 11వ పేజీలో...

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు తగవు



భారత వైఖరితో ఏకీభవించిన షాంఘై సహకార సంస్థ

పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ఉమ్మడి ప్రకటన

జూన్‌లో ఎస్‌సీవో రక్షణ మంత్రుల భేటీలో రూపొందించిన ప్రకటనలో పహల్గాం అంశం లేకపోవడంపై భారత్ నిరసన

సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి నాడు నిరాకరణ

తాజాగా పహల్గాం దాడిని ఖండిస్తూ ఎస్‌సీవో డిక్లరేషన్

ఇది భారతదేశానికి అతిపెద్ద దౌత్య విజయం: నిపుణులు

అభివృద్ధి బ్యాంకు ఏర్పాటుకు సభ్యదేశాల ఆమోదం

తియాన్జిన్, సెప్టెంబరు 1: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని.. షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు ఆమోదనీయం కాదన్న భారత వైఖరితో ఏకీభవించాయి. భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, పలు దేశాల నాయకులతో తియాన్జిన్‌లో రెండురోజులుగా జరుగుతున్న ఎస్‌సీవో వార్షిక సదస్సు సోమవారం

మిగతా 2వ పేజీలో...



◀ ఎస్‌సీవో సదస్సులో పుతిన్, జిన్‌పింగ్‌లతో మోదీ; పుతిన్‌తో మోదీ సంభాషణ (నిలబడి చూస్తున్న పాక్ ప్రధాని) ▶

ఉగ్రవాదంపై పోరు.. మానవత్వం పట్ల మన బాధ్యత

టెర్రరిస్టులకు కొన్ని దేశాల బహిరంగ మద్దతు

ఆమోదయోగ్యమేనా: ఎస్‌సీవోలో ప్రధాని మోదీ

పాక్ ప్రధాని షెహబాజ్ సమక్షంలోనే నిప్పులు

ప్రపంచశాంతికి భారత్-రష్యా స్నేహం కీలకం!

ఆర్థిక, వాణిజ్య, ఇంధన రంగాల్లో సహకారంపై మోదీ, పుతిన్ చర్చలు.. పుతిన్ కారులోనే వేదిక వద్దకు..

దాదాపు గంటపాటు కారులోనే చర్చలు

'బ్రాహ్మణులే లాభపడుతున్నారు.. తక్కినవారి ప్రయోజనాలు బలి: ట్రంప్ సలహాదారు నవరో

ముత్తుకూరులో 25 లక్షలు ఖర్చుపెట్టి 'చదును' చేసిన భూమి ఇదేనట



చేయని చదునుకు సాయం!

కూటమిలోనూ వైసీపీ నేతలదే రాజ్యం

జగనన్న కాలనీల్లో నాడు ఉత్తుత్తి చదును

ఆ పనులపై తనిఖీలకు కూటమి ఆదేశం

అయినా, వారికి బిల్లులు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారుల ఉత్సాహం

కోర్టుకు వెళ్లే వైసీపీ నేతలకు పూర్తి సహకారం

తనిఖీల విషయం కావాలనే దాస్తున్న వైనం

దీంతో కోర్టుల్లో నేతలకు అనుకూలంగా తీర్పులు

నెల్లూరు జిల్లా ముత్తుకూరులో జగనన్న కాలనీ కోసం గత ప్రభుత్వం కేటాయించిన స్థలం అప్పుడూ, ఇప్పుడూ నీళ్లలోనే ఉంది. కాంట్రాక్టర్ ఒక్క ట్రాక్టర్ మట్టి కూడా పోయలేదు. అయినా... చదును పనులు చేసినట్టు అప్పట్లో నమోదు చేయించుకున్నారు. ఆయన మండల వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి అనుచరుడు కావడంతో అప్పట్లో అధికారులు తలొగ్గారు. జరగని ఆ పనులను జరిగినట్లుగా రికార్డు చేశారు. కొత్త ప్రభుత్వం రాగానే జగనన్న కాలనీల్లో జరిగిన చదును పనులపై తనిఖీలకు ఆదేశించింది. తనిఖీల బృందం ముత్తుకూరుకు ఎప్పుడు వెళ్లి చూసినా అక్కడి కాలనీ స్థలం నీళ్లలోనే ఉంది. అయినా, గత ప్రభుత్వంలో 'చేసిన' పనులకు మొత్తం రూ.25 లక్షల మేర బిల్లులు చెల్లించాలని ఆ కాంట్రాక్టరు కోర్టుకు వెళ్లారు. అక్కడ పనులు జరగలేదని కోర్టుకు తెలిపి... బిల్లును తోసిపుచ్చాల్సిన అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించారు. రూ.19 లక్షలు చెల్లించేశారు! అప్పుడంటే వైసీపీ ఒత్తిళ్లతో తప్పులు! మరి ఇప్పుడు ఏమైందని ఈ బిల్లులు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో కొందరు కాంట్రాక్టర్లు 'జగనన్న కాలనీల' చదును వంకతో డబ్బులు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ ఇప్పుడు తిరిగి వారే బిల్లులు చేసుకుంటున్నారు. ఆ ప్రభుత్వంలో వీరంతా అడ్డగోలుగా జేబులు నింపుకొన్నారు. ఈ ప్రభుత్వంలో ఇప్పుడు కూడా వారే యమజోరును ప్రదర్శిస్తున్నారు. అధికారుల సహకారంతో కోర్టులో కేసులు వేసి అనుకూల తీర్పులు పొందుతున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో

మిగతా 14వ పేజీలో...

దమ్ముంటే సభకు రండి

అభివృద్ధి ఎవరిదో.. విధ్వంసం ఎవరిదో చర్చిద్దాం

వైసీపీకి చంద్రబాబు సవాల్.. అదో ఫేక్ పార్టీ అని ధ్వజం



రాజంపేట మండలం బోయనపల్లెలో 88 ఏళ్ల పఠాన్ మస్తాన్‌బీకి పింఛన్ ఇచ్చి మాట్లాడుతున్న చంద్రబాబు

సూపర్‌సిక్స్ పథకాల నుంచి ప్రాజెక్టుల దాకా..

బాబాయ్ హత్య, దళిత డ్రైవర్ శవం డోర్ డెలివరీ

కోడికత్తి డ్రామా, గులకరాయి ఎపిసోడ్ వరకూ

వీటన్నిటిపైనా మాట్లాడదాం సిద్ధమా?

నాడు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కదా!

అసెంబ్లీకి రాకుండా తప్పుడు ప్రచారాలా?

వచ్చే ఎన్నికల్లోనూ ఎన్డీఏదే గెలుపు

పులివెందులలో కూడా విజయం సాధిస్తాం

రాజంపేట సభలో ముఖ్యమంత్రి ఉద్ఘాటన

ములక్కాయలపల్లెలో మహిళకు రూ.15 వేల దివ్యాంగ పెన్షన్

దోబీఘాట్‌లో రజకులతో మాటామంతీ

రాయచోటి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): "మీకు ధైర్యం ఉంటే.. చిత్తశుద్ధి ఉంటే.. మీ 11 మంది ఎమ్మెల్యేలూ అసెంబ్లీకి రండి.. పింఛన్లు సహా ఏ అంశంపైనైనా చర్చిద్దాం. నాడు సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు కదా! నేడు సూటిగా అడుగుతున్నా.. అసెంబ్లీకి సిద్ధమా? ఎవరిది సంక్షోభ పాలనో? ఎవరిది సంక్షేమ రాజ్యమో తేల్చేద్దాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి సవాల్ విసిరారు. ఎవరిది విధ్వంసమో ఎవరిది అభివృద్ధి పాలనో. శాసనసభ సాక్షిగా తేల్చేద్దామన్నారు. సూపర్ సిక్స్ పథకాల నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకూ, పెట్టుబడుల నుంచి పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల వరకూ, బాబాయ్ హత్య నుంచి దళిత డ్రైవర్ శవం డోర్ డెలివరీ దాకా, కోడికత్తి డ్రామా నుంచి గులకరాయి ఎపిసోడ్ వరకు చర్చిద్దామని సవాల్ చేశారు. సభకు రాకుండా.. ఫేక్ మీడియాతో తప్పుడు ప్రచారాలు చేస్తామంటే మాత్రం కుదరదన్నారు. 'పేదలకు సేవ' కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆయన పర్యటించారు. తొలుత ములక్కాయలపల్లె వెళ్లి అనారోగ్యంతో 14 ఏళ్లుగా మంచంపైనే జీవనం సాగిస్తున్న మహిళకు

మిగతా 13వ పేజీలో...

30 ఏళ్లలో ఒక్క రోజూ సెలవు తీసుకోలేదు!

తొలిసారి సీఎం అయినప్పుడు పింఛను రూ.75 చేశా

2014లో రూ.200 నుంచి వెయ్యి, తర్వాత 2 వేలకు పెంచా

ఇప్పుడు 4 వేలకు తీసుకెళ్లా: సీఎం

13

విమర్శలకు భయపడితే అక్కడే ఆగిపోతాం

కొత్తగా ఆలోచిస్తేనే ఉత్తమ ఫలితాలు: చంద్రబాబు.. గతం స్ఫూర్తితో భవిష్యత్‌కు ప్రణాళికలు

ప్రజలకు మంచి జరుగుతుందంటే ముందుకెళ్లడమే.. రొటీన్‌కు భిన్నంగా పనిచేస్తే అద్భుత ఫలితాలు

అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేశా.. కాబట్టే ఇన్నేళ్లు రాజకీయాల్లో ఉన్నా: సీఎం

చంద్రబాబును '30' అభినందనలతో ముంచెత్తిన అధికారులు, ప్రజాప్రతినిధులు

వైద్య విద్యలో ప్రవేశానికి.. 'నాలుగేళ్ల స్థానికత' తప్పనిసరి



9 నుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలో చదవాల్సిందే

తెలంగాణ ప్రభుత్వ జీవో 33ను సమర్థించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు ఉత్తర్వుల కొట్టివేత

4 కేటగిరీలకు ప్రత్యేక మినహాయింపు

12

స్థానికత అంశంపై సుప్రీంకోర్టు తుది తీర్పు

వైద్య విద్యలో ప్రవేశాలకు లైన్ క్లియర్

ఎరువుల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

13

విజిలెన్స్ తనిఖీల్లో భారీగా బయటపడ్డ నిల్వలు

2,845 టన్నులు స్వాధీనం.. 199 కేసులు నమోదు

ఎవర్నీ ఉపేక్షించొద్దు: సీఎం చంద్రబాబు

కాకినాడ పోర్టుకు 40 వేల టన్నుల యూరియా

ఇండోనేషియా నుంచి భారీ నౌకలో రాక

ఉత్తర కోస్తాకు రెడ్ అలర్ట్

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

నాలుగు జిల్లాలకు అతిభారీ వర్షాలు

కోస్తాలో ఐదో తేదీ వరకు వానలే

3

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు: విపత్తుల సంస్థ



కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌దే ప్రధాన పాత్ర

కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణ

ఆయన, సంతోష్‌రావు అవినీతి అనకొండలు

వారిద్దరి వల్లే కేసీఆర్‌కు మరక

వాళ్ల వెనుక రేవంత్‌రెడ్డి

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే తోలుతీస్తా!

కేసీఆర్ కుమార్తె హెచ్చరిక

హరీశ్‌కు బీఆర్ఎస్ బాసట

నేడో రేపో కవిత సస్పెన్షన్?

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో కుటుంబ విభేదాలు మరింత ముదిరాయి. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో అప్పటి మంత్రి హరీశ్‌రావుదే ప్రధాన పాత్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణ చేశారు. ఆయన, మాజీ ఎంపీ సంతోష్‌రావు (జోగినపల్లి సంతోష్ కుమార్) అవినీతి అనకొండలని, వీరిద్దరి వల్లే కాళేశ్వరం ఎపిసోడ్‌లో తన తండ్రి కేసీఆర్‌కు మరక అంటిందని చెప్పారు. సోమవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'నీళ్లకోసం కేసీఆర్ ఆలోచిస్తే.. వీళ్లు మాత్రం పెద్దపెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఆస్తులు పెంచుకోవాలని ఆలోచించారు. ఐదేళ్లు సాగునీటి మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో ప్రధాన పాత్ర లేదా? అందుకే కదా.. రెండో విడతలో పార్టీ అధినేత ఆయన్ను తప్పించింది. ఇదే హరీశ్‌రావు, సంతోష్‌రావు నాపై ఎన్ని కుట్రలు చేసినా.. భరించాను. నాపై బహిరంగంగా మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటి వరకు నాపై

మిగతా 12వ పేజీలో...

ఓట్ల చోరీపై.. త్వరలోనే హైడ్రోజన్ బాంబు!



పట్నాలో ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సభలో రాహుల్

మేం బయటపెట్టే వివరాలతో మోదీ ముఖం చూపలేరు

బీజేపీ వాళ్లు ఇందుకు సిద్ధంగా ఉండాలి: రాహుల్

బిహార్ సీఎం నితీశ్ అవినీతి భీష్ముడు: తేజస్వీ యాదవ్

పట్నాలో ముగిసిన 'ఓటర్ అధికార యాత్ర'

పట్నా, సెప్టెంబరు 1: ఓట్ల చోరీకి సంబంధించి 'హైడ్రోజన్ బాంబు'లాంటి వివరాలను బయటపెట్టబోతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారు. అవి చూశాక ప్రధాని మోదీ దేశానికి ముఖం చూపించలేరని అన్నారు. బిహార్లో ఓటరు జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా గత నెల 16న ఆయన ససారంలో ప్రారంభించిన 'ఓటర్ అధికార యాత్ర' సోమవారం పట్నాలో

మిగతా 2వ పేజీలో...

ఆరోగ్యానికి తీపి కబురు

తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎఫ్‌వోఎస్ ప్లాంట్



- నిజామాబాద్ సమీపంలో 2027 కల్లా నిర్మాణం పూర్తి
- బీఐఆర్ఏసీ సహకారంతో నిర్మిస్తున్న రివిలేషన్స్ బయోటెక్
- చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఎఫ్‌వోఎస్ వినియోగం
- 20 వేల టన్నుల సామర్థ్యం.. 700 మందికి ఉపాధి అవకాశాలు

12

గాల్లో తేలినట్టుందే!



కైలాసగిరిపై స్కై బ్రిడ్జి

అద్దాల వంతెనపై నుంచి విశాఖ అందాల వీక్షణ


రాష్ట్రంలో తొలిసారిగా కైలాసగిరిపై స్కై బ్రిడ్జి ఏర్పాటు

విశాఖ తీరంలో సిద్ధమవుతున్న మరో పర్యాటక ఆకర్షణ

14

రష్యా చమురుతో 'బ్రాహ్మణులే' లాభపడుతున్నారు

- రష్యాకు భారత్ ఓ లాండ్రీవాలా
- మళ్లీ నోరు పారేసుకున్న నవారో



వాషింగ్టన్, సెప్టెంబరు 1: భారత్‌పై నోరుపారేసుకోవడమే పనిగా పెట్టుకున్న వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరింతగా రెచ్చిపోయారు. రష్యా చమురు వ్యవహారంలో బ్రాహ్మణులే లాభపడుతున్నారని వ్యాఖ్యానించారు (ఆయన ఏ అర్థంలో ఆ వ్యాఖ్యలు చేశారో తెలియదు గానీ.. అమెరికాలో అత్యంత సంపన్నులైన వ్యాపారవర్గాలకు చెందిన ప్రొటెస్టెంట్లను బోస్టన్ బ్రాహ్మిన్స్‌గా వ్యవహరిస్తారు. ఈ వ్యవహారంలో సంపన్నులైన వ్యాపారులే లాభపడుతున్నారనే అర్థంలో నవారో ఈ వ్యాఖ్యలు చేసినట్టు కొంతమంది చెబుతున్నారు). చైనా, రష్యాలకు భారత్ దగ్గర అవుతుండటంపై 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నవారో అక్కసు వెళ్లగక్కారు. మోదీ వంటి గొప్ప ప్రజాతంత్ర నాయకుడు.. పుతిన్, జిన్‌పింగ్‌లతో ఎందుకు అంటకాగుతున్నారో తనకు తెలియడం లేదన్నారు. 'ఇదంతా 'బ్రాహ్మణులు' చేస్తున్నారు. వారు తమ లాభాల కోసం తక్కిన జనం ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. ఈ విషయం భారత ప్రజలు తెలుసుకోవాలి." అని అన్నారు. "ముడిచమురుపై మోదీకి పుతిన్ రాయితీలు ఇచ్చారు. భారత్‌లో దానిని శుద్ధిచేయించి, యూరప్, ఆఫ్రికా, ఆసియాలకు సరఫరా చేసి పెద్దఎత్తున డబ్బులు చేసుకుంటున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ఈ డబ్బులను వాడుతున్నారు. అలాంటప్పుడు సుంకాల చెల్లింపుదారులుగా అమెరికా ఏం చేయాలి." అని నవారో ప్రశ్నించారు. భారత్ సుంకాల మహారాజులా మారిందన్న ఆయన, క్రెమ్లిన్‌కు ల్యాండ్రోమ్యాట్‌గా (లాండ్రీవాలా) భారత్ పని చేస్తోందని నోరు పారేసుకున్నారు. కాగా.. నవారో వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజెన్లు తీవ్ర విమర్శలు కురిపిస్తున్నారు. ప్రధాని మోదీ వాణిజ్య సలహామండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ నవారో వ్యాఖ్యలను ఖండించారు. బ్రాహ్మణులను ఉద్దేశించి నవారో చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని, అవి ఆయన కురచబుద్ధిని బయటపెట్టాయని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆగ్రహం వ్యక్తం చేశారు. "అమెరికాలో బ్రాహ్మణ పదానికి వేరే అర్థం ఉంది. సంపన్న కులీన వర్గాన్ని ఆ పేరుతో పిలుస్తారు. దానికీ, కుల వ్యవస్థకూ సంబంధమే లేదు. కానీ, దురుద్దేశంతో ఆ పదాన్ని నవారో ఉపయోగించారు." అని ఆమె మండిపడ్డారు. ఇదిలా ఉండగా, రష్యా, చైనా, భారత్ ఒక వేదిక మీదకు వచ్చిన వేళ...భారత్‌పై అమెరికా అనూహ్యంగా స్వరం మార్చింది. నిన్నటిదాకా నోటికి వచ్చినట్టు భారత్‌పై విమర్శలు చేసిన అమెరికా ప్రభుత్వం ఒక్కసారిగా స్నేహగీతికను ఆలపించింది. "21వ శతాబ్దంలో మా సంబంధాలు కొత్త శిఖరాలను తాకుతున్నాయి. మా బంధం అర్థవంతమైంది. మమ్మల్ని ముందుకు తీసుకెళ్లే పలు అంశాలపై ఈ నెలలోనే దృష్టి సారించనున్నాం" అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు.

అమెరికా బెదిరింపులు సాగవు: జిన్‌పింగ్

టియాంజిన్, సెప్టెంబరు 1: ఎస్‌సీవో సదస్సు వేదికగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ సమాజంలో బెదిరింపు ధోరణిని అంగీకరించబోమని, నిష్పాక్షిత, న్యాయం, బహుళత్వానికి ప్రాధాన్యం ఉండాలని జిన్‌సింగ్ అన్నారు. చైనాతో సహా ఇతర దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని ఉద్దేశించే జిన్‌సింగ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. సదస్సులో జిన్‌సింగ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి కేంద్రీకృత వ్యవస్థలైన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటి వాటిని రక్షించుకోవాలన్నారు. ఎస్‌సీవో సభ్యదేశాలు పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విభేదాలను పక్కనపెట్టి ఒక్కటవ్వాలని, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఏకాభిప్రాయంతో ఉండాలని అన్నారు. అప్పుడే ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి సాధ్యమన్నారు.

షాంఘై సదస్సులో పాక్ ప్రధానికి పరాభావం!

తియాన్‌జిన్, సెప్టెంబరు 1: ఎస్సీవో సదస్సు సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్‌కు పరాభవం ఎదురైంది. ఆయనను సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న చైనా అధ్యక్షుడు జీన్‌పింగ్ సహా భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు పట్టించుకోలేదు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోదీ, జిన్‌పింగ్, పుతిన్ కరచాలనాలు చేసుకుంటూ.. సరదాగా మాట్లాడుకుంటూ.. చిరునవ్వులు చిందిస్తూ కనిపించగా.. షెహబాజ్ ఒంటరిగా ఉండిపోయారు. సదస్సు వేదిక వద్దకు కలిసి వచ్చిన మోదీ, పుతిన్‌కు జిన్‌పింగ్ స్వాగతం పలికారు. సదస్సుకు హాజరైన వివిధ దేశాధినేతలు వేచి చూస్తుండగా మోదీ, పుతిన్, జిన్‌పింగ్ పలకరింపుల తర్వాత మాటల్లో పడిపోయారు. వారి ముచ్చట్లు, నవ్వుల్లో రెండు నిమిషాలు దొర్లిపోయాయి. తర్వాత మోదీ, పుతిన్ నడిచి వెళుతుండగా మధ్యలో షెహబాజ్ నిల్చుని ఉన్నప్పటికీ వారు పట్టించుకోకుండా మాట్లాడుకుంటూ ముందుకు సాగిపోయారు. పహల్గాం ఉగ్ర దాడి, దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత మోదీ, షెహబాజ్ ఎదురుపడడం ఇదే తొలిసారి.

భారత్, చైనా సంబంధాల్లో పురోగతి భేష్

- మోదీ, జిన్‌పింగ్ చర్చలను స్వాగతించిన వామపక్షాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ఎస్సీవో సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ జరిపిన చర్చల ఫలితంగా ఇరు దేశాల సంబంధాల మధ్య పురోగతిని వామపక్ష పార్టీలు స్వాగతించాయి. మోదీ, జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం సానుకూల ఫలితాన్ని ఇచ్చిందని సోమవారం సీపీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచంలోనే పురాతన నాగరికత గల భారత్, చైనా ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని ఈ సమావేశం పునరుద్ఘాటిస్తోందని వ్యాఖ్యానించింది. భారత్, చైనా సంబంధాల్లో పురోగతిని సీపీఎం స్వాగతించింది. 'భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75వ వార్షికోత్సవం సందర్భంగా ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాల్లో సానుకూల పురోగతి కనిపిస్తోంది. ఇది శుభ సూచకం' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు.

భారత్, చైనాపై మీరూ సుంకాలు విధించండి

- ఐరోపా సమాఖ్యపై అమెరికా ఒత్తిడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: భారత్‌పై తాము విధించినట్లే యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూడా అదనపు సుంకాలు వేయాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. దీంతో పాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును ఆపివేయాలని కూడా కోరుతోంది. అలాగే, రష్యాపై తాను మాత్రమే ఒత్తిడి తేవడం కాకుండా.. ఈయూ కూడా కలిసి రావాలని అమెరికా పట్టుబడుతోంది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలుపై ఈయూ పూర్తి నిషేధం విధించాలని అడుగుతోంది. ఈ విషయాలను ఇండియా టుడే, అమెరికాకు చెందిన న్యూస్ వెబ్‌సైట్ యాక్సియస్.. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కథనాలు ప్రచురించాయి. ఈయూ కూడా భారత్‌తో పాటు చైనాపై అదనపు సుంకాలు విధించాలని అమెరికా కోరినట్లు ఇండియా టుడే పేర్కొంది.

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

ముగిసింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలనే తమ దృఢ సంకల్పాన్ని ఎస్‌సీవో సభ్య దేశాలు ఈ సందర్భంగా ఒక ఉమ్మడి ప్రకటన ద్వారా వెల్లడించాయి. ఉగ్రవాద, వేర్పాటువాద, తీవ్రవాద వ్యతిరేక పోరాటానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. అలాంటి గ్రూపులను స్వార్థ ప్రయోజనాలకు వాడుకునే ప్రయత్నాలు అంగీకారయోగ్యం కావని ఆ డిక్లరేషన్‌లో స్పష్టం చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని.. దేశాల సరిహద్దులు దాటి వెళ్లే ఉగ్రవాదుల కదలికలను నిరోధించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చాయి. అలాగే.. గాజాలో ఇజ్రాయెల్ సైనిక దాడులను, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక దాడులను, పాక్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్ ఖుజ్దర్‌లో, జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన ఉగ్రదాడులను కూడా ఎస్‌సీవో సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇరాన్‌లోని పౌరులను, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల వల్ల ఎంతో మంది సామాన్యులు మరణించారని.. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను, ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని మండిపడ్డాయి. ఉగ్ర దాడుల వెనుక సూత్రధారులను, వారికి సహకరించినవారిని, దాడులకు పాల్పడినవారిని చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షించాలని ఎస్‌సీవో సభ్యదేశాలు పేర్కొన్నాయి. ప్రపంచంలోని అన్ని ఉగ్రవాద గ్రూపులనూ ఉమ్మడిగా ఎదుర్కొనే విషయంలో కీలకపాత్ర ఐక్యరాజ్యసమితిదే అని తమ సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి.

భారత్ విజయం..


ఎస్‌సీవో డిక్లరేషన్‌లో పహల్గాం ఉగ్రదాడి అంశం ఉండడం భారత్ సాధించిన అతిపెద్ద దౌత్య విజయం. ఎందుకంటే.. ఈ ఏడాది జూన్ 26న చైనాలోని చింగ్దావ్‌లో ఎస్‌సీవో సభ్యదేశాల రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఆ సమావేశానికి మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. అయితే.. ఆ భేటీలో రూపొందించిన ముసాయిదా సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి ఆయన నిరాకరించారు. బలూచ్ ప్రావిన్స్‌లో జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తూ పాక్‌కు అనుకూలంగా రూపొందించిన ఆ ప్రకటనలో.. పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడమే అందుకు కారణం. పహల్గాం దాడిని ఆ ప్రకటనలో చేర్చడానికి ఒక దేశం అభ్యంతరం వ్యక్తం చేసిందని.. చేర్చకపోవడంపై రాజ్‌నాథ్ ఆగ్రహం వెలిబుచ్చారని.. దీంతో ఆ ప్రకటన ఆమోదం పొందలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ అప్పట్లో తెలిపారు. ఆ పరిణామం జరిగిన రెండు నెలల్లోనే.. పాకిస్థాన్, చైనా రెండూ సభ్య దేశాలుగా ఉన్న ఎస్‌సీవో పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేయడం.. అంతటితో సరిపెట్టకుండా, సరిహద్దుల వద్ద ఉగ్రవాదుల కదలికలపై కన్నేసి ఉంచాలని పాకిస్థాన్‌కు పరోక్షంగా చురకలంటించే వ్యాఖ్యలు అందులో ఉండడం.. అలాంటి ప్రకటనపై పాక్‌తో పాటు, ఆ దేశంతో అంటకాగే చైనా కూడా సంతకం చేయడం.. భారత్ సాధించిన అతిపెద్ద దౌత్య విజయంగా విదేశాంగ వ్యవహారాల నిపుణులు పేర్కొంటున్నారు.



ఎస్‌సీవో సదస్సు సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్‌తో ప్రధాని మోదీ ముచ్చట్లు

అభివృద్ధి బ్యాంకు ఏర్పాటుకు ఆమోదం

ప్రాంతీయ సామర్థ్యాన్ని, సామాజిక అభివృద్ధిని పెంపొందించడానికిగాను ఒక అభివృద్ధి బ్యాంకును ఏర్పాటు చేయాలని 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాలు నిర్ణయించినట్టు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ వెల్లడించారు. చైనా చేసిన ఈ ప్రతిపాదనపై పదేళ్లపాటు చర్చించిన అనంతరం సభ్యదేశాలు దానికి ఆమోదం తెలిపాయని ఆయన వివరించారు. అయితే.. ఈ బ్యాంకు ఎప్పటిలోగా ఏర్పాటు చేయనున్నారనే విషయమై ఆయన ఎలాంటి వివరాలూ తెలపలేదు. అలాగే.. లావోస్‌ను ఎస్‌సీవోలో కొత్త భాగస్వామిగా చేరినట్టు ఆయన వెల్లడించారు. 2001లో షాంఘైలో ఏర్పాటైన ఎస్‌సీవోలో.. భారత్, రష్యా, చైనా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, పాకిస్థాన్, ఇరాన్, బెలారస్ సభ్యదేశాలుగా ఉన్నాయి.



ఉగ్రవాదంపై పోరు.. మన బాధ్యత

- మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్క దేశానికీ పహల్గాం ఉగ్రదాడి బహిరంగ సవాల్ వంటిది: ఎస్‌సీవోలో ప్రధాని మోదీ

తియాన్జిన్, సెప్టెంబరు 1: ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలను విడనాడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని మానవత్వం పట్ల మన బాధ్యతగా అభివర్ణించారు. చైనాలోని తియాన్జిన్‌లో జరిగిన ఎస్‌సీవో వార్షిక సదస్సులో.. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తదితర దేశాధినేతల సమక్షంలో ప్రసంగించిన ఆయన.. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. అది కేవలం భారత్‌పై జరిగిన దాడి మాత్రమే కాదని.. మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి దేశానికీ అది ఒక బహిరంగ సవాల్ వంటిదని ఆయన పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం.. ఆ విషాద సమయంలో భారతదేశానికి అండగా నిలిచిన అన్ని స్నేహపూర్వక దేశాలకూ మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదం కొన్ని దేశాల భద్రతకు మాత్రమే పొంచి ఉన్న ముప్పు కాదని.. మొత్తం మానవాళికే అది ఉమ్మడి సవాల్ అని వ్యాఖ్యానించారు. "కానీ కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బహిరంగంగా మద్దతు పలుకుతున్నాయి. ఇది మనకు అంగీకారయోగ్యమేనా?" అని ప్రశ్నించారు. "ఏ దేశమూ, ఏ సమాజమూ, ఏ ఒక్క పౌరుడూ ఉగ్రవాదం నుంచి తాము సురక్షితంగా ఉన్నామని భావించలేని పరిస్థితి. అందుకే ఉగ్రవాదంపై పోరాటంలో ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత్ పదేపదే నొక్కిచెబుతోంది" అని స్పష్టంచేశారు. "ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ ప్రమాణాలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదనే విషయాన్ని మనం స్పష్టంగా, ముక్తకంఠంతో చెప్పాలి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే దాన్ని ఉమ్మడిగా వ్యతిరేకించాలి. ఇది మానవత్వం పట్ల మన కర్తవ్యం" అని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాగా.. 'ఎస్‌సీవో'కు మోదీ తనదైన భాష్యం చెప్పారు. ఎస్ అంటే సెక్యూరిటీ (భద్రత), సీ అంటే కనెక్టివిటీ (అనుసంధానం), ఓ అంటే ఆపర్చునిటీ (అవకాశం) అనే మూడు పిల్లర్లపై ఎస్‌సీవో నిలిచి ఉందని ఆయన పేర్కొన్నారు. ఏ దేశ అభివృద్ధికైనా భద్రత, శాంతి, స్థిరత్వం పునాదుల వంటివని.. ఆ వృద్ధి పథంలో ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం ప్రధాన సవాళ్లుగా నిలుస్తాయని అన్నారు.

చైనాకు చురకలు..

ప్రాంతీయ వృద్ధి, అభివృద్ధికి అనుసంధానం (కనెక్టివిటీ) ఎంత ముఖ్యమైనదో కూడా ప్రధాని మోదీ తన ప్రసంగంలో తెలిపారు. అయితే.. ఆ అనుసంధానం కోసం చేసే ప్రతి ప్రయత్నం సార్వభౌమత్వ సూత్రాలను, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని.. ఎస్‌సీవో చార్టర్‌లోని ప్రధాన సూత్రాల్లో దీన్ని కూడా పొందుపరచారని గుర్తుచేశారు. సార్వభౌమత్వాన్ని పట్టించుకోని అనుసంధానం చివరికి నమ్మకాన్ని, అర్థాన్ని కోల్పోతుందని వ్యాఖ్యానించారు. తద్వారా చైనా తలపెట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'ను పరోక్షంగా విమర్శించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్లే ఈ ప్రాజెక్టును భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే.. ఎస్‌సీవో సభ్య దేశాల ప్రాచీన నాగరికతల, కళల, సాహిత్య సంపదను, సంప్రదాయాలను ప్రపంచ వేదికపై పంచుకునేలా ఒక చర్చా వేదికను ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల) అభివృద్ధి సాధనకు కృషి చేయడం ఎంత ముఖ్యమో పేర్కొన్నారు. ఆయా దేశాల ఆకాంక్షలను కాలంచెల్లిన పాత విధానాలు, పాత నియమాల చట్రంలో బంధించి ఉంచడమంటే.. భవిష్యత్ తరాలకు అన్యాయం చేయడమేనని ఆందోళన వెలిబుచ్చారు.

ప్రపంచశాంతికి భారత్-రష్యా స్నేహం కీలకం!

- పుతిన్ రాక కోసం భారతీయుల ఎదురుచూపులు
- ఉక్రెయిన్‌లో శాంతి.. యావత్ మానవాళి కోరిక: మోదీ

బీజింగ్, సెప్టెంబరు 1: అత్యంత క్లిష్ట సందర్భాల్లో కూడా భారత్-రష్యా భుజం భుజం కలిపి నడిచాయని, ఇరుదేశాల సంబంధాలు ప్రపంచశాంతికి, సుస్థిరతకు కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. డిసెంబరులో రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక కోసం 140 కోట్ల మంది భారతీయులు ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. సోమవారం చైనాలోని టియాన్‌జిన్‌లో 'షాంఘై సహకార సంఘం' (ఎస్‌సీఓ) వార్షిక శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో పుతిన్‌తో మోదీ సమావేశమయ్యారు. ఆర్థిక, వాణిజ్య, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే దిశగా ఇరు నేతలు చర్చలు జరిపారు. ఎరువుల అంశానికి కూడా చర్చల్లో ప్రాధాన్యం లభించింది. చర్చలపై మోదీ, పుతిన్‌ల స్పందనను వెల్లడిస్తూ ఇరుదేశాలు అధికారిక ప్రకటనలు వెలువరించాయి. మోదీ స్వయంగా ఎక్స్‌లో తన స్పందనను వెల్లడించారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన కోసం జరుగుతున్న ప్రయత్నాలను భారత్ స్వాగతిస్తుందని, ఘర్షణల నివారణ జరగాలని యావత్ మానవాళి కోరుకుంటున్నదని తెలిపారు. శాంతియుత పరిస్థితులు చిరకాలం పాటు నిలిచి ఉండేలా అన్ని భాగస్వామ్యపక్షాలు నిర్మాణాత్మక అడుగులు వేయాలని అభిలషించారు. కాగా, రష్యా-భారత్ దశాబ్దాలుగా పరస్పర విశ్వాసంతో కూడిన స్నేహాన్ని కొనసాగిస్తున్నాయని, భవిష్యత్ సంబంధాలకు ఇదే పునాది అని పుతిన్ పేర్కొన్నారు. ఇరుదేశాల స్నేహం పార్టీల రాజకీయాలకు అతీతమైనదని, ఇరుదేశాల ప్రజలు కూడా దీనికి మనస్ఫూర్తిగా మద్దతిస్తున్నారని తెలిపారు. పలు స్థాయిల్లో రష్యా-భారత్ సహకారం కొనసాగుతోందని, ఇరుదేశాల మధ్య పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ వేదికలపై అత్యంత సమన్వయంతో వ్యవహరిస్తున్నామని పేర్కొంటూ ఐరాస, బ్రిక్స్, జీ20, ఎస్‌సీఓల గురించి పుతిన్ ప్రస్తావించారు.



మోదీ కోసం వేచి చూసిన పుతిన్

ద్వైపాక్షిక చర్చలకు వేదికైన భవనాన్ని చేరుకోవటానికి మోదీ, పుతిన్.. ఎస్‌సీఓ సదస్సు ప్రాంగణం నుంచి పుతిన్ కారులో ప్రయాణించారు. ఈ సందర్భంగా, మోదీ రాక కోసం పుతిన్ దాదాపు 10 నిమిషాలు వేచి ఉండటం విశేషం. అనంతరంకారులోనే నేతలిద్దరూ పలు అంశాలపై మాట్లాడుకున్నారని, వేదిక వద్దకు కారు చేరుకున్న తర్వాత కూడా.. దాదాపు 50 నిమిషాలు కారులో ఉండి సంభాషించుకున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్‌పై ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు.. ముఖ్యంగా, రష్యా నుంచి చమురు కొంటున్నందుకు అదనంగా మరో 25 శాతం సుంకం మోపడంపై మోదీ, పుతిన్ కారులో మాట్లాడుకున్నట్లు సమాచారం.

సుంకాలు సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకొచ్చింది



న్యూయార్క్/వాషింగ్టన్, సెప్టెంబరు 1: భారత్‌ను లక్ష్యంగా చేసుకొని నిరాధార వ్యాఖ్యలతో పలుచనవుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మనదేశంపై విధించిన అధిక సుంకాలను సమర్థించుకుంటూ మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. సుంకాలను సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకొచ్చిందని, అయితే ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో ప్రధాని మోదీ సమావేశమైన కొన్నిగంటల్లోనే సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఓ పోస్టు పెట్టారు. భారత్‌తో అమెరికా చాలా తక్కువగా వ్యాపార సంబంధాలు కలిగి ఉందని కొందరు అనుకుంటారని.. అయితే అమెరికాలో భారత్ భారీస్థాయిలో వ్యాపారం చేస్తోందని ట్రంప్ చెప్పారు. వాణిజ్యపరంగా భారత్‌కు అమెరికా అతిపెద్ద కొనుగోలుదారు (బిగ్గెస్ట్ క్లయింట్) అని పేర్కొన్నారు. అమెరికాలో భారత్ భారీగా వస్తువులను విక్రయిస్తోందని, అమెరికా మాత్రం భారత్ విధిస్తున్న అధిక సుంకాల కారణంగా అక్కడ వస్తువులను విక్రయించలేకపోతోందని.. ఇది కొన్ని దశాబ్దాలుగా కొనసాగిందని పేర్కొన్నారు.


ఓట్ల చోరీపై త్వరలోనే హైడ్రోజన్ బాంబు!

(మొదటి పేజీ తరువాయి)

ముగిసింది. 16 రోజుల పాటు 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా 1,300 కిమీ మేర ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా పట్నాలో ఇండీ కూటమికి చెందిన బిహార్ మహాగఠ్‌బంధన్ నేతలు 'గాంధీ సే అంబేడ్కర్' ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు వారిని మార్గమధ్యంలోనే డాక్ బంగళా వద్ద ఆపేశారు. అక్కడే గుమిగూడిన ప్రజలనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. బిహార్ విప్లవ రాష్ట్రమని.. ఓట్ల చోరీని అనుమతించబోమని దేశానికి సందేశం ఇచ్చిందని స్పష్టంచేశారు. మహాత్మాగాంధీని చంపిన శక్తులు రాజ్యాంగాన్ని హత్యచేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. దీనిని తాము అనుమతించబోమని.. అందుకే యాత్ర చేపట్టామని తెలిపారు. 'దీనికి అద్భుత స్పందన వచ్చింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి 'ఓట్ల దొంగల్లారా.. గద్దె దిగండి' అని నినదించారు. బీజేపీ వాళ్లు మాకు నల్లజెండాలు చూపారు. వారికో విషయం చెబుతున్నా.. జాగ్రత్తగా వినాలి. ఆటం బాంబు కంటే హైడ్రోజన్ బాంబు పెద్దగా ఉంటుందని మీకు తెలుసా? మహదేవ్‌పురాలో ఆటంబాంబు చూపించాం. ఇప్పుడు హైడ్రోజన్ బాంబుకు సిద్ధంగా ఉండండి. మీ ఓట్ల చోరీ వాస్తవాన్ని ప్రజలు త్వరలో తెలుసుకోబోతున్నారు' అని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను చెత్తకుప్పలో పారేస్తాయని అన్నారు. ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడిన ఆయన.. ఇప్పుడు వాటి ఒడిలో కూర్చున్నారని ఎద్దేవాచేశారు. నితీశ్ అవినీతిలో భీష్మపితామహుడిలా మారారని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ధ్వజమెత్తారు. నితీశ్ మానసిక స్థితి సరిగా లేదని.. ఆయనకు ఎలాంటి విజన్ లేదని.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆయన ప్రభుత్వాన్ని తొలగిస్తారని చెప్పారు. బిహార్లో ఎస్ఐఆర్ చేపట్టడం ద్వారా ప్రధాని మోదీ, అమిత్‌షా ఈసీ సాయంతో ప్రజాస్వామ్యాన్ని తుడిచిపెట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జార్ఖండ్ సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్, వీఐపీ చీఫ్ ముకేశ్ సహానీ, సీపీఐ-ఎంఎల్ లిబరేషన్, సీపీఎం ప్రధాన కార్యదర్శులు దీపాంకర్ భట్టాచార్య, ఎంఏ బేబీ, సీపీఐ నాయకురాలు అనీ రాజా, ఉద్ధవ్ సేన ఎంపీ సంజయ్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను అవమానిస్తున్నారు

రాహుల్‌గాంధీ 'హైడ్రోజన్ బాంబు' వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ఆయన దురహంకారంతో ఓటర్లను అవమానిస్తున్నారని.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాను దిగజారుస్తున్నారని ధ్వజమెత్తింది. గతంలో ఆయన వేస్తానని చెప్పిన అణు బాంబు తుస్సుమందని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ సోమవారం ఢిల్లీలో ఎద్దేవాచేశారు. 'బీజేపీ ఘనవిజయాలకు మోసం, ఓట్ల చోరీ కారణమని అనడం ద్వారా కాంగ్రెస్ అగ్ర నేత ఈ దేశ ఓటర్లనే అవమానిస్తున్నారు. ఇది దురహంకారం. ఇందుకు గాను ఆయన్ను శిక్షించాలని ఓటర్లను అభ్యర్థిస్తాం' అన్నారు. రాహుల్ బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని.. ఎన్నికలకు, అణుబాంబు, హైడ్రోజన్ బాంబుకు సంబంధమేంటని ప్రశ్నించారు. బిహార్లో కాంగ్రెస్‌కు రాజకీయ మూలాలు లేకపోయినా.. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ రాహుల్‌కు సెకండ్ ఫిడేలుగా మారారని అన్నారు.



ఈసీ-పార్టీల మధ్య అనుమానాలు

బిహార్‌లో గందరగోళానికి కారణమిదే : సుప్రీం

'సర్' పొడిగింపునకు నిరాకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 : బిహార్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ(సర్)పై సందేహాలకు ప్రధాన కారణం రాజకీయ పార్టీలు - ఎన్నికల సంఘం మధ్య నెలకొన్న అనుమానాలేనని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది. ఆ కార్యక్రమం గడువును పొడిగించేందుకు నిరాకరించింది. ఓటర్లు, రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలు, దరఖాస్తులు ఎన్నికల సంఘానికి అందించడంలో సహకరించేందుకు పారా లీగల్ వలంటీర్లను నియమించాలని బిహార్ న్యాయ సేవల అథారిటీని ఆదేశించింది. ఆధార్ సహా ఎన్నికల సంఘం గుర్తించిన 11 ధ్రువపత్రాలను ఓటర్ల జాబితాలో చేర్పులకు అంగీకరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆర్జేడీ, ఏఐఎంఐఎం సర్‌లో ఓటర్లు తమ దరఖాస్తులు, అభ్యంతరాలు సమర్పించడానికి గడువు పొడిగించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే సర్ గడువు తేదీ సెప్టెంబరు ఒకటవ తేదీతో ముగిసింది. ఎన్నికల సంఘం సుప్రీంలో తన వాదన వినిపిస్తూ.. సర్ ద్వారా సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలు, అభ్యంతరాలకు సెప్టెంబరు ఒకటవ తేదీ తర్వాతా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. బిహార్ ఓటర్ల జాబితాలో ఉన్న 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.5 శాతం మంది సర్‌లో తమ ధ్రువపత్రాలు సమర్పించారని పేర్కొంది. కాగా సర్ ముగింపు రోజు(సెప్టెంబరు 1) సోమవారం 2.17 లక్షలకు పైగా దరఖాస్తులు ఓటర్ల జాబితా నుంచి అనర్హులను తొలగించాలని అందాయి. 36,000కు పైగా దరఖాస్తులు చేర్పులకు అందాయి.



మోదీ ప్రయాణించిన హాంగ్‌చీ కారు విశేషాలివే!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ఎస్‌సీవో సదస్సు సందర్భంగా చైనా వెళ్లిన ప్రధాని మోదీ అక్కడ 'మేడ్ ఇన్ చైనా' తయారీ అత్యంత ఖరీదైన కారుగా పేరున్న హాంగ్చీ-ఎల్5 మోడల్ కారులో ప్రయాణించిన విషయం తెలిసిందే..! ఈ కారులో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. మాండరిన్ భాషలో హాంగ్చీ అంటే.. 'ఎర్రజెండా' అని అర్థం. హాంగ్చీ-ఎల్5 ధర భారతీయ కరెన్సీలో రూ.7 కోట్లు. మొదట్లో ఈ కార్లను కమ్యూనిస్టు పార్టీ నేతల కోసం రూపొందించారు. 8.5 సెకన్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకునే ఈ కారు గరిష్ఠ వేగం గంటకు 210 కిలోమీటర్లు. క్రూయిజ్ మోడ్‌తోపాటు.. ఆల్‌వీల్ డ్రైవ్, పార్కింగ్ సెన్సర్లు, 360 డిగ్రీ కెమెరాలు దీని ప్రత్యేకత. ఇందులో విశాలమైన, విలాసవంతమైన సీట్లు ఉంటాయి. వెనక సీట్లలో మసాజ్, హీటింగ్, వెంటిలేషన్ సదుపాయాలు ఉంటాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2019లో భారత పర్యటనకు వచ్చినప్పుడు ఈ కారులోనే ప్రయాణించారు. బహిరంగ కార్యక్రమాల్లో ఈ కారును అధికంగా వాడుతారు. దీంతోపాటు.. ఆయన మరిన్ని రక్షణ సదుపాయాలు, ఆయుధాలు ఉండే హాంగ్‌చీ-ఎన్701ను కూడా వాడుతుంటారు. ఈకారును అమెరికా అధ్యక్షుడు ఉపయోగించే 'ద బీస్ట్'తో పోలుస్తారు.

ఉత్తర కోస్తాకు రెడ్ అలర్ట్

- నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం
- నాలుగు జిల్లాలకు అతి భారీ వర్షాలు
- ఎన్టీఆర్ జిల్లా వరకు భారీ వానలు
- కోస్తాలో ఐదో తేదీ వరకు వర్షాలే
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు: విపత్తుల సంస్థ

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మయన్మార్, దానికి ఆనుకుని ఈశాన్య బంగాళాఖాతంలో సోమవారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో మంగళవారం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇంకా మయన్మార్ నుంచి ఉత్తర ఒడిశా వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. ఈ ద్రోణిలో వాయవ్య బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం విలీనమైంది. వీటన్నింటి ప్రభావంతో బంగాళాఖాతం నుంచి భారీగా తేమగాలులు వీస్తుండటంతో సోమవారం ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుర్లలో 7.6, లావేరులో 6.5, జియ్యమ్మవలసలో 6.3, చీపురుపల్లి, పెద్దనడిపల్లిల్లో 6.1, నరసింగపల్లిలో 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తరకోస్తాకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మంగళవారం భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని, ఒకటి రెండుచోట్ల 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు అంచనా వేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. కోస్తాలోని మిగిలిన ప్రాంతాల్లో ఎక్కువచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపారు. అలాగే, బుధవారం కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు, అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తీరం వెంబటి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కాగా, కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 44.4 అడుగులు ఉంది. ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 11.91 లక్షల క్యూసెక్కులు ఉంది. కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 3.42 లక్షల క్యూసెక్కులు ఉంది.

నేడు విశాఖలో ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ సదస్సు

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సదస్సు మంగళవారం విశాఖపట్నంలో జరగనుంది. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సులో 20 కంపెనీలకు చెందిన సీఈఓలతో ఆయన సమావేశమవుతారు. మారిటైమ్ రంగానికి చెందిన ఆరు స్టార్టప్‌ల నిర్వాహకులతోను చంద్రబాబు సంభాషిస్తారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ఏపీని గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా మార్చేందుకు ఈ సదస్సు దోహదపడుతుంది. ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్‌ను కూడా సీఎం ప్రారంభించనున్నారు.

ప్రాజెక్టులన్నీ ఫుల్!

జలాశయాల్లో 98% నీటి నిల్వ

- ఎగువ నుంచి అధిక వరద వస్తే పరిస్థితేంటి?
- ఇప్పటికే గేట్లెత్తి సముద్రంలోకి నీరు విడుదల
- జలవనరుల శాఖ అప్రమత్తం
- రిజర్వాయర్ల వద్ద నిరంతర నిఘా
- ఇంజనీర్లు, లస్కర్ల మోహరింపు

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన నీటి ప్రాజెక్టులన్నీ కళకళలాడుతున్నాయి. అన్ని జలాశయాలూ 98 శాతం నిండాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో విద్యుదుత్పత్తి జరుగుతోంటే.. దిగువకు వస్తున్న నీటిని వచ్చింది వచ్చినట్లుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా కనిపిస్తుంటే.. ప్రజలకు ఆనందంగా ఉన్నా.. జలవనరుల శాఖ గుండెల్లో మాత్రం ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అనూహ్యంగా 2009 సెప్టెంబరులో శ్రీశైలం జలాశయానికి వచ్చిన వరద.. భారీగా కురిసిన వర్షం దానికి గుర్తుకొస్తోంది. నాటి వరద దెబ్బకు జలాశయం ప్లంజ్‌పూల్ ప్రాంతం దెబ్బతింది. ఇప్పటిదాకా మరమ్మతు చేయలేకపోయారు. ఇటీవల కేంద్ర జలశక్తి సంస్థల బృందాలు అధ్యయనం చేశాయి. అయితే వాటికి ఇవ్వాల్సిన ఫీజులు జల వనరుల శాఖ చెల్లించకపోవడంతో.. కేంద్ర సంస్థలు నివేదికలు అందజేసేందుకు నిరాకరిస్తున్నాయి. ఈ సీజన్‌లో శ్రీశైలం రిజర్వాయర్లో గరిష్ఠ స్థాయిలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద వస్తే మన రిజర్వాయర్లు జలాశయాలు తట్టుకోలేవని అంటున్నారు. ఇప్పటికే ప్రధాన రిజర్వాయర్ల గేట్లన్నీ ఎత్తేశారు. అవి జలపాతాలను తలపిస్తున్నాయి. నిరుడు బుడమేరు వరదను కూడా దృష్టిలో ఉంచుకుని.. జలవనరుల శాఖ అప్రమత్తమైంది. అన్ని జలాశయాల వద్ద ఇంజనీరింగ్ సిబ్బందిని, లస్కర్లను మోహరించి నిరంతర నిఘా చేపడుతోంది.



నిండుగా.. కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం

కృష్ణా బేసిన్‌లో జలాశయాల పరిస్థితి ఇదీ..

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ (టీఎంసీ)	ప్రస్తుత నిల్వ (టీఎంసీ)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	129.72	127.47	73000	79200
నారాయణపూర్	37.64	37.06	75000	65818
జూరాల	9.66	8.2	175000	171198
తుంగభద్ర	105.79	78.44	69633	69673
సుంకేశుల	1.24	0.92	63000	81398
శ్రీశైలం	215.81	209.06	338154	383244
నాగార్జునసాగర్	312.06	312.06	328443	329543
పులిచింతల	45.77	38.09	320928	316916
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	294789	294789

క్వింటా ఉల్లి రూ.1,200లకు కొనుగోలు

రైతు బజార్లలో కిలో 15కు విక్రయం

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. నాలుగైదు రోజులుగా మార్క్‌ఫెడ్-మార్కెటింగ్‌శాఖ ద్వారా క్వింటా రూ.1,200 మద్దతు ధర చెల్లిస్తూ రైతుల నుంచి కొనుగోలు చేయిస్తోంది. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 1,694 క్వింటాళ్ల ఉల్లి దిగుమతి రాగా, 1,612 క్వింటాళ్లు మార్క్‌ఫెడ్, 82 క్వింటాళ్లు అక్కడి వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటా కనిష్ఠ ధర రూ.1,200 పలకగా, గరిష్ఠ ధర రూ.1,329 పలికింది. రైతు బజార్లకు తరలించి కిలో రూ.14-15 చొప్పున అమ్ముతున్నారు. ఇప్పటికే 95 టన్నుల ఉల్లిని వివిధ జిల్లాల్లోని 75 రైతుబజార్లకు తరలించినట్లు రైతుబజార్ల సీఈవో మాధవీలత చెప్పారు. 5 మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి, వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నట్లు సీఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు ఉల్లి కొనండి: వ్యాపారులకు అధికారుల సూచన

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు మహారాష్ట్ర ఉల్లి దిగుమతులు తగ్గించి, కర్నూలు ఉల్లి అమ్మకాలు పెంచాలని అధికారులు సూచించారు. కర్నూలు ఉల్లి ధర పతనమై రైతులు నష్టపోతున్న వైనంపై 'ఉల్లిరైతు బేజారు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను కలెక్టర్ సి.నాగరాణి సోమవారం సందర్శించారు. నేరుగా ఉల్లి విక్రయ దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారులతో సమీక్షించారు. కర్నూలు నుంచి ఎంత ఉల్లి వస్తోంది? ధర పడిపోవడానికి కారణాలేంటి అని అడిగి తెలుసుకున్నారు. కర్నూలు ఉల్లి నాణ్యత లేకపోవడం, నిల్వ సామర్థ్యం లేకపోవడంతో వినియోగం తగ్గిందని వ్యాపారులు వివరించారు. కర్నూలు ఉల్లి ఎక్కువగా విక్రయించేలా వ్యాపారులు సహకరించాలని కలెక్టర్ సూచించారు. కాగా.. తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్‌ను రీజనల్ వ్యవసాయ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. వ్యాపారులతో మాట్లాడి కర్నూలు ఉల్లి రైతులను ఆదుకునేందుకు సహకరించాలని కోరారు.



తాడేపల్లిగూడెం ఉల్లి మార్కెట్లో కర్నూలు ఉల్లిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

రూ.2,500 చొప్పున ప్రభుత్వమే కొనాలి: సీపీఐ

అమరావతి: ఉల్లి క్వింటాలుకు రూ.2,500 చొప్పున రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి ఉల్లి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు సోమవారం లేఖ రాశారు.

24 నుంచి తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈ నెల 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 23వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా 16న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. 24 సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య ధ్వజారోహణం జరుగుతుంది. సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు బహూకరిస్తారు.

8, 16 తేదీల్లో వీఐపీ బ్రేక్ రద్దు

తిరుమల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 8న వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. 7వ తేదీన ఎలాంటి సిఫారసు లేఖలు తీసుకోరు. నేరుగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే 8న వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉంటాయని టీటీడీ పేర్కొంది. ఆఫ్‌లైన్ శ్రీవాణి దర్శనాలను కూడా 7వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు కాకుండా మధ్యాహ్నం ఒంటి గంట వరకే అనుమతిస్తారు. 16న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఉన్నందున, ఆ రోజు కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. 15న సిఫారసు లేఖలను స్వీకరించరు. చంద్ర గ్రహణం నేపథ్యంలో 7వ తేదీ సాయంత్రం 3.30 గంటల నుంచి 8న వేకువజాము 3 గంటల వరకు శ్రీవారి ఆలయాన్ని మూసివేస్తారు.

10న 'అనంత'లో సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభ: మంత్రి పయ్యావుల

అనంతపురం క్రైం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో దోషులకు శిక్ష తప్పదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. దోషులు ఎవరైనా శిక్ష ఖాయమని స్పష్టంచేశారు. ఈ నెల 10వ తేదీన అనంతపురం జిల్లాలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో మహా కూటమిగా సభను విజయవంతం చేస్తామన్నారు. అనంతపురం నగరంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, సవిత, ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీజేపీ, జనసేన పార్టీల నేతలతో కలిసి సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభ ఏర్పాట్లు, స్థల ఎంపికపై సమావేశం నిర్వహించారు.

క్యాన్సర్ రహిత రాష్ట్రమే లక్ష్యం: మంత్రి సత్యకుమార్

- కేజీహెచ్‌లో అత్యాధునిక చికిత్సా పరికరాలు ప్రారంభం



కేజీహెచ్‌లో ఏర్పాటుచేసిన పరికరాలను ప్రారంభించిన అనంతరం వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్. చిత్రంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, డీఎంఈ డాక్టర్ రఘునందన్ తదితరులు

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్యాన్సర్ రహితంగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అందులో భాగంగానే కేజీహెచ్‌తోపాటు రాష్ట్రంలోని పలు ఆస్పత్రుల్లో పరికరాల కొనుగోలుకు నిధులు కేటాయిస్తున్నామని, వైద్యులను, సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ రోగులకు చికిత్స అందించేందుకు కేజీహెచ్‌లో సుమారు రూ.42 కోట్లతో ఏర్పాటుచేసిన లీనియర్ యాక్సిలరేటర్ (రూ.25 కోట్లు), సిటీ సిమ్యులరేటర్ (రూ.9.5 కోట్లు), బ్రాకీ థెరపీ (రూ.7.5 కోట్లు) పరికరాలను సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజలకు ఆధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు ఈ పరికరాలను అందించామన్నారు. ఇప్పటివరకూ ఇక్కడ సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల రోగులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై కేజీహెచ్‌లోనే ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వస్తాయన్నారు. క్యాన్సర్ లక్షణాలున్న వారిని గుర్తించేందుకు త్వరలో ప్రత్యేక సర్వే చేస్తామన్నారు. కర్నూలులో సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటు చేసేందుకు గతంలో నిధులు కేటాయించామని, అలాగే కేజీహెచ్‌తో పాటు మరో రెండుచోట్ల కాంప్రెహెన్సివ్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు.



పెన్షన్ మార్చ్‌లో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

- సీపీఎస్ ఉద్యోగులకు మేలుచేసే నిర్ణయం తీసుకోండి
- ప్రభుత్వానికి ఏపీజీఈఎన్, ఏపీఎన్‌జీజీవో విజ్ఞప్తి

విజయవాడ (గవర్నర్‌పేట/గాంధీనగర్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగులకు మేలుచేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఏపీజీఈఎన్ అధ్యక్షుడు, ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ కోరారు. పెన్షన్ విద్రోహ దినంగా సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సూర్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు సీపీఎస్ ఉద్యోగులకు మేలుచేసేలా పరిష్కార మార్గం చూపిస్తామని హామీ ఇచ్చారని, ఏడాదిన్నర గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా సీపీఎస్‌పై వెంటనే మంచి పరిష్కారం చూపేలా మ్యాప్ తయారు చేయాలని కోరారు. మరోవైపు.. సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వారంలోగా ఓపీఎస్‌లోకి మారుస్తామని హామీ ఇచ్చి గత ప్రభుత్వం మోసం చేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా తమ సమస్య పరిష్కరించలేదని విమర్శించారు. ఏపీసీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో సోమవారం చేపట్టిన నిరసనలో ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పాల్గొని సంఘీభావం తెలిపారు.

బర్లీ పొగాకు రైతుల ఖాతాలకు నగదు

- రూ.55 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ సీజన్(2024-25)లో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన హెచ్‌డీ బర్లీ పొగాకు రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉత్పత్తి అయిన బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడ్డ సమయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుంది. సీఎం చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కొందరు వ్యాపారులు కొంత కొనుగోలు చేశారు. మిగిలిన ఉత్పత్తిలో 20.00మిలియన్ కిలోల బర్లీ పొగాకును ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించింది. దీనికి సంబంధించి, రైతులకు సొమ్ము చెల్లించేందుకు రూ.55కోట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. పొగాకు అమ్మిన 4,040 మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు రూ.54,88,92,060 నేరుగా నగదు బదిలీ చేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్ సోమవారం తెలిపారు.

హైకోర్టునే ఆశ్రయించండి!

- లేదంటే ఇతర పరిష్కార మార్గాలను పరిశీలించండి
- పిఠాపురం నియోజకవర్గంలో వివక్ష, బహిష్కరణపై దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఒక గ్రామంలో దళితులపై వివక్ష చూపుతున్నారని, సామాజిక బహిష్కరణ విధించారని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టును ఆశ్రయించాలని, లేదంటే అందుబాటులోని ఇతర పరిష్కార మార్గాలను పరిశీలించాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. పిఠాపురం రూరల్ పరిధిలోని మల్లం గ్రామంలో జల్లిబాబు ఇంట్లో అదే గ్రామానికి చెందిన దళితుడు పల్లపు సురేష్ కరెంటు పని చేస్తూ ఏప్రిల్ 16న విద్యుదాఘాతంతో మృతిచెందాడు. రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని దళితులు ఆందోళనకు దిగారు. సీఐ సమక్షంలో రూ.2.75 లక్షలు పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అయితే, అప్పటికే కొందరు దళితులు ఇలా పనిలో మృతిచెందడం, వారికి పరిహారం చెల్లించాల్సి రావడంతో.. దళితులను ఎవరినీ పనిలోకి పిలవకూడదని జల్లిబాబు సామాజిక వర్గం నిర్ణయించింది. ఈ క్రమంలో మల్లం గ్రామంలో తమకు హోటళ్లలో టీ, కాఫీ, టిఫిన్ ఇవ్వడం లేదని, నిత్యావసరాలు విక్రయించడం లేదని, పనులకు పిలవడం లేదని దళితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు అక్కడ పర్యటించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. మల్లంలో శాంతి చర్చలు జరిపామని, ఇరువర్గాల వారిని కూర్చోబెట్టి మాట్లాడామని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని చెప్పామని, పరిస్థితి సద్దుమణిగిందని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ ప్రకటించారు. అయితే.. మల్లం గ్రామంలో దళితులపై కుల వివక్షత, సామాజిక బహిష్కరణ ఉందని మే 9న సుప్రీంకోర్టులో దాసరి చెన్నకేశవులు రిట్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ, కాకినాడ కలెక్టర్, పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌లను ప్రతివాదులుగా చేర్చారు. దళితుడు చనిపోతే కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, వల్లపు సురేష్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. న్యాయ వ్యవస్థకు విరుద్ధంగా శాంతి చర్చల కమిటీ పేరుతో జరిగిన రాజీని రద్దు చేయాలని, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని విన్నవించారు. రాజ్యాంగబద్ధంగా బాధ్యతలు నిర్వర్తించని స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను బాధ్యుడిని చేయాలని, కలెక్టర్ సహా ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. అయితే.. పిటిషన్ విచారణకు సుప్రీం కోర్టు నిరాకరించింది. పిటిషనర్ అధికార పరిధికి సంబంధించిన హైకోర్టును, పోలీసు సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని లేదా చట్టంలో అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కార మార్గాలను ఆశ్రయించాలని సూచించిన ధర్మాసనం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

గడువు ముగిసినా ఒక్క టెండరూ లేదు..!

- సీసీఐ చరిత్రలో ఊహించని పరిణామం
- 3న వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుతో చర్చలు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చరిత్రలోనే తొలిసారి ఊహించని పరిణామం ఎదురైంది. చివరి రోజైన సోమవారం కూడా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క టెండర్ దాఖలు కాలేదు. నిబంధనలు కఠినంగా ఉన్నాయన్న ఆరోపణలతో దేశ వ్యాప్తంగా ఉన్న జిన్నింగ్ మిల్లుల యజమానులు టెండర్ ప్రక్రియను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఆ నేపథ్యంలోనే చివరి రోజు కూడా ఆంధ్రప్రదేశ్‌లోని 30 పత్తి కొనుగోలు కేంద్రాలకు ఒక్క టెండర్ కూడా పడలేదు. ఈ పరిస్థితిపై దృష్టి సారించిన ప్రభుత్వం సీసీఐ అధికారులు, రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ నేతలతో ఈ నెల 3వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో సమావేశం ఏర్పాటు చేశారు.



లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో వెంకయ్యనాయుడు తదితరులు

ఉచితాలతో వ్యవస్థ మనుగడకే ముప్పు

- విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పెళ్లకూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయ ప్రయోజనాల కోసం ఏ ప్రభుత్వమైనా ఉచితాల పంపిణీకి బటన్లు నొక్కడం సరికాదు. ఈ విధానంతో వ్యవస్థ మనుగడకే ముప్పు ఏర్పడుతుంది' అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా పెళ్లకూరులోని చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. 'ప్రజలకు ఉచితంగా కావాల్సింది విద్య, వైద్యం మాత్రమే. ఈ రెండింటిని అందించగలిగితే సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకుంటారు. అంతే తప్ప అప్పులు చేసి, రాష్ట్రాలను దివాళా తీయించి ఉచితాలను పంపిణీ చేయడం వల్ల ప్రజలను సోమరులుగా తయారు చేయడం తప్ప మరో ప్రయోజనం లేదు. ప్రతి ఊర్లో విద్యాలయం, దేవాలయం, గ్రంథాలయం, సేవాలయం ఉండాలి' అని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. అనంతరం చాగణం లలితమ్మ-భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్-వరలక్ష్మి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.50 లక్షల విలువ చేసే లలితమ్మ విద్యా వికాస ఉపకార వేతనాలను ఆయన పంపిణీ చేశారు.

ఎంత కష్టం.. ఎంత కష్టం!



సోకిలేరు వాగులో భార్య మృతదేహాన్ని నాటు పడవపై తీసుకెళుతున్న బుచ్చిరాజు

నాటుపడవపై మృతదేహం తరలింపు

- విలీన మండలాల్లో వరదల కారణంగా పొంగుతున్న సోకిలేరు, చీకటి వాగులు
- భద్రాచలం నుంచి భార్య మృతదేహాన్ని తరలించేందుకు భర్త అగచాట్లు

చింతూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పదిరోజులుగా విలీన మండలాల్లో వరదల కారణంగా లోతట్టు ప్రాంతవాసులు పడుతున్న కష్టాలకు ఈ ఘటన నిదర్శనం. రోడ్డు మార్గంలో భార్య మృతదేహాన్ని తీసుకువచ్చే వీలు లేక ఓ వ్యక్తి గత్యంతరం లేని పరిస్థితిలో నాటు పడవపై వాగులు దాటి.. ఆ తర్వాత అటవీ మార్గంలో ట్రాక్టర్‌పై ఇంటికి చేర్చుకున్న దయనీయ పరిస్థితి ఇది. అల్లూరి జిల్లా వరరామచంద్రపురం మండలం రామవరానికి చెందిన కుంజా రాములమ్మ(60) కొద్దికాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం ఆమె పరిస్థితి విషమంగా మారడంతో భర్త బుచ్చిరాజు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. ఇటీవలి వరదల కారణంగా సోకిలేరు, చీకటివాగులు పొంగుతుండటంతో రాములమ్మ మృతదేహాన్ని భద్రాచలం నుంచి వరరామచంద్రపురం మండలానికి నేరుగా రోడ్డు మార్గంలో తీసుకురావడానికి ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో సోకిలేరు వాగు మీదుగా కొంతదూరం నాటు పడవపై భార్య మృతదేహాన్ని తీసుకువచ్చిన బుచ్చిరాజు అక్కడి నుంచి చింతూరు అటవీమార్గంలో ట్రాక్టర్‌పై ఇంటికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఈ సయోధ్య స్థిరమేనా?

ప్రధాని నరేంద్రమోదీ చైనా పర్యటనకు షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వేదిక కావచ్చును కానీ, ఈ సందర్భంగా మనకు కనిపిస్తున్న దృశ్యాలు అంతకుమించిన ప్రాధాన్యం ఉన్నవి. మారిన పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా అతివేగంగా పడిన అడుగులు ఉభయ దేశాలను చేరువచేశాయి. 'మన అధ్యక్షుడు అహానికి పోయి భారత ప్రధాని మీద ఒత్తిడిపెంచుతున్నాడు కానీ, మూడు దేశాలను కలిపి ముడివేస్తున్నానని తెలుసుకోవడం లేదంటూ' అమెరికా పత్రిక ఒకటి గతంలో చేసిన వ్యాఖ్యానానికి తియాంజిన్‌లో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ ఆత్మీయతలు, చిరునవ్వులు, ముచ్చట్లు అద్దంపడుతున్నాయి. పహల్గాం ఘాతుకానికి పాకిస్థాన్ మీద ప్రతీకారం తీర్చుకుంటున్నప్పుడు, ఆయుధ సాయంతో పాటు అత్యంత కీలకమైన ఇంటలిజెన్స్ సమాచారాన్ని కూడా అందించిన చేతులు ఇవేనని జిన్‌పింగ్‌తో కరచాలనం చేస్తున్నప్పుడు మోదీకి గుర్తొచ్చే ఉంటుంది. ఆ చేదు అనుభవాన్ని మనసులోనే వెనక్కునెట్టి, మంచి భవిష్యత్తుకోసం భారత్ చైనాలు కలిసి అడుగులు వేయాలని మోదీ కాంక్షించారు. చైనా అధ్యక్షుడు అయితే ఏకంగా డ్రాగన్, ఏనుగు కలిసి డాన్స్ చేయాలంటున్నారు. నాలుగేళ్ళపాటు రెండుదేశాలు సరిహద్దుల్లో ముష్టిఘాతాలకు దిగిన గతానికి స్వస్తిచెప్పాలన్న ఇరువురి సంకల్పం మెచ్చుకోదగింది. ఇకపై అంతా శుభమే అన్నట్టుగా ఈ సంభాషణలూ ఉన్నప్పటికీ, ట్రంప్ సుంకాలు, వీరంగాలు పునాదిగా ఈ సయోధ్య సాధ్యపడిన వాస్తవం కాదనలేనిది. మూడో దేశంతో ముడివడని రీతిలో ఈ బంధం కలకాలం నిలవాలన్న ఆశ, ఆకాంక్ష నెరవేరుతుందో లేదో చూడాలి.

ఉమ్మడి శత్రువు కమ్ముకొచ్చినప్పుడు, కోటలు కూలదోస్తున్నప్పుడు ఇలా చేయాచేయా కలపాల్సివస్తుంది. కడదాకా నిలుస్తాడని అనుకున్న ట్రంప్ శత్రువును మించి కత్తులు దూస్తున్నందున రక్షణకవచాలు అవసరపడ్డాయి. అయినా, కాలం ఒకేలా ఉండదనీ, మిత్రులు, శత్రువులు శాశ్వతం కాదన్న స్పృహతోనే మోదీ ప్రయాణం నిర్ణయమైందని విశ్లేషకులు అంటారు. చైనాకు శత్రువు, అమెరికాకు దీర్ఘకాలిక మిత్రదేశమైన జపాన్‌లో మొదట కాలూని, భారీ ఒప్పందాలు కుదుర్చుకొని, సాంకేతికతల బదలాయింపు గురించి మాట్లాడుకొని, అక్కడనుంచి ఎస్సీవో సదస్సుకు ప్రయాణం కట్టడం వెనుక చైనాకు, అమెరికాకు అవసరమైన సందేశాలున్నాయని అంటారు. మనంత కాకున్నా, జపాన్ కూడా ప్రస్తుతానికి ట్రంప్ బాధితదేశమే కనుక, ఆ లెక్కకూడా సరిపోతుంది. ఆలింగనాలవరకూ వెళ్ళిన మోదీ ట్రంప్ బంధం ఇప్పుడు అలకలూ, ఆగ్రహాల దశలో ఉంది. చైనాతో కరచాలనాలే తప్ప, ఆలింగనాలు ఉండవని మోదీకి తెలుసు. భారత్‌ను చైనాకు పోటీగా నిలబెట్టి, బలోపేతం చేసే దశాబ్దాల నాటి విధానాన్ని ఈ సుంకాల సమరంలో పడి ట్రంప్ విస్మరించాడు. ట్రంప్‌ను నమ్ముకొని చైనాతో ఘర్షణలు పెంచుకున్న మనకు ఇప్పుడు మళ్ళీ చైనాతో చేయికలపాల్సిన పరిస్థితి తీసుకువచ్చాడు. దశాబ్దాల పాటు ఒక్క బుల్లెట్ కూడా పేలని సరిహద్దు ఇప్పుడు ఘర్షణలు, చొరబాట్లు, దురాక్రమణలతో సతమతమవుతోంది. ఏదో అవసరార్థం సయోధ్య కుదిరినా, ఆ శాంతి ఎక్కువకాలం నిలిచే అవకాశం లేదు. పరస్పర నమ్మకం, గౌరవం వంటివి మాటలకే తప్ప, ఇరుదేశాల మధ్య ఆచరణలో అంతరించిపోయాయి. ఇప్పుడు మళ్ళీ పడుతున్న ఈ కొత్త అడుగుతో ఇరుదేశాల మధ్య అతుకు ఎంతబలంగా ఏర్పడుతుందో చూడాలి.

గత ఏడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు భారత్, చైనా తమ ఘర్షణాత్మకవైఖరిని సడలించుకొనేందుకు వీలు కల్పించింది. పలు విడతల చర్చల అనంతరం సరిహద్దులు కాస్తంత శాంతించినప్పటికీ, మోహరించివున్న సైన్యాన్ని వెనకకురప్పించే చర్యలు సత్వరమే జరగలేదు. ఉన్నతస్థాయి సంకల్పం అవసరపడిన దశలోనే ట్రంప్ వీరంగాలు భారత్, చైనా సయోధ్యను వేగవంతం చేశాయి. రష్యా చమురు ఇంధనంలాగా పనిచేసింది. ట్రంప్ ఒత్తిళ్లు, బెదిరింపులకు లొంగకుండా స్థిరంగా నిలబడిన మనపక్షాన చైనా, రష్యాలు రెండూ నిలిచాయి. అంతకుముందు కొన్ని ఉత్పత్తులమీద విధించిన ఆంక్షలను కూడా ఎత్తివేసి, మార్కెట్లు తెరిచేందుకు చైనా తయారవుతోంది. వాణిజ్యం గురించి ఇరుదేశాధినేతలూ ప్రత్యేకంగా మాట్లాడుకుంటున్న ఈ వాతావరణ మార్పు ఐదారునెలలక్రితం కూడా ఎవరి ఊహకూ అందనిది. వచ్చే ఏడాది బ్రిక్స్ సదస్సులోగా తుపానులేవీ సంభవించబోవని ఆశిద్దాం.

దేశంలో సెమీకండక్టర్ విప్లవం మొదలైంది!

కంప్యూటర్లు వచ్చిన కొత్తలో ఒక గది మొత్తాన్నీ నింపేసే భారీ యంత్రాల్లా ఉండేవి. ఇప్పుడు మీ వేలి గోరుకన్నా చిన్నదైన చిప్ లోపల అనంతమైన శక్తి దాగి ఉంటుంది. మీ మొబైల్ ఫోన్లు, కార్లు, రైళ్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు మొదలుకొని ఫ్యాక్టరీ యంత్రాలు, విమానాలు, అంతరిక్షంలో సంచరించే ఉపగ్రహాల దాకా ఇవే నడిపిస్తున్నవి. ఇదంతా సెమీకండక్టర్ల మాయాజాలం!

ఒక దేశం ప్రగతిపథంలో సాగాలంటే వృద్ధికి తోడ్పడే కీలక రంగాలపై పట్టు సాధించాలి. ఉక్కు, విద్యుత్తు, టెలికాం, రసాయనాలు, రవాణా, సెమీకండక్టర్లు వంటి రంగాలు దీనికి పునాదులు. వీటిలో సెమీకండక్టర్ల పాత్ర అత్యంత ప్రధానం. కర్మాగారాలు, వంతెనలు, రైల్వే రంగాల్లో ఉక్కు ప్రాథమిక అవసరం. అదే తరహాలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు సెమీకండక్టర్లు మూలాధారాలు. చిప్‌లు లేనిదే ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థ పనిచేయదు. డేటా ప్రాసెసింగ్ సహా కృత్రిమ మేధ మనజాలదు. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు ఉండవు. రక్షణ రంగం సురక్షితంగా ఉండదు. అందువల్ల, సెమీకండక్టర్ల రంగంలో బలోపేతం కావడమనే అంశానికి పరిశ్రమను మించిన ప్రాధాన్యం ఉంటుంది.

ప్రపంచ భౌగోళిక రాజకీయాలకు సెమీకండక్టర్లే నేడు కేంద్రకంగా మారాయి. చిప్ తయారీ కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావడంతో స్వల్ప అంతరాయాలు కూడా ప్రపంచమంతటా అలజడి రేపుతున్నాయి. ఇటీవలి కాలంలో అరుదైన లోహాలపై అన్ని దేశాలూ దృష్టి సారిస్తున్నాయి. కీలక వనరులపై నియంత్రణ ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఎంత ప్రాముఖ్యతను ఇవ్వగలదో ఈ పరిణామం స్పష్టం చేస్తున్నది.



సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగమనం ప్రధాని మోదీ దూరదృష్టిలో ఒక భాగం. డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనతో పాటు, డిజిటల్ ఇండియా కార్యక్రమంతో ఇది శ్రీకారం చుట్టుకుంది. సమాంతరంగా మన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి వ్యవస్థను కూడా బలోపేతం చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పరికరాల కోసం తయారీ వ్యవస్థను రూపొందిస్తున్నాం. ఈ రోజు ప్రారంభమయ్యే సెమికాన్ ఇండియా సమ్మిట్ 2025, ఈ ప్రయాణానికి కొనసాగింపుగా చెప్పుకోవచ్చు.

దేశంలో ప్రస్తుతం 65 కోట్లకుపైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్నారు. మన ఎలక్ట్రానిక్స్ తయారీ ఇప్పుడు ఏటా రూ.12 లక్షల కోట్లకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో మనం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలు, డేటా సెంటర్లు నెలకొల్పడంతోపాటు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీని కూడా చేపడుతున్నాం. ఈ విధంగా డిమాండ్–ఆవిష్కరణ రెండింటా కనిపిస్తున్న పెరుగుదల ద్వారా ప్రపంచ సెమీకండక్టర్ విలువ శ్రేణిలో భారత్ తనదైన స్థానం సంపాదించుకోనున్నది.

సెమీకండక్టర్ల విషయంలో మన దేశం దశాబ్దాలుగా అనేక అవకాశాలు కోల్పోయిందన్న మాట మనకు వినిపిస్తోంది. కానీ, ఇకపై ఆ పరిస్థితి మారనున్నది. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' కింద దేశంలో 10 సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్లకు ఆమోదముద్ర పడింది. వాటి నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది.


ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాదిలోనే తొలి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్ ఆవిష్కృతం కాగలదని మనం సగర్వంగా చాటగలం. గుజరాత్‌లోని సనంద్‌లోగల ఒక యూనిట్‌లో ఇప్పటికే ప్రయోగాత్మక ఉత్పత్తి మొదలు కావడంతో ఏడాదిలోగా వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా. ఈ కర్మాగారాలు, సరఫరా శ్రేణులకు మద్దతు దిశగా అప్లైడ్ మెటీరియల్స్, లామ్ రీసెర్చ్, మెర్క్, లిండే.. వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ దీర్ఘకాల అభివృద్ధిపై ప్రధానమంత్రి కేంద్రీకృత దృష్టిని ఈ దృక్పథం ప్రతిబింబిస్తోంది.

ఏ కోణంలో చూసినా విధానం, పెట్టుబడులు అత్యంత ప్రధానం. అయితే, భారత్‌కు నిజమైన సానుకూలత దాని ప్రజానీకంలోనే ఉన్నది. ప్రస్తుతం ప్రపంచ డిజైన్ శ్రామిక శక్తిలో భారత్ వాటా 20 శాతం కాగా, ఒక అంచనా ప్రకారం వచ్చే దశాబ్దారంభం నాటికి అంతర్జాతీయంగా సెమీకండక్టర్ నిపుణుల కొరత 10 లక్షలకు పైగా ఉంటుంది. ఈ అంతరాన్ని పూరించే దిశగా భారత్ నేడు ముందడుగు వేస్తున్నది. ఎందుకంటే– 350 పరిశ్రమలు, అంకుర సంస్థలలో 60వేలకు పైగా వినియోగదారులు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చే అంతర్జాతీయ స్థాయి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) ఉపకరణాలను వాడుతున్నారు. ఈ మేరకు 2025లోనే వీటి వాడకం 1.2 కోట్ల గంటల స్థాయిని దాటింది. ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు లభించడంతో అంకుర సంస్థలు భారత చిప్ డిజైన్ వ్యవస్థను శక్తిమంతం చేస్తున్నాయి. ఈ మేరకు ఐఐటీ–మద్రాస్ దేశీయంగా రూపొందించిన 'శక్తి' ప్రాసెసర్ సాయంతో 'మైండ్‌గ్రోవ్ టెక్నాలజీస్' సంస్థ 'ఐఓటీ' చిప్‌లను రూపొందిస్తోంది. ఇక 'నేత్రసేమి' అనే మరో అంకుర సంస్థ ఇటీవలే రికార్డు స్థాయిలో రూ.107 కోట్ల నిధిని సమీకరించుకోగలిగింది. దేశంలోని సెమీకండక్టర్ డిజైన్ రంగంలోనే ఇది అత్యంత భారీ వెంచర్ క్యాపిటల్ సమీకరణ. ఈ రంగంపై పెట్టుబడిదారులలో పెరుగుతున్న విశ్వాసానికి ఇదొక నిదర్శనం. 'డిజైన్ సంధానిత ప్రోత్సాహకం' (డీఎల్ఐ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇలాంటి అనేక అంకుర సంస్థలకు చేయూత లభిస్తోంది.

మొహాలీలోని సెమీ కండక్టర్ లాబొరేటరీ (ఎస్సీఎల్)లో 17 విద్యాసంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ఇప్పటికే 20 చిప్‌లను తయారు చేశారు. రాబోయే కాలంలో ఇలాంటి మరిన్ని చిప్‌లను వారు ఆవిష్కరించగలరు. ఈ విధమైన నైపుణ్యాభివృద్ధి భారతదేశాన్ని సెమీ కండక్టర్ పరిశ్రమలో పటిష్ఠమైన స్థానంలో నిలబెడుతుంది. ఈ మేరకు యువ ఆవిష్కర్తల స్వప్న సాకారం దిశగా 'ఎస్సీఎల్' ఆధునికీకరణ చేపట్టారు. ఈ విధంగా భారత ప్రతిభ క్లాస్‌రూమ్ నుంచి క్లీన్‌రూమ్ వైపు మళ్లగలదనే భరోసా లభిస్తోంది.

భారత యువతరం ప్రతిభపై ప్రపంచ అగ్రశ్రేణి సంస్థలు కూడా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ మేరకు 'లామ్ రీసెర్చ్' సంస్థ దేశంలోని 60వేల మంది ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వనుంది. అలాగే అప్లైడ్ మెటీరియల్స్, ఏఎండీ, మైక్రోచిప్ సంస్థలు పరిశోధన–ఆవిష్కరణల కోసం 101 కోట్ల డాలర్ల పెట్టుబడికి హామీ ఇచ్చాయి. మరోవైపు ఐఐఎస్సీ, ఐఐటీలు తదితర సంస్థల భాగస్వామ్యంతో ప్రయోగశాల నుంచి తయారీ ప్రతిభగల (ల్యాబ్–టు–ఫ్యాబ్) బలమైన కార్మికశక్తి రూపకల్పనకు భరోసా లభిస్తోంది.

సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగమనం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టిలో ఒక భాగం. డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనతో పాటు పౌరులకు సాధికారతను ఇచ్చిన డిజిటల్ ఇండియా కార్యక్రమంతో ఇది శ్రీకారం చుట్టుకుంది. ఇండియా స్టాక్, యూపీఐ, ఆధార్, టెలికాం నెట్‌వర్కులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి భారతీయుడి వేలికొసలకు చేర్చాయి. ఈ పురోగమనానికి సమాంతరంగా మన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి వ్యవస్థను కూడా బలోపేతం చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పరికరాల కోసం తయారీ వ్యవస్థను రూపొందిస్తున్నాం. నేడు ప్రారంభమయ్యే సెమికాన్ ఇండియా సమ్మిట్ 2025, ఈ ప్రయాణానికి కొనసాగింపుగా చెప్పుకోవచ్చు. ప్రధానమంత్రి ఈ రోజు ఈ సదస్సును ప్రారంభించనున్నారు. ఈ సంవత్సరం 48 దేశాల నుంచి 500 మందికి పైగా ప్రపంచ పారిశ్రామిక నాయకులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. అనిశ్చితితో సతమతమవుతున్న ప్రపంచానికి స్థిరమైన భారత్ ఆశాకిరణం కాబట్టి, ప్రపంచం మన తలుపు తడుతోంది. ఇందులో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేషియా దేశాల ప్రత్యేక పెవిలియన్లు అర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహిస్తాయి. ప్రపంచవ్యాప్త పరిశ్రమల ప్రతినిధులు, యువ ప్రతిభావంతుల మధ్య 'బి 2బి' చర్చలు, అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్యాలు ఏర్పడే వీలుంటుంది.




రాబోయే దశాబ్దంలో మన సెమీకండక్టర్ యూనిట్లు పరిపక్వతతో పాటు పరిమాణం రీత్యా ఉన్నత స్థాయికి ఎదుగుతాయి. తద్వారా సెమీకండక్టర్ విలువ శ్రేణి మొత్తానికీ భారత్ ఒక పోటీతత్వ కూడలిగా నిలిచేందుకు సిద్ధమవుతోంది.

■ అశ్వినీ వైష్ణవ్
కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి

వ్యాపారంలో తనామనా తకరారు!

ఆర్థిక పరిస్థితుల్లో తేడాలొస్తే ఆలోచనలు తలకిందులు అవుతాయి. ఆందోళనలు పుడతాయి. కొత్త వాదాలు వస్తాయి. బలబలాల ప్రదర్శనలు మొదలవుతాయి. చరిత్ర అంతా ఇదే జరిగింది. దాన్ని ఈ కోణం నుంచి చూస్తే వైవిధ్య భరిత జీవితం కనపడుతుంది. రాజవంశాలతో విసుగుపుట్టించే చరిత్ర పోయి సాధారణ ప్రజల ప్రయాణంలో వెలుగుచీకట్లు వెల్లడవుతాయి. వివిధ వర్గాల సంఘర్షణలు, సమైక్యతలపై సమగ్రచిత్రం అందుతుంది. తెలంగాణలో మార్వాడీల వ్యాపార ఆధిపత్యంపై తలెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో చరిత్రను తడిమితే ఎన్నో ఆసక్తికరమైన అంశాలూ బయటపడతాయి.



కొంచెం అటూఇటుగా 400 ఏళ్ల నుంచి మార్వాడీలు తెలంగాణ ప్రాంతం వ్యాపారాల్లో కీలకపాత్రను పోషిస్తూనే ఉన్నారు. నగర పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా వడ్డీ, ధాన్యం వ్యాపారాల్లో పట్టు సంపాదించారు. పర్భణీ చుట్టుపక్కల రైతులు మార్వాడీల అధిక వడ్డీలకు వ్యతిరేకంగా 1906లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. హైదరాబాద్‌కు 1980ల నుంచి ఇతర ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలూ, వ్యాపారులూ రావటం ఎక్కువైనా రిటైల్ రంగంలో మార్వాడీల పాత్ర క్షీణించలేదు. 1990ల తర్వాత అదింకా పెరిగింది. వీరితో పోటీకి నిలబడలేని పరిస్థితి స్థానిక కిరాణా వ్యాపారులకు వచ్చింది. ఇటీవల ఆందోళనలకు అదే కారణం.

వ్యాపారాల్లో మార్వాడీల ఆధిపత్యం నిన్నమొన్నటిది కాదు. దీని వెనుక 250 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. నిజానికి మార్వాడీ పేరుతో ఒక కులం లేదు. ఒక తెగ లేదు. రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతం నుంచి వ్యాపారాల కోసం తరలి వచ్చిన వాళ్లందరినీ మార్వాడీలు అనటం ఒక నానుడిగా మారిపోయింది. మార్వార్ నుంచే గాక రాజస్థాన్‌లోని ఇతర చోట్ల నుంచి వచ్చిన వాళ్లని కూడా అదే పేరుతో పిలవటం మొదలైంది. మార్వాడీలుగా మనందరం పిలిచే వాళ్లందరూ ఎక్కువగా వైశ్యవర్గంలోని వివిధ కులాలకు చెందినవారే. ఆ వర్గంలో 30కి పైగా కులాలు ఉన్నాయి. అందులో ఆరు ప్రధాన కులాలను సూచించే పేర్లు ఏదో విధంగా మనకు నిత్యం తారసపడుతూనే ఉంటాయి. అగర్వాల్, మహేశ్వరి, ఓస్వాల్, పోర్‌వాల్, ఖండేల్‌వాల్, శ్రీమాలి అనే వాటిని ఆ ఆరు కులాలుగా చరిత్రకారులు చెబుతారు. ఈ కులాలకు చెందినవారే ఇప్పటికీ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. బిర్లా, గోయంకా, సింఘానియా, బజాజ్, ఖేతాన్, మిత్తల్, గోయల్, ముంద్రా, జలాన్, పొద్దార్, ఝున్‌ఝున్‌వాలా, కనోరియా ఇంటిపేర్లున్న వారందరూ అగర్వాల్ కులానికి చెందినవారు. దాల్మియా, కొటారి, తపాడియా, పారీఖ్, బంగూర్, ధూత్, కేడియా, రాఠీ, చింట్లాంగియా ఇంటిపేర్లు మహేశ్వరీ కులంలో కనపడతాయి. ఇక కులం పేరు అయిన మహేశ్వరీ చాలా మందికి ఇంటిపేరు గానూ ఉంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో 30కి పైగా వెంచర్లు ఉన్న మహేశ్వరీ గ్రూప్ మార్వాడీలకు చెందిందే. డి-మార్ట్ కూడా మహేశ్వరీలకు చెందిన మార్వాడీలదే. లోధా, భన్సాలీ, జవేరీ, భండారీ, కొటారీ, దుగ్గర్, సురానా లాంటి ఇంటిపేర్లు ఓస్వాల్ కులంలో ప్రధానమైనవి. దోషి, పరేఖ్, మెహతా, కాసిల్‌వాల్, బొహ్రా, శాంక్ల అనే ఇంటిపేర్లు పోర్‌వాల్ కులంలో కనపడతాయి. బన్సాల్, సింఘాల్, ఖండేల్‌వాల్, కన్సాల్, శ్రీమాల్ బైడ్, భుటాడ మొదలైన ఇంటిపేర్లు మిగతా రెండు ప్రధాన కులాల్లో ఉంటాయి. మార్వాడీల్లో 30 నుంచి 35 శాతం వరకూ జైన మతాన్ని, మిగతావారు హిందూ మతాన్ని అనుసరిస్తారు. మార్వార్ ప్రాంతాన్ని అసలు మరుదేశం అని పిలిచేవారు. మరు అంటే ఎడారి ప్రాంతం. థార్ ఎడారిలో భాగంగానే మార్వార్‌ను చూసేవారు.

1948కి ముందు మూడు భాషా ప్రాంతాల్లో విస్తరించిన నిజాం సంస్థానంలోని కులాలు, జాతుల గురించి ఆసక్తికరమైన విషయాలను అందించిన వారిలో సయద్ సిరజ్ ఉల్ హస్సన్‌ను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. 1920 నాటికే నిజాం సంస్థానంలో పాతుకుపోయిన మార్వాడీల గురించి ఆయన చాలా సమాచారాన్ని ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు ఔరంగాబాద్, జాల్నా, పర్భణీ, నాందేడ్, గుల్బర్గా నగరాలతో పాటు వాణిజ్య వ్యవహారాలు సాగే అన్నిచోట్లకు మార్వాడీలు విస్తరించారనీ తెలిపారు. వడ్డీ, ధాన్యం, బట్టల వ్యాపారులుగా, బ్యాంకర్లుగా, మిల్లులు, దుకాణాల యజమానులుగా, డీలర్లుగా స్థిరపడినప్పటికీ జీవిత చరమాంకంలో మార్వార్‌కు వెళ్లేవారూ ఉండేవారు. అగర్వాల్, మహేశ్వరీ, ఓస్వాల్, పోర్‌వాల్ కులాలతో పాటు జైనమతాన్ని అనుసరించే శ్రావక మార్వాడీల ఆచార వ్యవహారాల గురించి కూడా హస్సన్ వివరించారు. మరో నాలుగు మార్వాడీ కులాలు కూడా నిజాం సంస్థానంలో ఆనాడు ఉండేవి. వివాహాల్లో కులపట్టింపులను అందరూ పాటించేవారు. ఒకే కులంలో జైన, హిందూ సంప్రదాయాలను అనుసరించే వారి మధ్య వివాహాలు జరిగేవి. భర్త మతాన్ని బట్టి భార్యల మతం మారిపోయేది.

నిజాం పాలన (1724) ఆరంభమైన నాటి నుంచి మార్వాడీల ప్రాబల్యం పెరిగినా అంతకుముందు మొగల్ కాలంలో కూడా కొందరు ఉండేవారు. బుర్హాన్‌పూర్, ఔరంగాబాద్‌ల నుంచి క్రమేపీ నిజాం సంస్థానంలోకి వచ్చి 1800ల నాటికి హైదరాబాద్‌లో పట్టు సంపాదించారు. బేగంబజార్, రికాబ్‌గంజ్, శాలిబండ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసేవారు. నవాబులు, జాగీరుదార్ల కుటుంబాలు నగదు అవసరాలకు వీళ్ల మీద ఆధారపడేవి. హోల్‌సేల్ వ్యాపారంలో మార్వాడీలకే గుత్తాధిపత్యం ఉండేది. వస్త్ర, కిరాణా, ఇనుము, హార్డ్‌వేర్, నగల పరిశ్రమల్లోనూ వారిదే పైచేయి. సీతారామ్ బాగ్ ఆలయాన్ని నిర్మించిన గనేరీవాలా కుటుంబం నిజాంకు బ్యాంకరుగానూ వ్యవహరించేది. కొంచెం అటూఇటుగా 300 ఏళ్ల నుంచి మార్వాడీలు తెలంగాణ ప్రాంతం వ్యాపారాల్లో కీలకపాత్రను పోషిస్తూనే ఉన్నారు. నగర పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా వడ్డీ, ధాన్యం వ్యాపారాల్లో పట్టు సంపాదించారు. పర్భణీ చుట్టుపక్కల రైతులు మార్వాడీల అధిక వడ్డీలకు వ్యతిరేకంగా 1906లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. హైదరాబాద్‌కు 1980ల నుంచి ఇతర ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలూ, వ్యాపారులూ రావటం ఎక్కువైనా రిటైల్ రంగంలో మార్వాడీల పాత్ర క్షీణించలేదు. 1990ల తర్వాత అదింకా పెరిగింది. హార్డ్‌వేర్, కిరాణ, ఎలక్ట్రికల్, ప్లమింగ్, నగలు, వజ్రాల వ్యాపారంలో మార్వాడీల విస్తరణ ఎక్కువగానే కనపడుతుంది. వీరితో పోటీకి నిలబడలేని పరిస్థితి స్థానిక కిరాణా వ్యాపారులకు వచ్చింది. ఇటీవల ఆందోళనలకు అదే కారణం.



■ రాహుల్ కుమార్

వ్యాపార పోటీలో కొందరు పతనం అవ్వటం, నష్టపోవటం సాధారణమైనా దానికి అన్ని సందర్భాల్లోనూ సమాధానపడటం ఉండదు. ప్రాంతీయ భావనలు ప్రబలంగా ఉన్నచోట అధికార బలంతో పోటీని కట్టడిచేయాలనే డిమాండ్లు రావటం సహజం. ప్రాంతీయ, కులశక్తులు కొన్ని సందర్భాల్లో పోటీని ఎదుర్కొంటాయి. మరికొన్ని సందర్భాల్లో పోటీని నిలువరించటానికి ప్రయత్నిస్తాయి. అస్తిత్వ పోరాటాలకూ ఆరాటాలకూ వెనుక ప్రధానంగా ఉండేది ఈ ఆర్థిక అంశాలే. వాటిని కప్పిపుచ్చటానికి ఎన్ని ఇంద్రజాలాలు చేసినా అసలు విషయాలు ఆర్థికాలే. అవి కూడా కొన్ని వర్గాలకే పరిమితం.

ఎడారి ప్రాంతమైన మార్వార్ నుంచే ఎక్కువ మంది వ్యాపారులు ఎందుకు వచ్చారని ప్రశ్నించుకుంటే లభించే సమాధానం ఆసక్తిగా ఉంటుంది. ఒకానొక సందర్భంలో పరిస్థితుల ప్రభావంతో ఏదో ఒకరంగాన్ని ఎంచుకున్న ఒక తరం వాళ్ళు.. దాన్ని తరాలపాటు కొనసాగేలా తదుపరి తరాలకు కొన్ని అలవాట్లు, పద్ధతులను ఒక సంస్కృతిగా మార్చి ఉగ్గుపాలలా అందించగలగటం చాలా అరుదనే చెప్పాలి. యూరపులో యూదులు అది చేశారు. అందుకే వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో అక్కడ ఆ పట్టును సాధించారు. ఎంతటి సమాచారాన్నైనా, ఎంతటి చిక్కు పరిస్థితులనైనా సరళీకరించి అర్థం చేసుకుని, తదనుగుణంగా వ్యవహరించి తమ ప్రయోజనాలను కాపాడుకోవటంలో యూదులు అగ్రగాములుగా ఉండేవారు. పలుదేశాల ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషించినా ఎక్కడా రాజకీయ ఆధిక్యతను సంపాదించటానికి కనీస సంఖ్యాబలం లేకపోవటం, ప్రత్యేకతను కాపాడుకోటానికి నిరంతరం ప్రయత్నించటం, కొన్ని విషయాల్లో అసాధారణ ప్రతిభ.. అవన్నీ కలగలసి మిగతా ప్రజల్లో ఈర్ష్యనూ, ద్వేషాన్నీ కలగచేశాయి. యూరపులోని ఆధిపత్య రాజకీయాలకూ, నాజీయిజానికీ బలిపశువులయ్యారు. మార్వాడీలు కూడా వ్యాపార సంస్కృతిని తదుపరి తరాలకు అందించటంలో, తమ సొంతకులం వాళ్లను చేరదీసి, ప్రోత్సాహం ఇవ్వటంలో, లాభనష్టాల గణనలో అసాధారణ ప్రతిభను చూపించటంలో విశిష్టత సాధించారని చెప్పే పరిశోధనలు చాలానే వచ్చాయి. మార్వాడీలపై ఎంతో పరిశోధన చేసిన థామస్ ఎ టింబర్గ్ అభిప్రాయమూ అదే.

వ్యవసాయానికి అనుకూలంగాలేని మరుదేశం మార్వాడీలను వ్యాపారం వైపు మొగ్గేలా చేసింది. కానీ అలా మొగ్గటానికి వాళ్లున్న ప్రాంతం ఎడారిగా ఉంటే సరిపోదు. అది ఇతరత్రా కూడా వ్యాపారానికి అనుగుణంగా ఉండాలి. అరేబియా సముద్ర ఓడరేవుల నుంచి వచ్చే ఉత్పత్తులనూ, మరోవైపు ముస్లిం దేశాల నుంచి భూమార్గం ద్వారా వచ్చే వస్తువులనూ అటూఇటూ చేరవేయటానికి కావాల్సిన భౌగోళిక అనుకూలత మరుదేశానికి ఉండటం మార్వాడీలకు కలిసివచ్చింది. 18వ శతాబ్దంలో రాజస్థాన్ 20–22 పెద్ద సంస్థానాలుగా విడిపోయి ఉండేది. మరికొన్ని చిన్న జమిందారీలు ఉండేవి. వీటన్నిటి మధ్యా పోటీతో పాటు యుద్ధాలూ జరిగేవి. అప్పటికే ఆర్థిక వ్యవహారాల్లో నగదు వాడకం బాగా పెరిగింది. సంస్థానాధీశుల నగదు అవసరాలు విపరీతంగా ఉండేవి. వీటిని తీర్చటానికి ముందుకు వచ్చిన మార్వాడీ వ్యాపారులకు పరిపాలనలో కూడా పెద్దపీట వేశారు. తీసుకున్న అప్పులకు బదులుగా జాగీర్లు కట్టబెట్టారు. కొన్ని పట్టణాలపై పన్ను వసూళ్ల అధికారం ఇచ్చారు. కొన్ని చోట్ల ఖజానాపై పర్యవేక్షణను అప్పగించారు. వీటన్నిటితో మార్వాడీల చేతుల్లో నగదు పోగుపడింది. మొగలు సైన్యాల వెంట అప్పటికి కొంతకాలం ముందే యూపీ, బిహార్, బెంగాల్, మధ్యప్రదేశ్‌లకు కొందరు మార్వాడీలు వెళ్లారు. ఇక బ్రిటిష్ పాలనతో వ్యాపారభద్రత రావటంతో వారి వలసలు బాగా పెరిగాయి. ఈస్టిండియా కంపెనీకీ, ఆ తర్వాత బ్రిటిష్ వ్యాపారులకూ మధ్యవర్తులుగా పనిచేశారు. వాళ్లకే అప్పులిచ్చారు. బ్రిటిష్ పాలన నిలదొక్కుకోటానికి సహాయమూ చేశారు. ప్లాసీ యుద్ధంలో బ్రిటీష్ వారితో చేతులూ కలిపారు. కాంగ్రెస్ బలం పుంజుకున్నప్పుడు దానికి అండదండలూ ఇచ్చారు. వ్యాపారానికి అనువుగా ఉన్న ఏ అవకాశాన్ని వదులుకోలేదు. అన్నిచోట్లా వ్యాపార నిర్వహణకు సొంతకులం వారిపైనే ప్రధానంగా ఆధారపడి మెట్టుమెట్టుగా ఎదిగారు. వడ్డీలూ, సరుకుల కొనుగోలు, అమ్మకాల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన తర్వాత ఆధునిక మేనేజ్‌మెంట్ పద్ధతులను పాటిస్తున్నా ఇప్పటికీ కులాభిమాన సంస్కృతి మార్వాడీల్లో బలంగానే ఉంటుంది. సోషలిస్టు విధానాల పేరుతో వ్యాపార, పరిశ్రమ రంగాల విస్తరణపై కాంగ్రెస్ ఆంక్షలు పెట్టినప్పుడు స్వతంత్ర పార్టీ వైపునకు మొగ్గారు. ఆ తర్వాత బీజేపీకీ మద్దతు పలికారు. కొన్నిచోట్ల హిందూత్వ రాజకీయాలకు ఛాంపియన్లుగా మారారు. ఇక హిందీ భాషా విస్తరణను వందేళ్ల నుంచీ మార్వాడీలు సమర్థిస్తూనే ఉన్నారు. జాతీయస్థాయిలో ఎటువంటి అడ్డంకుల్లేని మార్కెట్ ఉండాలని కోరుకునే వాళ్లకూ ప్రాంతీయ మార్కెట్‌పై ఆధిపత్యం ప్రాంతీయులకే ఉండాలని వాదించే వర్గాలకూ మధ్య సంఘర్షణ ఈనాటిది కాదు. అది ఇప్పట్లో ముగిసిపోయేదీ కాదు. నినాదాలు ఏవైనా రెండిటి వెనకాలా ఉన్నది ఆర్థికతంత్రమే!

జాతీయస్థాయిలో ఎటువంటి అడ్డంకుల్లేని మార్కెట్ ఉండాలని కోరుకునే వాళ్లకూ ప్రాంతీయ మార్కెట్‌పై ఆధిపత్యం ప్రాంతీయులకే ఉండాలని వాదించే వర్గాలకూ మధ్య సంఘర్షణ ఈనాటిది కాదు. అది ఇప్పట్లో ముగిసిపోయేదీ కాదు. నినాదాలు ఏవైనా రెండిటి వెనకాలా ఉన్నది ఆర్థికతంత్రమే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఉత్తరాంధ్రలో మరో సైబరాబాద్!

ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో నెలకొల్పబోతున్నది. ఈ ప్రాజెక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించింది. ఈ ప్రాజెక్టుకు గూగుల్ ఏకంగా 6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.50వేల కోట్లు) వెచ్చించబోతున్నది.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'ఇన్వెస్ట్ ఇండియా' తన అధికారిక ట్విట్టర్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ డేటా సెంటర్ రానున్నదని చెప్తూ వస్తున్నా, ఇప్పుడు కేంద్రం కూడా ప్రకటించడంతో, ఈ ప్రాజెక్టుపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చినట్లు అయింది. ఇన్వెస్ట్ ఇండియా ట్వీట్ ప్రకారం ఈ డేటా సెంటర్‌కు నిరంతర కనెక్టివిటీ కోసం సముద్ర గర్భం నుంచి మూడు భారీ కేబుల్స్ ఏర్పాటు చేయనున్నట్లు కూడా వెల్లడయ్యింది. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత విశాఖపట్నం దేశవ్యాప్తంగా ముఖ్యమైన డేటా హబ్‌లలో ఒకటిగా ఎదగనున్నది. ప్రస్తుతం ముంబై నగరం డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా ఉంది. విశాఖలో ఏర్పడనున్న కొత్త డేటా సెంటర్ దానికంటే రెట్టింపు సామర్థ్యంతో పని చేయనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. విశాఖను కీలక ఐటీ హబ్‌గా మార్చాలన్న ఐటీ మంత్రి నారా లోకేశ్ సంకల్పానికి ఈ భారీ పెట్టుబడి పెద్ద ఊతం ఇస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.




ఇది భారతదేశంలో గూగుల్‌కి చెందిన తొలి ప్రత్యక్ష డేటా సెంటర్ ప్రాజెక్టు. అమెరికా వెలుపల గూగుల్‌కు ఉన్న అతిపెద్ద డేటా సెంటర్ ఇదే కానున్నది. ఈ సెంటర్ 1 గిగావాట్ సామర్థ్యంతో నిర్మితం అవుతుంది. రానున్న ఐదేళ్లలో 6 గిగావాట్ సామర్థ్యానికి చేరుకోవటం ఈ డేటా సెంటర్ ముందున్న లక్ష్యం. ప్రస్తుతం సమీప భవిష్యత్తులో 1.6 గిగావాట్ పెట్టుబడులను సమీకరించేందుకు కొద్ది వాటా ముందస్తుగా ఖరారయ్యింది. గూగుల్ డేటా పంపిణీ మౌలిక నిర్మాణంలో విశాఖపట్నం కీలక కేంద్రంగా మారనున్నది. 6 బిలియన్ల పెట్టుబడి, 1 గిగావాట్ సామర్థ్యం, పునరుత్పాదక శక్తితో ఈ ప్రాజెక్టు ముందుకు సాగుతున్నది. అనేక ఫిర్యాదులను, ప్రతిబంధకాలను దాటుకు వచ్చిన ఈ ప్రాజెక్టు రాష్ట్రాన్ని డిజిటల్ భవిష్యత్తు వైపు త్వరితంగా మళ్ళించనున్నది. త్వరలో ప్రారంభం కానున్న కేబుల్ ఇండియా సెక్షన్ విశాఖపట్నం సెంటర్‌ను ప్రపంచ ఇంటర్నెట్ ట్రాఫిక్‌కి అనుసంధానించడంలో కీలకంగా మారుతుంది. ఈ ప్రాజెక్ట్ పెద్ద ఎత్తున ఉద్యోగాలు సృష్టిస్తుంది. నిర్మాణం, నిర్వహణ, ఐటీ, ఇంజనీరింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో భారీ ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉండడంతో, భౌగోళికంగా విశాఖపట్నం సౌకర్యవంతమైన ఐటీ & డిజిటల్ హబ్‌గా మారనున్నది.

స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాలను చేరుకునే క్రమంలో రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా నిలుస్తున్నది. పారిశ్రామిక వికాసంపై విశ్వాసం కలిగిస్తున్నది. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రకటించిన నేపథ్యంలో ఆ దిశగా పెట్టుబడులు బారులు తీరుతున్నాయి. ఇప్పటికే లులూ, ఒబెరాయ్, బ్రూక్‌ఫీల్డ్, సుజ్లాన్, గూగుల్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు ముందుకు రాగా, మరికొన్ని ఐటీ సంస్థలు రాష్ట్రానికి రావడానికి సిద్ధపడుతున్నాయి. టీసీఎస్ విశాఖలో తన కార్యకలాపాలను ప్రారంభించేందుకు సంసిద్ధం కావడంతో విశాఖ ఐటీ హబ్‌గా మారనున్నది. చంద్రబాబు దార్శనిక నాయకత్వంలో రాష్ట్రానికి ఆర్సెలర్ మిత్తల్, గూగుల్ వంటి గ్లోబల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు బారులు తీరుతున్నాయి.

సుందరమైన విశాఖనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఎకో సిస్టమ్ అందుబాటులో ఉన్నది. అక్టోబరులో మిత్తల్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కాబోతున్నాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో వేగంగా అడుగులు పడుతున్నాయి. దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుకు రెన్యూ సంస్థ రాయలసీమలో పనులు ప్రారంభించింది. ప్రధాని మోదీ వికసిత్ భారత్, చంద్రబాబు విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు, వ్యాపార నిర్వహణకు ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) 2025 ర్యాంకింగ్స్ స్పష్టం చేశాయి. ఈ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ 6.9 స్కోరుతో నాలుగో స్థానంలో ఉన్నది. తమిళనాడు 7.4 స్కోరుతో ప్రథమ స్థానంలో నిలవగా, గుజరాత్ 7.3 స్కోరుతో రెండో స్థానంలో, మహారాష్ట్ర 7.1 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రాల్లో ముందువరుసలో నిలబెట్టిందని ఈ నివేదిక తెలిపింది. ఏది ఏమైనా సవాళ్ల ముంగిట సమర్థ ప్రణాళికలతో ఆంధ్రప్రదేశ్‌కు మహర్దశ పట్టనుంది. ఐటీ, ఇంజనీరింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో విశాఖపట్నం అభివృద్ధి చెంది ఉత్తరాంధ్రలో మరో సైబరాబాద్ నిర్మాణం కాబోతున్నది.

● కలిశెట్టి అప్పలనాయుడు
విజయనగరం, పార్లమెంట్ సభ్యులు





పెరిగిన స్త్రీ శక్తి!

ఉచిత ప్రయాణంపై మహిళల మొగ్గు

విజయవాడ సిటీలోకి వచ్చే ఆర్టీసీ బస్సులన్నీ కిటకిట

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం నూరుశాతం సార్థకతను సాధించింది. ఉచిత ప్రయాణంపై మహిళలు అధిక శాతం మొగ్గుచూపుతున్నారు. ఉద్యోగాలు, ఉపాధి, షాపింగ్, ఆస్పత్రులు ఇలా తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆర్టీసీ విజయవాడ రీజియన్ పరిధిలో సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణిస్తున్నారు. ఏ బస్సు చూసినా 95 శాతం మహిళలే కనిపిస్తున్నారు. జీరోఫేర్ టికెట్‌తో వీరికి కోట్ల రూపాయల సబ్సిడీ లబ్ధిగా చేకూరింది.

- 95 శాతంపైగా మహిళా ప్రయాణికులే..
- ఉద్యోగాలు, ఉపాధి, షాపింగ్, ఆస్పత్రులకు రాక
- సగటున రోజుకు లక్షన్నర మంది ప్రయాణాలు
- జీరోఫేర్ టికెట్‌తో మహిళలకు కోట్ల రూపాయల సబ్సిడీ లబ్ధి
- బస్‌పాస్‌ల రెన్యువల్ తగ్గించేసిన పురుషులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ ప్రాంతాల నుంచి విజయవాడ సిటీలోకి వచ్చే బస్సులన్నిటిలో నూటికి 98 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారు. మహిళల తాకిడి తట్టుకోలేక సబర్బన్ పరిధిలోని పురుషులు బస్‌పాస్‌లను తీసుకోవటం మానేశారు. దీంతో విజయవాడ రీజియన్ పరిధిలోని రూరల్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు పూర్తిగా మహిళలతో నిండిపోతున్నాయి. విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాల నుంచి విజయవాడ నగరానికి వచ్చే బస్సుల్లో ఈ పరిస్థితి ఉంది. ఇబ్రహీంపట్నం - విజయవాడ, హనుమాన్ జంక్షన్ - విజయవాడ, నున్న - విజయవాడ, గన్నవరం - విజయవాడ, కంకిపాడు - విజయవాడ, ఉయ్యూరు- మిగతా 6లో..


రూరల్ ప్రాంతాల నుంచి విజయవాడకు బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు

తగ్గిన బస్‌పాస్‌ల రెన్యువల్

విజయవాడ సిటీలో ఉద్యోగాలు, పనుల కోసం వచ్చే పురుషులు ఎక్కువగా బస్‌పాస్‌లను తీసుకుంటున్నారు. నెలాఖరులో రెన్యువల్ చేసుకుంటారు. ఈ సెప్టెంబరు నెలకు బస్‌పాస్‌లు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని ఆర్టీసీ అధికారులు గుర్తించారు. మహిళా ప్రయాణికుల తాకిడి వల్లే వీరు పాస్‌లు రద్దు చేసుకుని ద్విచక్రవాహనాలు, ఆటోల మీద ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే బస్సులలో నలుగురైదుగురు పురుషులు తప్పితే అంతా మహిళలే ఉంటున్నారు.

పక్షం రోజుల్లో స్త్రీశక్తి పథకం అమలు ఇలా..

ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిమిత్తం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించి పక్షం రోజులు పూర్తయింది. ఈ సందర్భంగా విజయవాడ రీజియన్ పరిధిలో ప్రయాణించిన మహిళలు, వారికి జీరో ఫేర్ టికెట్ ప్రాతిపదికన చేకూరిన లబ్ధి వివరాలు ఇలా..



తేదీ	ప్రయాణికులు	లబ్ధి రూ.
15.8.2025	5,11	రూ.1,50,190
16.8.2025	75,557	రూ.23,16,510
17.8.2025	1,00,456	రూ.32,58,235
18.8.2025	1,32,115	రూ.40,40,740
19.8.2025	1,33,394	రూ.37,50,735
20.8.2025	1,46,060	రూ.40,48,735
21.8.2025	1,54,611	రూ.42,26,955
22.8.2025	1,58,884	రూ.43,05,690
23.8.2025	1,51,614	రూ.42,59,875
24.8.2025	1,40,192	రూ.41,49,490,
25.8.2025	1,74,134	రూ.49,12,870
26.8.2025	1,59,417	రూ.43,32,240
27.8.2025	87,617	రూ.22,36,340
28.8.2025	1,48,035	రూ.39,55,575
29.8.2025	1,68,859	రూ.44,85,670
30.8.2025	1,81,010	రూ.51,83,770
31.8.2025	1,54,124	రూ.44,98,385

జలపాతాల కనువిందు

- కొండపల్లి రిజర్వ్ ఫారెస్టులో జాలువారుతున్న జలపాతాలు
- పర్యాటకులను కట్టిపడేస్తున్న జలపాత సోయగాలు
- జలపాతాల సందర్శనకు పెద్ద ఎత్తున వస్తున్న పర్యాటకులు
- జలపాతాల వద్దకు దారి సౌకర్యం లేక నానా ఇబ్బందులు



భారీ వర్షాలకు కొండపల్లి రిజర్వు ఫారెస్టులో జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. కొండపల్లి ఖిల్లాకు వెళ్లే ఘాట్‌రోడ్డు మార్గంలో ఈ వాటర్ ఫాల్స్ కనిపిస్తున్నాయి. ఇక్కడకు వెళ్లేందుకు మార్గం లేకపోయినా కొందరు యువకులు మాత్రం సాహసం చేసి వెళ్తున్నారు. 8

దసరా స్పెషల్స్@ 500



ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ప్రణాళిక

స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

- పీఎన్‌బీఎస్‌కు వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా ఆపరేషన్స్
- అమలాపురం, కాకినాడ, రాజమండ్రి, రాయలసీమకు సర్వీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) రికార్డు స్థాయిలో 500 స్పెషల్ బస్సులు నడపాలని భావిస్తోంది. త్వరలో దీనికి సంబంధించి అధికారికంగా షెడ్యూల్ ప్రకటించనుంది. దసరా స్పెషల్ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత రాయితీ యథాతథంగా అమలు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడ రీజియన్ పరిధిలో మొత్తం 672 బస్ సర్వీసులు ఉన్నాయి. వీటిలో దూర ప్రాంత సర్వీసులను మినహాయిస్తే 500 బస్సులు ఉంటాయి. వీటన్నింటినీ కూడా దసరా ఉత్సవాలకు నగరానికి వచ్చే వారి రాకపోకల కోసం ఉపయోగించాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. విజయవాడ సబర్బన్ పరిధిలో మొత్తం 279 సిటీ ఆర్డినరీ బస్సులు, 100 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు తిరుగుతున్నాయి. ఇవి కాకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ తదితర బస్సులను కూడా డిమాండ్‌ను బట్టి స్పెషల్ సర్వీసులుగా నడపాలని భావిస్తున్నారు. దసరా సీజన్‌లో ప్రధానంగా అమలాపురం, కాకినాడ, రాజమండ్రి, రాయలసీమ ప్రాంతాలకు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. సిటీ బస్ టెర్మినల్‌కు వచ్చే ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేర్చటానికి వీలుగా స్పెషల్ ఆపరేషన్ చేపట్టనున్నారు. పండుగకు వచ్చే వారి కోసం హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరులకు కూడా స్పెషల్ సర్వీసులు నడపనున్నారు.

మగబిడ్డ దత్తత పేరుతో మోసం

- నలుగురిపై కేసు 8

మత్తు స్వరూపం!

డ్రాపింగ్ పాయింట్ లొకేషన్ పంపిన స్వరూపరాజు

- ఎండీఎంఏ కేసులో కొత్త పేరు
- బయటకు వస్తున్న మత్తు లింక్‌లు
- పోలీసులను తప్పుదోవ పట్టించిన శ్రీవాత్సవ్
- స్వరూపరాజు పేరును గోప్యంగా ఉంచిన ప్రధాన నిందితుడు
- లోహిత్‌ను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు
- 12 వరకు రిమాండ్



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : వైజాగ్ ప్రేమికుల డ్రగ్ కేసులో ప్రధాన నిందితుడు పోలీసులను తప్పుదారి పట్టించాడా? వాంగ్మూలంలో వాస్తవాలు చెప్పకుండా గోప్యంగా ఉంచాడా? అంటే అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. కొద్దిరోజులు క్రితం వైజాగ్‌కు చెందిన అర్షా శ్రీవాత్సవ్, బొడ్డేపల్లి హవీల డిలైట్ ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌తో ఈగల్ బృందానికి చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసును తవ్వే కొద్దీ కొత్త కోణాలు, లింక్‌లు బయటకు వస్తున్నాయి. వైజాగ్‌కు చెందిన లోహిత్ యాదవ్ డ్రాపింగ్ పాయింట్ లొకేషన్‌ను వాట్సాప్‌లో పంపాడని, అక్కడి నుంచి తాను డ్రగ్‌ను తీసుకున్నానని పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. లోహిత్‌ను అదుపులోకి తీసుకున్న తర్వాత శ్రీవాత్సవ్ వాస్తవం చెప్పలేదని తేలింది. లోహిత్‌ను పోలీసులు విచారించగా అసలు విషయంతో పాటు కొత్తపేరు వెలుగులోకి వచ్చింది. శ్రీవాత్సవ్, హవీల నుంచి ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని తానే తెప్పించుకున్నట్టు లోహిత్ యాదవ్ వెల్లడించాడు. దీనికి సంబంధించి రూ.13వేలను పేమెంట్ యాప్ ద్వారా పంపించాడు. దీంతో శ్రీవాత్సవ్, మిగతా 6లో..

ఎవరీ స్వరూపరాజు

లోహిత్ యాదవ్‌ను విచారించగా వైజాగ్‌కు చెందిన స్వరూపరాజు పేరు వెలుగులోకి వచ్చింది. అతడిని పోలీసులు ఏ6 నిందితుడిగా ఎఫ్ఆర్‌లో చేర్చబోతున్నారు. బెంగళూరులోని సింగసంద్ర మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఉన్న డ్రాపింగ్ పాయింట్‌ను శ్రీవాత్సవ్‌కు స్వరూపరాజు వాట్సాప్ ద్వారా పంపాడు. ఇప్పుడు ఈ స్వరూపరాజు ఎవరన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. లోహిత్ యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న విషయం తెలియడంతో స్వరూపరాజు సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఐదుగురు నిందితులు ఉన్నారు. నిందితులు ఒక్కొక్కరు దొరికే కొద్దీ ఈ లింక్‌ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో స్వరూపరాజును ఆరో నిందితుడిగా చేర్చాలని కోరుతూ పోలీసులు కోర్టులో మెమో దాఖలు చేశారు.

దసరా ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు, దుర్గగుడి ఈవో శీనానాయక్ తదితరులు



దసరా ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా అధికారులు
- పలు కీలక నిర్ణయాల అమలుకు ప్రణాళిక
- భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యంగా అడుగులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్ తదితరులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. మూల నక్షత్రం రోజున భారీగా తరలివచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని వీఎంసీకి సమీపంలోని పూల మార్కెట్ ఖాళీ స్థలాన్ని రెండో హోల్డింగ్ ఏరియాగా నిర్ణయించారు. ఇది భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి, క్యూలలోకి క్రమంగా ప్రవేశించడానికి ఉపయోగపడుతుంది. భక్తుల రద్దీని నియంత్రించడానికి ఏర్పాటు చేయనున్న క్యూలైన్ ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. ఈ క్యూలైన్‌లు వినాయకుడి గుడి, సీతమ్మ వారి పాదాలు, ఆర్ఈ చైనావాల్, టోల్‌గేట్, ఘాట్ రోడ్డు మీదుగా అమ్మ వారి ఆలయం వరకు ఏర్పాటు చేస్తారు. గతంలో మిగతా 6లో..

ప్రత్యేక ప్రసన్నం

రిటైరైన మర్నాడు నుంచి ఉద్యోగం

- అధికారిక ఉత్తర్వులు లేకుండానే విధులు
- ఓఎస్డీ నియామకం జరిగిందంటూ కేక్ కటింగ్‌లు
- ఎన్టీఆర్ కమిషనరేట్‌లో చర్చనీయాంశంగా మారిన అధికారి వ్యవహారం


ఏవీఎల్ ప్రసన్నకుమార్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సాధారణంగా ఉద్యోగులు పదవీ విరమణ చేశాక ఇంటికే పరిమితమవుతారు. ఏదైనా పని ఉంటేనే కార్యాలయం మెట్లు ఎక్కుతారు. కొన్ని శాఖల్లో ఉద్యోగ విరమణ చేసిన వారిని ప్రత్యేకాధికారులు (ఓఎస్డీ)గా నియమించుకుంటారు. ప్రభుత్వం ఆమోదం తెలిపి ఉత్తర్వులు జారీ అయిన తర్వాత మాత్రమే ఓఎస్డీ హోదా వస్తుంది. అటువంటిది ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే ఓ అధికారి ఉద్యోగ విరమణ చేసిన మర్నాడు నుంచే అధికారిక విధుల్లో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఆయనే విజయవాడ ట్రాఫిక్ ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్. దీనిపై కూటమి ప్రభుత్వంలో అసలు ఏం జరుగుతుందంటూ పోలీసు వర్గాల్లో చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏవీఎల్ ప్రసన్నకుమార్‌కు 2024లో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. సెలవు కావడంతో కమిషనరేట్ అధికారులు కమిషనర్ కార్యాలయంలో శనివారమే వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత ట్రాఫిక్ విభాగంలో పనిచేసే ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు కలిసి ఆదివారం మరో వీడ్కోలు కార్యక్రమాన్ని బెంజిసర్కిల్‌లో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తన వంతుగా కొంత మొత్తాన్ని ప్రసన్నకుమార్ ఇచ్చారు.

మాటే అధికారికమా..

ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో అన్ని శాంతి భద్రతల పోలీస్‌స్టేషన్లకు అధికారులు దాతల విరాళాలతో డ్రోన్లు సమకూర్చారు. అదేవిధంగా ట్రాఫిక్ విభాగానికి ఆరు డ్రోన్లను సమకూర్చారు. జూలై 31వ తేదీన కమిషనరేట్‌లో నిర్వహించిన ఇన్‌స్పెక్టర్లకు డ్రోన్లను అందజేసే కార్యక్రమానికి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హాజరయ్యారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు సాంకేతికంగా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రసన్నకుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ ప్రజంటేషన్ పూర్తయిన తర్వాత డీజీపీ ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆగస్టు నెలాఖరున ఉద్యోగ విరమణ మిగతా 6లో..

నిర్లక్ష్యపు అధికారులపై సస్పెన్షన్ వేటు : కలెక్టర్ 8

కొణిజర్ల-నెమలి గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



వీడని వరద..!

- పొంగుతున్న వాగులు.. వంకలు!
- కట్టలు తెగుతున్న చెరువులు
- పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

6

నేటి నుంచి భారీ వర్షాలు

వాతావరణ శాఖ హెచ్చరిక

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉన్న నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంగళవారం నుంచి మోస్తారు నుంచి భారీ వర్షాలు పడనున్నట్టు తెలిపింది. తీరం వెంబడి 40-50 కిలోమీటర్ల మిగతా 6లో..


ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ భాస్కర్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న కౌలురైతు సంఘం నేతలు

పంట రుణాలు మంజూరు చేయండి

» కౌలు రైతు సంఘం నేతల వినతి

వన్‌టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంటలు పండించే కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వడ్డీ రాయితీతో కూడిన రుణ సౌకర్యం లేక అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని.. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, బ్యాంకర్లపై ఉందని ఏపీ కౌలు రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. పంట రుణాలు మంజూరు చేయాలని కోరుతూ.. విజయవాడ వన్‌టౌన్ ఆర్ఆర్ అప్పారావు వీధిలో ఉన్న స్టేట్‌లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 70 శాతం భూమిని కౌలు రైతులు సాగుచేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట రుణాలకు వడ్డీ రాయితీలు, భూ యజమానులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వడ్డీ రాయితీతో రుణ సౌకర్యం లేకపోవటం వలన అధిక వడ్డీలకు అప్పులు చేసి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం నాయకులు ఎస్ఎల్‌బిసి కన్వీనర్ సి.వి.ఎస్.భాస్కరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేస్తామని సీసీఆర్‌సీ లేనివారికి ఈ-క్రాఫ్ నమోదైన ప్రతి కౌలు రైతులను జల్ జీవన్ మిషన్ ద్వారా పంట రుణాలు రూ.2లక్షలకు తక్కువ లేకుండా మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, రాష్ట్ర నాయకులు కె.ప్రభాకర్ రెడ్డి, కె.వి.పి.ఎస్. రాష్ట్ర కార్యదర్శి ఎ.మల్యాద్రి, సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరణలో నినాదాలు చేస్తున్న నేతలు

పత్తి దిగుమతులపై సుంకాలు పునరుద్ధరించాలి

» కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య

గొల్లపూడి : భారత ప్రభుత్వం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం దుర్మార్గమని, వెంటనే దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలని కౌలు రైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారత కిసాన్ సభ కొర్కెల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, రాయనపాడు గ్రామంలో రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్తి పై దిగుమతి సుంకాలు తగ్గింపు వలన దేశీయంగా పత్తి పండించే రైతులకు తీవ్ర నష్టమన్నారు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలను విధించడం వలన దేశంలోనే రొయ్యల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులు వీధిన పడ్డారన్నారు. దిగుమతి సుంకం తగ్గించడం వలన ఆయిల్‌పామ్ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం పత్తిపై దిగుమతి సుంకాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు బత్తుల సత్యనారాయణ, జి.దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిపై వేటు

» కలెక్టర్ ఆదేశంతో విచారణ, సస్పెండ్


బండి సాయిశ్రీ (ఫైల్‌ఫొటో)

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఎ.కొండూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందాల్సిన యూరియాను కాసులకు కక్కుర్తిపడి ప్రైవేటు డీలర్లకు తరలించిన మండల వ్యవసాయాధికారిపై సస్పెన్షన్ వేటుపడింది. ఆగస్టు 29న 'ఆంధ్రజ్యోతి'లో యూరియా, డీఏపీ అక్రమాలపై సమగ్ర కథనంపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ విచారణకు ఆదేశించారు. జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం, కె.నాగమల్లిక, తహసీల్దార్ కె.లక్ష్మీలు ఎ.కొండూరు, చీమలపాడు, రామచంద్రాపురం గ్రామాల్లో విచారణ నిర్వహించారు. 50 టన్నుల ఎరువులను మండల వ్యవసాయాధికారి బండి సాయిశ్రీ ప్రైవేటు వ్యాపారస్తులతో కుమ్మక్కై బ్లాక్‌మార్కెట్‌కు తరలించినట్టు విచారణలో తేలింది. అధికారుల నివేదిక ఆధారంగా కలెక్టర్ జి.లక్ష్మీశ ఏవో బండి సాయిశ్రీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రామచంద్రాపురం, చీమలపాడు, ఎ.కొండూరు గ్రామ వ్యవసాయ సహాయకులకు మెమోలు జారీ చేశారు.

నేటి నుంచి భారీ వర్షాలు

(5వ పేజీ తరువాయి)

వేగంతో గాలులు వీచే ప్రమాదముందని స్పష్టం చేసింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. సోమవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 3.42 లక్షల క్యూసెక్కులు ఉందని జిల్లా అధికారులు తెలిపారు. దాదాపు మొదటి ప్రమాద హెచ్చరిక వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందన్నారు. వరదలు పూర్తిగా తగ్గే వరకు ప్రమాదకరమైన వాగులు, కాల్వలు దాటే ప్రయత్నం చేయొద్దని ప్రజలకు సూచించారు.

ప్రత్యేక ప్రసన్నం

(5వ పేజీ తరువాయి)

చేసినా తిరిగి ఓఎస్డీగా నియమిస్తామని డీజీపీ ప్రకటించారు. దీంతో అప్పటి నుంచి ప్రసన్నకుమార్ తనను ఓఎస్డీగా నియమించడం ఖాయమన్న భావనలో ఉన్నారు. ప్రసన్నకుమార్‌ను తిరిగి ట్రాఫిక్‌లో ఓఎస్డీగా నియమించాలని కమిషనర్ కార్యాలయం నుంచి డీజీపీ కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన ప్రసన్నకుమార్ ఎలాంటి అధికార ఉత్తర్వులు లేకుండానే సోమవారం నుంచి విధుల్లో పాల్గొన్నారు. పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు రోజూ కమిషనరేట్ పరిధిలో ఉన్న డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఈ కాన్ఫరెన్స్‌లో ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. ట్రాఫిక్ విభాగంలో ఏమేమి చేస్తున్నారో ఆ చర్యలను సీపీకి వివరించడం గమనార్హం. ఇది పూర్తయ్యాక అధికారిక వాహనంలో మంగళగిరి వెళ్లారు. డీజీపీని కలిసి తిరిగి ట్రాఫిక్ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. పోలీసు శాఖ కానిస్టేబుల్ దగ్గర నుంచి ఉన్నతాధికారి వరకు ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు) ఉంటుంది. అధికారులు తమ కింద పనిచేసే సిబ్బందికి ఈ ఏసీఆర్‌ను రాయాల్సి ఉంటుంది. అధికారి బదిలీపై వెళ్లినా, ఉద్యోగ విరమణ చేసినా దిగువన ఉన్న సిబ్బంది ఈ ఏసీఆర్ రాయించుకుంటారు. ఇలా ఏసీఆర్ రాయించుకోవడానికి వెళ్లిన ఇన్‌స్పెక్టర్లతో తనకు ఓఎస్డీ నియామకం జరుగుతుందని, డీజీపీ హామీ ఇచ్చారని చెప్పుకొచ్చారు. వెంటనే ఇన్‌స్పెక్టర్లు ఆగకుండా అప్పటికప్పుడు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 22 నుంచి నిర్వహించే దసర శరన్నవరాత్రి మహోత్సవాల క్యూలైన్లను పరిశీలించడానికి జిల్లా అధికారులు ఇంద్రకీలాద్రి వెళ్లారు. ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకుండానే ప్రసన్నకుమార్ విధుల్లో పాల్గొనడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

వీడని వరద..!



» పొంగుతున్న వాగులు.. వంకలు!
» కట్టలు తెగుతున్న చెరువులు
» పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం
» గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

లింగాల కాజ్‌వేను అనుకుని ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మునేరు

ఎగువన తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలకు దిగువన ఉన్న తిరువూరు మండలంలోని పలు చెరువులు, వాగుల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. తిరువూరుకు సమీపంలోని తెలంగాణ రాష్ట్రంలోని లంకాసాగర్‌కు 3270 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో కట్టలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. గంపలగూడెం మండలం వినగడప వద్ద డైవర్షన్ రహదారిపై వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. చెరువులన్నీ సామర్థ్యానికి మించి ప్రవహిస్తున్నాయి. కనుగుల చెరువు-మల్లమ్మచెరువుల మధ్య అక్కపాలెం రోడ్డులో వరదనీరు ప్రవహిస్తున్నది. చెరువుల కట్టలకు గండ్లు పడతాయనే భయందోళన ఆయకట్టు రైతుల్లో నెలకొంది. ఇప్పటికే పోతుల చెరువు సమీపంలో కట్టుకల్వకు గండి కొట్టి వరదనీటిని వాగుకు మళ్లించారు. అక్కపాలెం- తిరువూరు మధ్య పడమటి వాగు చప్టాపై వరదనీరు ప్రహించడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండంతో పాటు, చెరువుల అలుగులు పారుతున్నాయి. ఆయకట్టు పరిధిలోని కొన్ని పొలాల్లో భారీగా నీరు చేరడంతో రైతులు పొలం కట్టలకు గండ్లు పెడుతూ నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు.

తిరువూరు/కంచికచర్ల/వత్సవాయి/పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

ఉధృతంగా మునేరు..

మునేరుకు ఎగువ నుంచి ఉధృతంగా వరద వస్తుండటంతో గంట గంటకు ప్రవాహం పెరుగుతోంది. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు వత్సవాయి మండలం పోలంపల్లి ఆనకట్ట వద్ద 3,171 క్యూసెక్కులున్న వరద మధ్యాహ్నం 12.30 గంటలకు 11,573 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం ఆరుగంటలకు 25,374 క్యూసెక్కులకు పెరిగింది. చిల్లకల్లు - వైరా రూటులో లింగాల వద్ద కాజ్‌వేను ఆనుకుని మునేరు ప్రవహిస్తున్నది. ఏ క్షణమైనా వరద కాజ్‌వే పైకి చేరి.. మరో ఐదు వేల క్యూసెక్కులు పెరిగితే రహదారిలో వాహనాల రాకపోకలు స్తంభించనున్నాయి. తెలంగాణా రాష్ట్రం ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వచ్చే మూడు రోజులు విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరిస్తున్నందున మునేరు ఉగ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాల ఏర్పాటుతో పాటుగా ఎలాంటి నష్టం జరగకుండ చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

● వైరాయేరు, కట్లేరుల వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. నందిగామ మండలం దాములూరు కూడలి కాజ్‌వేపై మూడు నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తున్నది. వరద పోటెత్తటంతో


ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు వాగు

కూడలి మార్గం పదిరోజుల నుంచి బంద్ అయింది. వీరులపాడు, నందిగామ మండలాల మధ్య, ఖమ్మం జిల్లా మధిరకు వాహనాలు నడవటం లేదు. సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● కృష్ణానదికి ఎగువ నుంచి మూడు లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. మునేరు, వైరాయేరు, కట్లేరుల వరద కూడా కలుస్తుండటంతో కృష్ణానదికి వరద పెరుగుతోంది. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటుగా నదిలోకి దిగవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని, పడవలు నడపరాదని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

లింగాల కాజ్‌వే వద్ద..

పోలంపల్లి ఆనకట్ట వద్ద వరద 10 అడుగులకు చేరింది. ఆనకట్ట వద్ద మరో 2 అడుగులు పెరిగితే లింగాల కాజ్‌వే పైకి వచ్చే అవకాశం ఉందని మునేరు ఏఈ రామనరసింహ తెలిపారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావులు పరిస్థితి పరిశీలించి సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

పెనుగంచిప్రోలు తహసీల్దార్ శాంతి లక్ష్మీ, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున మునేటి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా సిబ్బందిని అప్రమత్తం చేశారు.


కాజ్‌వే వద్ద మునేటి వరద ఉధృతి

మళ్లీ పెరిగిన వరద

అవనిగడ్డ రూరల్ : ఎగువ నుంచి మళ్లీ వరద నీరు విడుదల చేయటంతో పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం 3 లక్షల 28 వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవాహిస్తోంది. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

కొణిజర్ల-నెమలి గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

కొణిజర్ల(గంపలగూడెం) : అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు, వాగులు, చెరువుల అలుగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం మండలంలోని కొణిజర్ల-నెమలి మధ్యలో గల నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో, ఈ రహదారిలో ఉదయం నుంచి రాకపోలు నిలిచిపోయాయి.


కనుగులచెరువు-మల్లమ్మ చెరువు మధ్య రోడ్డుపై నీటి ప్రవాహం

బాబు.. బంగారం



సీఎంగా చంద్రబాబు 30 ఏళ్ల ప్రస్థానంపై నేతల మనోగతం..

దార్శనిక నేత : ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నారా చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబరు 1న తొలిసారిగా ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని, తెలుగు నేలపై నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా, 14 ఏళ్ల 11 నెలలు (5,442 రోజులు) పనిచేసిన ఏకైక సీఎంగా రికార్డు సృష్టించిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. 15 ఏళ్ల కాలంలో రాష్ట్రంతో పాటు దేశ రాజకీయాల్లో అనేక సంక్షోభాలను పరిష్కరించిన అపర చాణక్యుడిగా చంద్రబాబు జాతీయస్థాయిలో పేరు గాంచారన్నారు. విజనరీ అన్న పదానికి నిర్వచనం చంద్రబాబు అనడంలో అతిశయోక్తి లేదన్నారు. నాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ, నేడు అమరావతిలో క్వాంటం వ్యాలీకు రూపకల్పన చేసిన దార్శనికత ఆయన సొంతమన్నారు.

విజనరీ లీడర్ : ఎమ్మెల్యే బొండా ఉమా



అజిత్‌సింగ్‌నగర్ : క్రమశిక్షణ, దూరదృష్టి కలిగిన నేత.. విజనరీ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రయాణంలో అనేక ఒడిదుడుకులు అధిగమించారన్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభాలు, విద్యుత్ కోతలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొని పాలనను గాడిలో పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచపటంలో నిలబెట్టనున్నారన్నారు. చంద్రబాబు నేటి తరం నాయకులకు ప్రేరణగా నిలుస్తారన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి

- ఎమ్మెల్యే వసంత



మైలవరం : రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు 74 ఏళ్ల వయసులోనూ యువకుడిలా అహర్నిశలు శ్రమిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. 74 సంవత్సరాల వయసులో నవ యువకుడిలా ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు దృఢ సంకల్పం ముందు వైసీపీ కుయుక్తులు పారవన్నారు.

జగన్.. వైఖరి మార్చుకో

- ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం : అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. క్రమం తప్పకుండా అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తున్న చంద్రబాబును చూసైనా జగన్మోహన్ రెడ్డి తన వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హితవు పలికారు. నిడమానూరులో సోమవారం యార్లగడ్డ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవి స్వీకరించి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈనెల 18నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు జగన్ రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాలని సూచించారు. అసెంబ్లీకి రాని మాజీ ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారేమోనని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షతతో రాష్ట్రంలో సంపద సృష్టించడం ద్వారా సంక్షేమ పథకాల అమలు చేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.


విజయవాడ ఎంపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం..

- మాజీ మంత్రి దేవినేని ఉమా



గొల్లపూడి : చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లు పూర్తవడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు ఆశాకిరణంలా చంద్రబాబు నిలిచారన్నారు. చంద్రబాబు దూరదృష్టి వల్లే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా ఎదిగిందన్నారు. నేడు అమరావతిలో క్వాంటం వ్యాలీ నిర్మాణానికి రూపకల్పన చేస్తు భవిష్యత్‌తరాలకు అవకాశాలు, అధునాతన టెక్నాలజీ పరిశ్రమలకు కేంద్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.

చంద్రబాబు కృషికి తార్కాణం..

ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు : ఎవరు ఎన్ని అటంకాలు సృష్టించినా మొక్కవోని దీక్షతో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయాణం కొనసాగుంతుందని.. నాటి హైటెక్ సిటీ నుంచి నేటి అమరావతి రాజధాని వరకు ఆయన కృషికి తార్కాణమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రవేశ పెట్టిన వివిధ పథకాలు, బడుగు బలహీన వర్గప్రజలకు భరోసా కల్పించాయన్నారు.

అభివృద్ధికి నిర్వచనం : శావల దేవదత్



అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిర్వచనం చంద్రబాబు అని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ చైర్మన్ శావల దేవదత్ అన్నారు. భవిష్యత్‌తరాలకు సంక్షేమ ఫలాలు అందించాలనే, విజన్‌తో చంద్రబాబు ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. సాంకేతిక రంగాన్ని యువతకు అందించడంతో పాటుగా, సంక్షేమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయమైన గొప్ప నేత

- మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ : రాష్ట్రాభివృద్ధి కోసం జీవితాన్నే అంకితం చేసి పనిచేస్తున్న గొప్ప నేత చంద్రబాబు అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులు అన్నారు. కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టి.. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ప్రపంచంలో వస్తున్న పరిణా



మాలు ముందుగానే గమనించి ఐటీ అభివృద్ధికి బాటలు వేశారని, నాటి ముందుచూపే నేడు పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. చంద్రబాబు వంటి దార్శనికుడైన వ్యక్తి మరో 15 ఏళ్లు పాటు అధికారంలో ఉండాలని కనపర్తి శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

అభివృద్ధే ధ్యేయంగా..

- ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



పెడన రూరల్ : నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ను ఎంతో అభివృద్ధి చేసిన వ్యక్తి చంద్రబాబు.. అని అభివృద్ధే ధ్యేయంగా ఉద్యోగ, ఉపాధి రంగాలల్లో తనదైన శైలిలో అభివృద్ధి చేసి చూపించారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఉన్నప్పటికి, సకాలంలో అమరావతి, పోలవరం పూర్తిచేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ఘనత చంద్రబాబుదే

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

వన్‌టౌన్ : సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. గురునానక్ కాలనీలో పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం టీడీపీ నాయకులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేసి సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్‌లు గొట్టుముక్కల రఘురామరాజు, పేరేపి ఈశ్వర్, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి దుర్గారావు, నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, మల్లెల విజయకుమార్, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు స్వరూపం!

(5వ పేజీ తరువాయి)

హవీల వద్ద ఉన్న ఎల్ఎస్‌డీ అతడిదేనని తేలిపోయింది. శ్రీవాత్సవ్‌తో లింక్‌లు ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు ఒకటో ఏసీఎంఎం కోర్టులో సోమవారం హాజరుపరిచారు. అతడికి పోలీసులు 12వ తేదీ వరకు రిమాండ్ విధించింది.

ఇదీ లోహిత్ చరిత్ర

విశాఖపట్నం గొల్లపాలెం ప్రాంతానికి చెందిన జోగా లోహిత్ యాదవ్ ఖాళీగా ఉంటున్నాడు. అతడి తండ్రి వెంకట శ్రీనివాస్ విశాఖ మహానగర పాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. లోహిత సోదరుడు వెంకట జయ శ్రావణ్ ఇంజనీరింగ్ పూర్తిచేసి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో వేసవి సెలవుల్లో డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. బీవీకే కళాశాలలో డిగ్రీలో చేరిన లోహిత్ కొద్దిరోజుల క్రితమే విద్యను మధ్యలో ఆపేశాడు. అక్కడే స్నేహితుల ద్వారా ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్స్‌ను అలవాటు చేసుకున్నాడు. కళాశాల విద్యను ఆపేసిన లోహిత ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. ఆ క్రమంలోనే శ్రీవాత్సవ్, స్వరూపరాజుతో పరిచయం ఏర్పడింది. డ్రగ్స్ విక్రయించే వారితో స్వరూపరాజుకు విస్తృత పరిచయాలు ఉన్నాయి.

పెరిగిన స్త్రీ శక్తి!

(5వ పేజీ తరువాయి)

విజయవాడ బస్సులలో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ కనిపిస్తోంది. విజయవాడ సిటీ ఇంకా గ్రేటర్ కానప్పటికీ.. ఆర్టీసీ సబర్బన్ పరిధి మాత్రం గ్రేటర్ దాటి వెళుతుంది. విజయవాడ నుంచి మైలవరం, నూజివీడు, నున్న, ఆగిరిపల్లి, గన్నవరం, హనుమాన్ జంక్షన్, అమరావతి, మంగళగిరి, కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు వరకు నలువైపులా సబర్బన్ పరిధి ఉంది. ఈ సబర్బన్ లిమిట్స్‌లో సిటీ ఆర్డినరీలు, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుస్తున్నాయి. పల్లె వెలుగు బస్సులు ఎలాగూ ఉంటాయి. ఉచిత ప్రయాణం కాబట్టి మహిళలు సౌకర్యవంతంగా ఉండే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు. ఆ తర్వాత సిటీ బస్సులను ఎంపిక చేసుకుంటున్నారు. సబర్బన్ పరిధిలో రూరల్ ప్రాంతాలలో ఉండే మహిళలు ఎక్కువగా విజయవాడలో ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు కంపెనీలలో పనిచేస్తున్నారు. ఆ తర్వాత షోరూమ్‌లు, మాల్స్, సూపర్ బజార్స్, సినిమా థియేటర్లు, వస్త్ర దుకాణాలు, బంగారు దుకాణాలు, ఫ్యాక్టరీలు, స్వీట్ షాపులు, ప్రింటింగ్ ప్రెస్‌లు, డెయిరీ, సెక్యూరిటీ సంస్థలలో పనిచేస్తూ ఉపాధి పొందేవారు చాలా మంది ఉన్నారు. వీరంతా గతంలో ఆటోలను ఆశ్రయించేవారు. ప్రస్తుతం ఉచిత ప్రయాణం కాబట్టి అవసరమైతే ఒక గంట ముందే బస్టాపులకు వచ్చి బస్సుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. వీరు కాకుండా విజయవాడ షాపింగ్ చేయటానికి వచ్చే మహిళల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిపోయింది. మార్ట్‌లకు వచ్చి సరుకులు తీసుకునేందుకు కూడా సాధారణ గృహిణులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో మహిళా ప్రయాణీకుల సంఖ్య రూరల్ ప్రాంతాల నుంచి విజయవాడకు గణనీయంగా పెరిగింది. జిల్లా బస్సులలో గతం కంటే 5 శాతం మాత్రమే మహిళా ప్రయాణికులు పెరిగారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ఉన్న సమస్యలను అధిగమించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికలు

దసరా ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్కింగ్ స్థలాల గుర్తింపు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలపై పోలీస్ కమిషనర్ సమీక్షించారు. క్యూలైన్‌లలో భక్తులకు మంచినీరు, పాలు, అన్నప్రసాదం అందించే ఏర్పాట్లు చేయనున్నారు. మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రాలు, సమాచార కేంద్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గతేడాది అనుభవాల దృష్ట్యా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నారు. ఆలయ పరిసరాలు, క్యూలు, ఘాట్‌లలో సీసీటీవీ కెమెరాల నిఘా పెంచనున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని స్వచ్ఛాంధ్ర సేవకులకు కల్పించనున్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను విజయవంతం చేయడానికి, భక్తులకు మెరుగైన దర్శనం, సౌకర్యాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆలయ ఇంజనీర్లు కె.వి.ఎస్.ఆర్.కోటేశ్వరరావు, రాంబాబు, ఏసీ రంగారావు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 570

టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ

కృష్ణలంక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 21వ డివిజన్ జనసేన అధ్యక్షుడు కోడూరు కిరణ్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని కల్పన ప్రింట్స్ సెంటర్‌లోని జనసేన కార్యాలయం వద్ద తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జనసేన ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసులు ఇద్దరు మహిళలకు టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె, అమ్మిశెట్టిలు మాట్లాడుతూ కిరణ్ టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ చేయడం ముదావహమన్నారు. టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కేశనం భావన్నారాయణ, మార్కెట్ యార్డు డైరక్టర్ కొర్రా అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన బాబు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


13వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు 30 సంవత్సరాల క్రితం సరిగ్గా ఇదే రోజున ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి, నాలుగుసార్లు ఆ పదవిని అలంకరించి అభివృద్ధి, సంక్షేమాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కొనియాడారు. సోమవారం 13వ డివిజన్ జేడీ నగర్‌లో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు ఆయన స్వయంగా పింఛన్లు అందజేశారు. అనంతరం డివిజన్‌లో నిరుపేద కుటుంబాలకు రూ.50వేలు విలువ చేసే ఆర్థిక సాయాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. దేశంలోనే మహిళా డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి వారికి ఆర్థికంగా చేయూత ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు గద్దె ప్రసాద్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నూతి శ్రీను, శొంఠి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


6వ డివిజన్‌లో పింఛన్ పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

మాచవరం: తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆదేశాల మేరకు 6వ డివిజన్‌లో లబ్ధిదారులకు డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధర్ తదితరులు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ షకీల, పి.లక్ష్మణ్, సప్ప శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ● 2వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, కార్యదర్శి ఎస్.కృష్ణ ప్రసాద్‌లు సోమవారం లబ్ధిదారులకు పింఛన్ నగదును అందించారు. నాగుల్‌మీరా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సాహితీ సమావేశం


బాల దుర్గా వరప్రసాద్‌ను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ సభ్యులు

పటమట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పటమట కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు ఆధ్వర్యంలో సాహితీ సమావేశం నిర్వహించారు. కొండపల్లి మాధవరావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో గురజాడ అప్పారావు రచనలు, విశిష్టతపై కోటేపల్లి బాల దుర్గా వరప్రసాదరావు వివరించారు. తదుపరి కవితా మేళం నిర్వహించారు. దేవిరాజ్ వెంకటకృష్ణమూర్తి, ప్రభావతి, శాంతి తమ కవితలతో సభను ఊర్రూతలూగించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథి బాలదుర్గ వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సూర్యదేవర పాపారావు, బొమ్మగాని నాగేశ్వరరావు, ఆలూరి రాజేశ్వరరావు, నందమూరి మల్లికార్జునరావు, శివశంకరరావులు, ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల పరిశీలన


ఫన్‌టైమ్స్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులతో విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండేజీ

భారతీనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదో డివిజన్ పరిధిలోని ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్లో ఫన్‌టైమ్స్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలను విశ్వహిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండేజీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు పి త్రిమూర్తి శ్రీనివాసు రాజు, ఫన్‌టైమ్స్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు , పాల్గొన్నారు. ● ఫన్ టైం ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవ వేడుకల్లో సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొప్పన భవకుమార్ పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫన్ టైం ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చవితి పందిరిలో ఎమ్మెల్యే గద్దె పూజలు

కృష్ణలంక: స్థానిక సత్యం హోటల్ సెంటర్ చవితి పందిరిలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సోమవారం పూజలు నిర్వహించారు. కమిటీ నాయకులు వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, పోడూరి పవన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దు

కమిషనర్ ధ్యానచంద్ర


లబ్ధిదారుకు పింఛన్ పంపిణీ చేస్తున్న కమిషనర్

కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పింఛన్‌లు పంపిణీ చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం మాచవరం యర్రం వారి వీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని పింఛన్‌దారుల ఆధార్‌కార్డు పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) ద్వారా చెక్ చేసి పింఛన్‌లు లబ్ధిదారులకు అందజేశారు. పింఛన్‌దారులతో మాట్లాడి వాళ్లకు ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 6 గంటలకు పింఛన్‌ల పంపిణీ ప్రారంభించాలని, పింఛన్‌ల పంపిణీలో ఎటువంటి అలసత్వం వహించరాదని కమిషనర్ అధికారులను సిబ్బందిని హెచ్చరించారు. సాయంత్రం 4.30కు నగరపాలక సంస్థ పరిధిలోని సర్కిల్ 1 పరిధిలో 20,376 పింఛన్‌లకు 18,284, సర్కిల్-2లో 25,793కు 22694, సర్కిల్-3లో 20,381కు 17,998 పింఛన్‌లు పంపిణీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. మిగిలిన పింఛన్‌లు త్వరితగతిన పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం గులాబీ తోట అన్న క్యాంటీన్ పరిశీలించారు. అక్కడ వచ్చిన ప్రజలతో మాట్లాడి స్వయంగా ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కమిషనర్‌తోపాటు ఏఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వకుండా ప్రణాళికలు సిద్ధం చేయండి

కార్పొరేషన్: రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంజీ రోడ్డు, ఈట్ స్ట్రీట్, బెంజిసర్కిల్, పినమనేని పాలీక్లినిక్ రోడ్డు, గుణదల ఈఎస్ఐ హాస్పటల్ రోడ్డు, మాచవరం ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వన్‌టౌన్ లో- బ్రిడ్జిలో వర్షపు నీరు నిల్వటానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈట్‌స్ట్రీట్‌లో వర్షపు నీరు నిల్వ ఉండటంపై ఈఈని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది అధికారులు మొత్తం ఫీల్డ్‌లో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సీఈ శ్రీనాథ్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బుడమేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

ముంపు బాధితుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న బుడమేరు ముంపు బాధితుల ఐక్య వేదిక నాయకులు

కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బుడమేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతూ బుడమేరు ముంపు బాధితుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విజయవాడ ముంపు ప్రాంతాలకు చెందిన వివిధ సంఘాల నాయకులు కలెక్టర్ లక్ష్మీశకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. బుడమేరు ముంపు నివారణ శాశ్వత చర్యలకు రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కోరిన విధంగా కేంద్ర ప్రభుత్వం రూ.6,880 కోట్లు ఆర్థికసాయం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం ముంపు బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అర్బన్ సిటిజన్స్ ఫెడరేషన్ కన్వీనర్ సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ 2047 నాటికి ప్రణాళికలు రచిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, తక్షణ సమస్యగా వున్న బుడమేరు వరదను శాశ్వతంగా నివారించడానికి మాత్రం ప్రణాళికలు రచించడం లేదన్నారు. బుడమేరు ముంపు బాధితుల ఐక్య వేదిక కన్వీనర్ ఎంవీ ఆంజనేయులు మాట్లాడుతూ ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోకపోతే ముంపు ప్రాంత ప్రజలు ఆందోళన చేయడానికి సిద్ధంగా వున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జె.మంగపతి, యు.వి. కృష్ణయ్య, కార్పొరేటర్ సత్తిబాబు, ఎస్.కె.సలీమ్, పౌర సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.లక్ష పలికిన చవితి లడ్డూ


లడ్డూ పాడుకున్న తరుణ్ కాకాని, తదితరులు

పటమట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం సందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించారు. బీజేపీ నాయకులు తరుణ్ కాకాని రూ.1,01,116 వెచ్చించి వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు. గతంలో ఉన్న రికార్డులన్నీ కాదని తరుణ్ లడ్డూను పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుకర్, శ్రీనివాసరాజు ఉప్పలపాటి, పవన్, బొడ్డు నాగలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో
వీధికుక్కల బెడద


కాలనీ అంతర్గత రోడ్లో తిరుగుతున్న వీధికుక్కలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి : నాల్గో డివిజన్ పరిధిలోని కనకదుర్గా గెజిటెడ్ ఆఫీసర్స్, శ్రీనగర్ కాలనీలలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ వీధి కుక్కలు కాలనీలలోని పలు అంతర్గతరోడ్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయంలో కుక్కలు పెద్దగా అరుస్తూ సమీప అపార్టుమెంట్ (ప్రజలను) వాసులను భయానికి గురి చేస్తున్నాయి. అంతే కాకుండా రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారుల వెంట పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మన గ్రామం షాపు వైపున గురునానక్ రోడ్లో నిలిచిన వాన నీరు

ఈ గుంతలకు మోక్షమెప్పుడో?

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ప్రధాన రోడ్లో ఏర్పడిన గుంతలలో ప్రయాణించడానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. న్యూ పిఅండ్‌టీ కాలనీ సమీపంలో మన గ్రామం షాపు వద్ద గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్న పాటి వర్షం కురిసినా వాన నీరు రోడ్డు మీద నిలిచిపోతోంది. దీంతో రోడ్డు అంతా అధ్వానంగా మారుతుందని వాహనదారులు అంటున్నారు. గుంతల రోడ్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ. 8 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఘంటా కృష్ణమోహన్, పిరియా జగదాంబ, కూర్మపు దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి వీపీఎల్ క్వాలిఫైర్ క్రికెట్ టోర్నమెంట్


మాట్లాడుతున్న యువ నాయకులు

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రీమియం లీగ్ (వీపీఎల్) క్వాలిఫైర్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 5 నుంచి ప్రారంభం కానుందని కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ కేశినేని వెంకట్ తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో సోమవారం టోర్నమెంట్‌పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో పాటు విజయవాడ రూరల్ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 10టీమ్‌లు టోర్నమెంట్‌లో ఆడే విధంగా ప్రతిభ గల క్రీడాకారులను పంపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు 4లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. విజేతకు రూ.లక్ష, రన్నర్‌కు రూ.60వేలు, మ్యాన్ ఆఫ్ సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌లకు రూ.పదివేలు నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి, వసంత దిమంత్ సాయి, బోడె వెంకట్, శ్రీరామ్ కృష్ణ పవన్, బొండా సిద్ధార్థ, వర్ల చాణక్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో వర్షపు నీరు తొలగించండి

● ఈవో శీనానాయక్


వర్షపునీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొండపైన ఆలయ ప్రాంగణంలో నిలిన వర్షపు నీరును వెంటనే తొలగించాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ దేవాలయంలో భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ప్రాంతాలను సోమవారం ఆలయ ఈవో శీనానాయక్ తనిఖీ చేశారు. ఆలయ ప్రాంగణంలోని ప్రధాన ఆలయం, పూజా మండపాలు, శివాలయం, మహామండపం గోపికా కృష్ణ బొమ్మల ప్రాంతం వంటి అనేక చోట్ల నీటి నిల్వలను పరిశీలించారు. వెంటనే నీటిని తొలగించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయ పరిసరాల్లో వర్షపు నీరు రాకుండా చూసుకోవాలని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేయియాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ వైర్లు, కొండపై నుంచి రాళ్లు విరిగిపడే అవకాశం ఉండటంతో, భక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు.



నిలిచిన మురుగునీరు

దుర్వాసనతో కృష్ణలంక మెట్లబజార్ వాసుల పాట్లు

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి: స్థానిక మెట్లబజారులోని వాటర్‌ప్లాంట్ ఎదురుసందులో రోడ్డు కిరువైపులా ఓపెన్ డ్రైయినేజీలో మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో వెళ్లాలంటేనే దుర్వాసన వెదజల్లుతోంది. వాటర్‌ప్లాంట్ ఎదురుగా కూడా నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనచోదకులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మురుగునీరు నిలిచిపోవడం వలన దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ సిబ్బంది స్పందించి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

● అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్

కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 9 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 91.88 శాతం పెన్షన్ల పంపిణీ

విజయవాడ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ సోమవారం సాయంత్రానికి 91.88 శాతం పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తెలిపారు. అత్యధికంగా మైలవరం మండలంలో 94.21 శాతం, అత్యల్పంగా చందర్లపాడు మండలంలో 88.69 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. ఎ.కొండూరులో 94.14, విస్సన్నపేటలో 93.43, జి.కొండూరులో 93.36, ఇబ్రహీంపట్నంలో 92.86, తిరువూరు అర్బన్‌లో 92.76, రెడ్డిగూడెంలో 92.54, నందిగామ అర్బన్‌లో 92.32, విజయవాడ అర్బన్‌లో 92.31, తిరువూరులో 92.13, కంచికచర్లలో 92.05, వత్సవాయిలో 91.47, జగ్గయ్యపేట అర్బన్‌లో 91.43, కొండపల్లి అర్బన్‌లో 91.41, జగ్గయ్యపేటలో 91.01, వీరులపాడులో 90.98, గంపలగూడెంలో 90.84, విజయవాడ రూరల్‌లో 90.8, నందిగామలో 90.62, పెనుగంచిప్రోలులో 90.34 శాతం పెన్షన్ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐలో ఘనంగా ఎఫ్‌డీపీ ప్రారంభం

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న 'అడ్వాన్స్‌డ్ వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ ఏఐ ఎనేబుల్డ్ ఆటోమేషన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ సెమికండక్టర్ మాన్యుఫాక్చరింగ్' అంశంపై ఫ్యాకల్టీ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఏఐసీటీఈ-ఏటీఏఎల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కాలేజీల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీన్, ఈసీఈ విభాగాధిపతి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించడం, వీఎల్ఎస్ఐ, కృత్రిమ మేధస్సు రంగాల్లో తాజా పరిశోధనలు, రూపకల్పన పద్ధతులు, అధునాతన తయారీ ప్రక్రియలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఆర్.వెంకటరావు, ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ జి.సాంబశివరావు, ఆర్అండ్‌డీ డీన్ కేవీ సాంబశివరావు, ఈసీఈ హెచ్‌వోడీ కె.రామాంజనేయులు, కో-కోఆర్డినేటర్ వై.అర్పిత, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ఎన్వీ సురేంద్రబాబు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలకు డీఎంహెచ్‌వో హెచ్చరిక

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సరోగసి విధానంలో ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా ఏ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యశాఖాధికారి సుహాసిని ఓ ప్రకటనలో తెలిపారు. సరోగసీ ద్వారా బిడ్డను పొందాలనుకునే దంపతులు అద్దెగర్భాన్నిచ్చే మహిళ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్టు తేలితే సరోగసీ కేంద్రాలతో పాటు దంపతులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సరోగేట్ తల్లిగా గర్భాన్ని ఇవ్వదలచిన మహిళ జీవితంలో రెండుసార్లు మాత్రమే తన గర్భాన్ని అద్దెకు ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియలో మహిళ నుంచి రాతపూర్వకంగా అంగీకారం తీసుకోవడంతో పాటు, ఆమె ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

జలపాతాల మాయాజాలం



- కొండపల్లి రిజర్వ్ ఫారెస్టులో జాలువారుతున్న జలపాతాలు
- పర్యాటకులను కట్టిపడేస్తున్న ప్రకృతి సోయగాలు
- జలపాతాల సందర్శనకు పెద్ద ఎత్తున వస్తున్న పర్యాటకులు
- దారి సౌకర్యం లేక నానా ఇబ్బందులు

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: వర్షాలతో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. పాల నురుగుతో కనువిందు చేస్తున్నాయి. సొగసు చూడతరమా అన్నట్టుగా పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. కొండపల్లి రిజర్వు ఫారెస్టు ప్రకృతి అందాలకు నిలయం. అందులోని కొండపల్లి ఖిల్లా, మూలపాడు నగరవనం మంచి పర్యాటక ప్రదేశాలు. అలాంటి ప్రాంతాల్లో జలపాతాలు పర్యాటకులకు మంచి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎత్తైన కొండలపై నుంచి పచ్చని చెట్లమధ్యలో హొయలొలుకుతూ బిరబిరా మంటూ కిందకు జాలువారుతున్న జలపాతాలు అడవి తల్లికే అందాన్ని అద్దుతున్నాయి. కొండపల్లి కోటకు వెళ్లే ఘాట్ రోడ్డు మార్గం మొదట్లోనే పచ్చని కొండల మధ్యలో ఒక జలపాతం కనిపిస్తుంది. ఘాట్ రోడ్డు మీదుగా రెండో మలుపు నుంచి ఇరుకు మార్గంలో కొంత దూరం నడిచి వెళితే మరో జలపాతం వద్దకు చేరుకోవచ్చు. ఘాట్ రోడ్డుపై వెళుతుంటే జలపాతం కిందకు జాలువారుతున్న పెద్ద శబ్దం వినిపిస్తుంటుంది. నాలుగో మలుపు వద్దకు వెళితే మరో జలపాతం కనిపిస్తుంది. ఈ చిన్న జలపాతం నుంచి మరో 2 కిలోమీటర్లు కాలినడకన వెళితే అక్కడ మరో పెద్ద జలపాతం ఉంది. ఇలా కొండపల్లి రిజర్వు ఫారెస్టులో మొత్తం 8 జలపాతాలు ఉన్నాయి. ఖిల్లాపైనే కాకుండా మూలపాడు నగరవనం వద్ద, దొంగమర్ల బావి వద్ద కూడా మరి కొన్ని జలపాతాలున్నాయి. అంతేకాక చిన్నచిన్న జలపాతాలు కోకొల్లలు. వాటిలో కొంగు ధార, జడల కొలను, బేబీ చిత్రకూట్ వంటివి వీక్షణకు ఆకర్షణీయంగా ఉంటాయి.





దారి సౌకర్యం లేదు

ఫారెస్టులోని జలపాతాలను వద్దకు వెళ్లాలంటే సాహసంతో కూడుకున్న పని. ముఖ్యంగా పిల్లలు, మహిళలు జలపాతాలకు వద్దకు వెళ్లే వీలులేదు. పర్యాటకశాఖ జలపాతాలకు వద్దకు మార్గాలను ఏర్పాటు చేస్తే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జలపాతాలను దూరం నుంచి చూసి ఆనందించడమే తప్ప దగ్గరకు వెళ్లి వాటిలో జలకాలాడే అవకాశం లేకపోడంతో పర్యాటకులు కాస్త నిరుత్సాహపడుతున్నారు. పర్యాటకశాఖ దృష్టి సారించి జలపాతాలను వద్దకు దారి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ట్రెక్కింగ్ టీమ్స్ ఎంజాయ్

రిజర్వు ఫారెస్టులో ట్రెక్కింగ్‌కు వచ్చే టీమ్స్ ఈ జలపాతాల వద్ద ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు. సుమారు 50 మంది ట్రెక్కింగ్ టీమ్ సభ్యులు భద్రతా చర్యలు పాటిస్తూ ఒక టీమ్ స్పిరిట్‌తో వచ్చి జలపాతాల వద్ద జలకాలాడుతున్నారు.

ప్రస్తుతానికి అనుమతి లేదు

ఇటీవల కొండపల్లి ఖిల్లాపై కొందరు అల్లరి మూకలు చేసిన ఆగడాల వల్ల పోలీసులు కొండపల్లి ఖిల్లాపైకి ఎవ్వర్నీ అనుమతించడం లేదు. ఈ నిషేధం ఎప్పటి వరకు ఉంటుందో తెలియదు. అల్లరి మూకలు ఆడగాలతో ప్రకృతి అందాలు చూసే అవకాశాన్ని పర్యాటకులు కోల్పోయే పరిస్థితి నెలకొంది. పోలీసులు ఈవిషయాన్ని త్వరగా తేల్చి పర్యాటకులకు మళ్లీ ప్రకృతి అందాలను చూసేందుకు అనుమతించాలని వారు కోరుతున్నారు.

నిర్లక్ష్యపు అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తాం

- కలెక్టర్ లక్ష్మీశ
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 92 అర్జీలు



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీపైన ప్ర త్యేకంగా దృష్టిసారించాలని, సమస్య పరిష్కారంలో ఉదాసీనతను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై సస్పెన్షన్ వేటు తప్పదని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోందని, ప్రజల సమస్యల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టి వారి సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి చేతులు దులుపుకొంటే సహించేది లేదన్నారు. నిర్లక్ష్యం, ఉదాసీనత, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుందని, రోజులో గంట అర్జీల పరిష్కారంపై పెడితే అద్భుతమైన ఫలితాలు వచ్చి, ప్రభుత్వం ఆశించినట్టు ప్రజల్లో సుపరిపాలనపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే పలుమార్లు సూచనలు చేశానని, ఇకపై ఉపేక్షించనని తీవ్రస్వరంతో హెచ్చరించారు.

కొత్త ఒరవడికి శ్రీకారం

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ లక్ష్మీశ నూతన ఒరవడిని అమలు చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ అమలు అర్జీదారులకెంతో సంతృప్తినిచ్చింది. ఇప్పటివరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌కు అర్జీదారుడు తమ సమస్యను నేరుగా వేదిక వద్ద ఉన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌వోను కలిసి అర్జీలను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకొనేవారు. వారి సమస్యను విని పరిష్కారానికి సంబంధిత జిల్లా అధికారులను పిలిచి అర్జీలను అప్పగించేవారు. ఇప్పుడు భిన్నంగా కొనసాగింది. అర్జీదారుడు తమ అర్జీలను నమోదు చేసుకొని ముందుగా సమస్యకు సంబంధించిన జిల్లా అధికారిని కలిసేలా కలెక్టర్ చర్యలు తీసుకొన్నారు. ఆ సమస్యపై జిల్లా అధికారి అర్జీదారుడికి ఎదురైన సమస్యకు గల మూల కారణం తెలుసుకొని పరిష్కారానికి సంబంధించి సమగ్ర వివరాలను అర్జీలో నమోదు చేసి చర్యల నిమిత్తం అర్జీదారుడు కలెక్టర్‌ను కలిసేలా మార్పులు తెచ్చారు. దీంతో కిందిస్థాయిలోనే సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం అర్జీదారుల్లో కల్పించేందుకు వీలవుతోంది. మొత్తం 92 అర్జీలు స్వీకరించిన కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌పై ప్రజలు పెట్టుకొన్న నమ్మకానికి మరింత బలం చేకూర్చేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు, సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కే పోసిబాబు, ఏసీపీ కే వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో 21,167 మెట్రిక్ టన్నుల ఎరువులు

ఎన్టీఆర్ జిల్లాలో ఖరీఫ్ 2025 సీజన్ అవసరాలకు ప్రస్తుతం 21,167 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 48,158 మెట్రిక్ టన్నులు ఎరువులు రైతులకు సరఫరా చేశామని, సోమవారం నాటికి సాధారణ విస్తీర్ణంలో 91శాతం (94,931 హెక్టారుకు 86,492 హెక్టార్లలో) పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 2వరకు జిల్లాకు మరో 1500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయడం జరుగుతుందని, అలాగే సెప్టెంబరు 7లోగా ఇంకా 2,750 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏ షాపు వారైనా ఎక్కువ ధర డిమాండ్ చేస్తే కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరు 9154970454కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ

బాధితులకు న్యాయం చేస్తాం

- కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాధితులకు కృష్ణాజిల్లా పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసంలో ఆయన స్వయంగా బాధితుల సమస్యలను విని అర్జీలు తీసుకున్నారు. 39 మంది బాధితులు జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. తోట్లవల్లూరు నుంచి ఒక వివాహిత భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, పెడన నుంచి ఒక యువకుడు ఉద్యోగం కోసం డబ్బులు కట్టి మోసపోయానని, అవనిగడ్డ నుంచి వృద్ధుడు ఆస్తి కోసం తన కుమారులు ఇంటి నుంచి గెంటేశారని ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు కేసులను రిఫర్ చేసి సాధ్యమైనంత త్వరగా కేసులు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

మగబిడ్డ దత్తత పేరుతో మోసం

- నలుగురిపై కేసు

విద్యాధరపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మగబిడ్డని దత్తతకు ఇస్తామని మాయ మాటలు చెప్పి తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాకు చెందిన వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన నలుగురిపై సోమవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా నకరికల్ బొడ్డురాయి బజారులో దాసరి శివ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. ఇతను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి సోదరి తమ్మాడగోని మౌనికకు సంతానం లేదు. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవీంద్ర వద్దకు వచ్చే కవ్విలి లక్ష్మణ్ రెడ్డి దాసరి శివకు పరిచయమయ్యాడు. తన సోదరికి సంతానం లేదని శివ లక్ష్మణ్‌రెడ్డికి మాటల సందర్భంలో చెప్పాడు. దీంతో లక్ష్మణ్ రెడ్డి తాను విజయవాడ కలెక్టర్ ద్వారా మగబిడ్డను దత్తత ఇప్పించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని నమ్మబలికి రూ.4లక్షలిస్తే మగబిడ్డను ఇస్తానని శివకు చెప్పాడు. ముందస్తుగా రూ.2లక్షలు అడ్వాన్స్ ఇవ్వాలని, మిగిలిన డబ్బులు మగబిడ్డను ఇచ్చిన తరువాత ఇవ్వాలని చెప్పాడు. లక్ష్మణ్ రెడ్డి సూచనల మేరకే శివ రూ.2లక్షలు ఇచ్చాడు. డబ్బులిచ్చి 2 నెలలైనా బిడ్డను ఇవ్వకపోవటంతో శివ లక్ష్మణ్ రెడ్డిని పలుసార్లు అడిగాడు. లక్ష్మణ్ రెడ్డి ఆగస్టు 18న మూడు దఫాలుగా రూ.12వేలు శివ వద్ద ఆన్‌లైన్‌లో తీసుకున్నాడు. అదేరోజు మగబిడ్డ గురించి శివ ప్రశ్నించగా లక్ష్మణ్ రెడ్డి రూ.2లక్షలు తీసుకుని విజయవాడ రమ్మని ఫోన్‌లో తెలిపాడు. దీంతో శివ రూ.2లక్షలు తీసుకుని విజయవాడ భవానీపురం పున్నమీఘాట్ వద్దకు ఆ రోజు రాత్రి వెళ్లాడు. అక్కడ లక్ష్మణ్ రెడ్డి మౌలాలి అనే వ్యక్తిని శివకు పరిచయం చేసి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ షేక్ ఫాతిమాతో మాట్లాడి మగబిడ్డను అప్పజెప్పుతాడన్నాడు. ఆ రోజు రాత్రి 11 గంటలకు మగబిడ్డను అప్పజెప్పుతామని శివను లక్ష్మణ్‌రెడ్డి, మౌలాలి విజయవాడ ప్రభుత్వాసుపత్రి వద్దకు కారులో తీసుకువెళ్లారు. మౌలాలి హాస్పటల్ నుంచి డాక్టర్ ఫాతిమా అనే మహిళను వెంటబెట్టుకు వచ్చి డబ్బులివ్వమని శివను అడిగాడు. శివ లక్ష్మణ్ రెడ్డి సమక్షంలో రూ.2లక్షలను మౌలాలి, ఫాతిమాకు ఇచ్చారు. డబ్బులు తీసుకుని మగబిడ్డను అప్పగించకపోవటంతో శివకు అనుమానం వచ్చి ఫోన్ చేయగా మౌలాలి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. బాధితుడు లక్ష్మణ్‌రెడ్డిని ప్రశ్నించటంతో బబ్బూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటికి తీసుకువెళ్లాడు. బబ్బూరి శ్రీనివాస్ శివను మందలించాడు. ఆ సమయంలో లక్ష్మణ్ రెడ్డి బయటకు వెళ్లిపోయాడు. బాధితుడు శివకు అనుమానం వచ్చి లక్ష్మణ్‌రెడ్డికి ఫోన్ చేయగా, లక్ష్మణ్ రెడ్డి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. బాధితుడు 20న ఓ బార్‌లో ఉన్న లక్ష్మణ్ రెడ్డిని పట్టుకుని బిడ్డకోసం నిలదీశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు లక్ష్మణ్ రెడ్డి, మౌలాలి, ఫాతిమా, బబ్బూరి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం

గుణదల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అతివేగం ఒకరి ప్రాణాలు బలితీసుకోగా మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మాచవరం వద్ద సోమవారం జరిగింది. మోపిదేవి మండలం ఉత్తర తిరువూరు లంక ప్రాంతానికి చెందిన కన్నా రాజ్యలక్ష్మి (37) కేన్సర్‌తో బాధపడుతోంది. మాచవరం వద్దగల కేన్సర్ హాస్పిటల్లో వైద్యం కోసం ప్రసాదంపాడులోని బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం తల్లితో కలిసి కేన్సర్ హాస్పిటల్‌కు చేరుకుని వైద్యం చేయించుకుని తిరిగి వెళ్లేందుకు మాచవరం డౌన్ బస్టాప్ వద్దకు నడుచుకుంటూ వెళుతున్నారు. దాసాంజనేయస్వామి ఆలయం వైపు నుంచి రామవరప్పాడు వైపు అతివేగంగా వస్తున్న కారు ముందుగా ఓ పాదచారుణ్ణి బలంగా ఢీకొట్టగా పాదచారుడు ఎగిరి కారు అద్దంపై పడటంతో కారు అదుపు తప్పి నడుచుకుంటూ వస్తున్న కన్నా రాజ్యలక్ష్మిని ఢీకొట్టింది. దీంతో రాజ్యలక్ష్మికి తీవ్ర రక్తస్రావం జరగడంతో అక్కడికక్కడే చనిపోయింది. కుమార్తె మరణాన్ని చూసిన తల్లి హృదయం అల్లాడిపోయి కుప్పకూలిపడిపోయింది. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. కారు అతివేగంగా రావడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు పోలీసులకు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మహిళ రాజ్యలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కారు డ్రైవర్ షేక్ బాజీని అదుపులోకి తీసుకుని కారును స్టేషన్‌కు తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మాచవరం సీఐ ప్రకాష్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణు

ఎల్ఐసీ 69వ ఆవిర్భావ దినోత్సవం

పటమట, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బెంజిసర్కిల్ నగరశాఖ-4లో ఎల్ఐసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు సంస్థ ఆర్ఎం వేణు తెలిపారు. ఈ వేడుకకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డీన్ రామినేని శివప్రసాద్, ఐడీబీఐ డీజీఎం సాయి రత్నప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఎల్ఐసీ విశిష్ఠతను వివరించారన్నారు. అనంతరం సీనియర్ బీఎం రామకృష్ణ, ఇతర అధికారులు, ఏజెంట్లు, పాలసీదారులు, రిటైర్డ్ ఉద్యోగులు, నాగరాజు, ఎన్ వెంకటేశ్వర్లు, లక్ష్మీపతిరావు, ప్రసాద్ ప్రసంగించారు.



అనన్య ఆనంద్‌కు అభినందనలు తెలుపుతున్న స్కూల్ చైర్మన్ వీరమాచినేని వంశీ, డైరెక్టర్ శాంతి, తదితరులు

జాతీయ పోటీలకు నెక్స్‌జెన్ విద్యార్థి ఎంపిక

భారతీనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని నెక్స్‌జెన్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని అఖోట అనన్య ఆనంద్ త్వరలో ఢిల్లీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైందని స్కూల్ చైర్మన్ వీరమాచినేని వంశీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మా విద్యార్థిని అనన్య ఆనంద్ గత నెల ఆగస్టు 24న విజయవాడలోని ఫన్‌టైమ్స్ క్లబ్‌లో జరిగిన యూ-15 ఏపీ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ 2025లో పాల్గొని కాంస్య పతకాన్ని గెలుపొందిందన్నారు. అలాగే 31న ఆదివారం గుంటూరులో జరిగిన యూ-17 రాష్ట్ర టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొని కాంస్య పతకాన్ని గెలిపొందిందన్నారు. త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా అనన్య ఆనంద్‌కు స్కూల్ డైరెక్టర్ శాంతి, ప్రిన్సిపల్ ఎండీ స్వామాన, వైస్ ప్రిన్సిపల్ డీ కీర్తి అభినందనలు తెలిపారు.

వంశీ బెయిల్ ఆంక్షలు సడలింపు

నెలలో రెండు శనివారాల్లో సంతకాలు

విజయవాడ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కేసులో బెయిల్‌పై ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి కోర్టు కొన్ని షరతులను సడలించింది. నెలలో రెండు, నాలుగో శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని స్పష్టం చేసింది. తన బెయిల్ షరతులను సడలించాలని వంశీ కొద్ది రోజుల క్రితం విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి పీ భాస్కరరావు సోమవారం తీర్పును వెలువరించారు. బెయిల్ ఇచ్చినప్పుడు ప్రతి శనివారం పటమట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాలని షరతు విధించించారు. తాజాగా ఇచ్చిన తీర్పులో రెండు, నాలుగో శనివారం సంతకాలు చేయాలని పేర్కొన్నారు.

జెన్‌కోలో బదిలీల అరాచకాల వెనుక కుట్ర!

ఆంధ్రజ్యోతి, విజయవాడ: జెన్‌కోలో అడ్డగోలు బదిలీల అరాచకాల వెనుక పెద్ద కుట్రే ఉందని తెలుస్తోంది. ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకతను తెచ్చే కుట్రతో పాటు, అడ్డగోలు బదిలీల మాటున భారీ ఎత్తున వసూళ్లకు తెరతీయవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల కరపత్రాల ప్రచారంతో రోజుకో కొత్త విషయం వెలుగు చూస్తోంది. జెన్‌కోలో షాడో ఎండీలుగా కొందరు బోర్డు డైరెక్టర్లు వ్యవహరించటం తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది.

జెన్‌కోలో ప్రస్తుతం ఐదుగురు డైరెక్టర్లకు గాను ముగ్గురే ఉన్నారు. థర్మల్ ఒకరు, ఐడీల్ ఒకరు చూస్తున్నారు. హెచ్ఆర్‌కు మరొకరు ఉన్నారు. కోల్, ఫైనాన్స్ డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇద్దరు బోర్డు డైరెక్టర్లు వాటిని నిర్వహిస్తున్నారు. దీంతో మొత్తం జెన్‌కో అంతా తమ చేతుల్లోకి తీసుకుని అడ్డగోలుగా బదిలీలకు పాల్పడుతున్నారు. జెన్‌కో ఉద్యోగులు స్థానికంగా నివశిస్తూ పిల్లలను చదవించుకుంటున్నారు. ఈవిషయం తెలిసి వారిని తీవ్ర ఇబ్బందులు పెట్టేలా బదిలీలకు పాల్పడుతుండటం జెన్‌కోను అతలాకుతలం చేస్తోంది. బదిలీలపై ప్రస్తుతం బ్యాన్ ఉన్నా వైసీపీ సానుభూతిపరుల ముద్ర వేయటం ఎడాపెడా బదిలీలు నిర్వహించటం పరిపాటిగా మారింది. బాధ్యులైన బోర్డు డైరెక్టర్లు వైసీపీ ప్రభుత్వంలో అంతా తామై నడిపించారు. కూటమి ప్రభుత్వంలోనూ వారిదే హవా. తమను తాము కాపాడుకోవటం కోసం ఉద్యోగులను వైసీపీ సానుభూతిపరులుగా ముద్రవేస్తూ బదిలీలకు తెగబడుతున్నారు. నచ్చిన ప్రభుత్వం రాకపోవటంతో ప్రభుత్వానికి అప్రతిష్ట తేవాలన్న ఉద్దేశంతో పాటు ఉద్యోగుల నుంచి అందినకాడికి పిండుకునేందుకు వేసిన స్కెచ్ అని ఉద్యోగులు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు డైరెక్టర్లు ఎన్‌టీటీపీఎస్‌లో రాజ్యమేలి బదిలీ అయిన వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నేతను ఎందుకు తెచ్చారన్నది ఆలోచించాల్సిన విషయం. డైరెక్టర్ల అండతో తమపై వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నేత సాగించిన వేధింపులకు ప్రతీకారంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇతర సంఘాలు వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నేతను బదిలీ చేయించాయి. కానీ గోడకు కొట్టిన బంతిలా వెనక్కు వచ్చేశాడు. అంతేకాక గతంలో జెన్‌కోలో పనిచేసిన ఓ అధికారి జగన్ వీర విధేయుడు. జగన్ వస్తే తప్ప పెళ్లికూతురి మెడలో తాళికట్టనని భీష్మించుకున్నాడు. అలాంటి అధికారికి ఆయన కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు.

దీన్ని బట్టి బోర్డు డైరెక్టర్లు వైసీపీ సానుభూతిపరులా? ఉద్యోగులు సానుభూతిపరులా అన్నది ఎవరికైనా అర్థమౌతుంది. ఈ అక్రమ బదిలీలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

9

నవ్య డాక్టర్

మంగళవారం • 2 సెప్టెంబరు 2025

ఫైబ్రాయిడ్స్



గర్భాశయం లోపల తలెత్తే ఫైబ్రాయిడ్స్ పునరుత్పత్తికి ఆటంకం కలిగించవచ్చు. తీవ్రమైన నెలసరి స్రావాలతో ఇబ్బంది పెడుతూ ఉండొచ్చు. అలాగని అంతిమ పరిష్కారంగా సర్జరీని ఆశ్రయించవలసిన అవసరం లేదు. 'యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్'తో, సర్జరీతో పని లేకుండానే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. అదెలాగో వైద్యులు వివరిస్తున్నారు

ఆ గడ్డలకు అడ్డుకట్ట సులభమే!

ప్రమాదానికి గురైన బాధితుల్లో అంతర్గత రక్తస్రావాలను అడ్డుకోవడం కోసం వైద్యులు 'ఇమేజ్ గైడింగ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ' మీద ఆధారపడుతూ ఉంటారు. ఈ విధానంలో భాగంగా ఇంటర్వెన్షనల్ రేడియాజలిస్టులు, ఇమేజ్ గైడెన్స్ ఆధారంగా రక్తనాళాలను గుర్తించి, వాటిలో అవరోధం కల్పించడం ద్వారా రక్తస్రావాన్ని అదుపులోకి తీసుకొస్తూ ఉంటారు. ఇదే విధానాన్ని ఫైబ్రాయిడ్స్ చికిత్సలో కూడా వాడుకోవచ్చు. ఫైబ్రాయిడ్స్‌కు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలను అడ్డుకోవడం ద్వారా, రక్తప్రసారానికి అడ్డుకట్ట వేసినప్పుడు ఫైబ్రాయిడ్స్ కుంచించుకుపోతాయి. తద్వారా వాటి వల్ల తలెత్తే సమస్యలన్నీ అదుపుకొస్తాయి. ఈ చికిత్సే యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్. నిజానికి ఈ చికిత్స కొత్తదేమీ కాదు. ఎంతో కాలంగా వాడుకలో ఉన్నదే! కానీ దీని పట్ల మహిళలకు అవగాహన తక్కువ.



పునరుత్పత్తి వయసులో ఉన్న 60 శాతం మంది మహిళల్లో గర్భాశయ ఫైబ్రాయిడ్స్ తలెత్తుతూ ఉంటాయి. ఇవి క్యాన్సర్ గడ్డలు కాకపోయినా, వాటితో తలెత్తే తీవ్ర నెలసరి స్రావాలు, నొప్పులతో వైద్యులను కలిసినప్పుడు వైద్యులు, మొదట మందులతో తర్వాత సర్జరీతో సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. గర్భాశయం జోలికి వెళ్లకుండా కేవలం ఫైబ్రాయిడ్స్‌ను మాత్రమే తొలగించే సర్జరీ (మయోమెక్టమీ)తో పాటు, కొన్ని సందర్భాల్లో గర్భాశయాన్నే తొలగించే సర్జరీ (హిస్ట్రక్టమీ) అవసరమవుతూ ఉంటుంది. అయితే ఈ రెండు రకాల సర్జరీలతో పని లేకుండా, కేవలం ఫైబ్రాయిడ్స్ లక్ష్యంగా చేసే చికిత్సే యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్. కోత, కుట్లు లేకుండా యాంజియోగ్రామ్ మాదిరిగా చేయి, లేదా కాలిలోని రక్తనాళం ద్వారా సమస్యను పరిష్కరించే చికిత్స ఇది. యాంజియోగ్రామ్ మాదిరిగానే ఈ చికిత్సలో కూడా అదే తరహా క్యాథ్ ల్యాబ్ సాంకేతికతను ఉపయోగించుకుని, ఫైబ్రాయిడ్స్‌కు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలకు చిన్నపాటి క్యాథెటర్స్‌తో అవరోధం కల్పిస్తారు. రక్తసరఫరాకు అడ్డుకట్ట వేసినప్పుడు ఫైబ్రాయిడ్స్‌కు అందవలసిన పోషణ కొరవడి, అవి కుంచించుకుపోయి, జీవం కోల్పోతాయి. దాంతో వాటి సమస్య తొలగిపోతుంది.

పలు ప్రయోజనాలున్నాయి

సాధారణంగా ఫైబ్రాయిడ్ సర్జరీలతో కొన్ని సమస్యలుంటాయి. 5 నుంచి 10 శాతం దీర్ఘకాల సమస్యలు తలెత్తే అవకాశాలు కూడా ఉంటాయి. కోత, కుట్లు, రక్తస్రావంతో పాటు సర్జరీ తర్వాత అంతర్గత అవయవాలు అతుక్కోవడం లాంటి సమస్యలూ ఉండొచ్చు. సర్జరీ నుంచి కోలుకోడానికి కనీసం నెల సమయం పట్టొచ్చు. అలాగే మయోమెక్టమీతో గర్భాశయంలోని అన్ని ఫైబ్రాయిడ్స్‌నూ తొలగించే సౌలభ్యం ఉండదు. కాబట్టి ఈ సర్జరీతో పోలిస్తే యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్ అన్ని విధాలా సౌకర్యవంతమైనదని చెప్పొచ్చు. దీన్లో కోత, కుట్లు ఉండవు. రక్తస్రావం ఉండదు. అనస్థీషియా అవసరం లేదు. ఒక్క రోజులోనే చికిత్స ముగించుకుని ఇంటికెళ్లిపోవచ్చు. మయోమెక్టమీ సర్జరీతో ఫైబ్రాయిడ్స్ తొలగించినంత మాత్రాన అవి మళ్లీ తలెత్తవనే భరోసా లేదు. 20 నుంచి 30 శాతం మందికి పదేళ్ల కాలంలో ఫైబ్రాయిడ్స్ తిరగబెట్టొచ్చు. ఇలాంటి సందర్భాల్లో అప్పటికే పిల్లలున్న మహిళలు గర్భాశయాన్ని తొలగించే సర్జరీలను ఎంచుకుంటూ ఉంటారు. కానీ 30 ఏళ్ల వయసులో గర్భాశయాన్ని తొలగించడం వల్ల మహిళలకు గుండె జబ్బుల ముప్పు పొంచి ఉంటుంది. కటి ప్రదేశం బలహీనపడొచ్చు. సర్జరీ వల్ల కడుపులో పేగులు అతుక్కుపోయి, అందుకోసం రెండోసారి సర్జరీ చేసే పరిస్థితి తలెత్తవచ్చు. కాబట్టి గర్భాశయంతో పని పూర్తయింది కాబట్టి దాన్ని తొలగించుకుని ఫైబ్రాయిడ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోవాలనుకోవడం సరైన నిర్ణయం కాదు.

గైనకాలజీ కీలకమే!

ఫైబ్రాయిడ్స్ పెరుగుదల హార్మోన్ల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి పునరుత్పత్తి వయసులో ఉధృతంగా వేధించే ఫైబ్రాయిడ్స్, మెనోపాజ్ దశకు చేరుకునే సమయానికి వాటంతటవే తగ్గిపోతాయి. కాబట్టి ఆ సమయంలో సర్జరీతో పని లేకుండా తేలికపాటి మందులతోనే పరిస్థితిని అదుపులోకి తెచ్చుకోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో గైనకాలజీ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ పునరుత్పత్తి వయసులో ఉన్న కొందరికి ఫైబ్రాయిడ్స్ వల్ల తీవ్ర నెలసరి స్రావంతో రక్తలేమికి గురి కావడం, నొప్పితో బాధపడడం లాంటి లక్షణాలుంటాయి. అలాగే ఫైబ్రాయిడ్స్‌తో మూత్రాశయం మీద పెరిగే ఒత్తిడి వల్ల తరచూ మూత్రవిసర్జన చేయవలసి వస్తూ ఉంటుంది. ఈ సమస్యలతో జీవన నాణ్యత దెబ్బతినే పరిస్థితి ఉన్నప్పుడు గైనకాలజిస్టులను కలవడం అవసరం. అయితే సర్జరీ తప్ప మరొక పరిష్కారం లేదని వైద్యులు సూచించినప్పుడు, యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్ ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలి.

పునరుత్పత్తి సమస్యల ముప్పు

సాధారణంగా పునరుత్పత్తి వయసులో ఉన్న మహిళలకు ఫైబ్రాయిడ్స్‌ను మాత్రమే తొలగించే మయోమెక్టమీ సర్జరీని వైద్యులు సూచిస్తారు. కానీ ఈ సర్జరీతో పునరుత్పత్తి సమస్యలు తలెత్తే అవకాశాలుంటాయి. యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్‌తో కూడా పునరుత్పత్తి సమస్యల ముప్పు ఉన్నప్పటికీ, మయోమెక్టమీతో పోలిస్తే ఆ ముప్పు కొంత తక్కువేనని చెప్పొచ్చు. కాబట్టి ఫైబ్రాయిడ్స్‌కు సర్జరీ వద్దనుకునేవారు, ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవాలనుకునే ఆలోచన ఉన్నవారు నిస్సందేహంగా యుటెరైన్ ఫైబ్రాయిడ్ ఎంబొలైజేషన్‌ను ఎంచుకోవచ్చు. ఈ చికిత్సతో ఐదేళ్ల వరకూ ఫైబ్రాయిడ్స్ నుంచి విడుదల పొందవచ్చు. 30లలో ఉన్న మహిళల్లో ఐదేళ్ల తర్వాత తిరిగి ఫైబ్రాయిడ్స్ తలెత్తే అవకాశాలు 20% మేరకు ఉంటాయనే విషయాన్ని కూడా మహిళలు గుర్తు పెట్టుకోవాలి. 40లలో ఉన్న మహిళలకు ఈ చికిత్సా విధానంతో ఒరిగే ప్రయోజనం ఎక్కువ, ఫైబ్రాయిడ్స్ తిరబెట్టే ముప్పు తక్కువ.

డాక్టర్ అర్జున్ రెడ్డి,
చీఫ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ అండ్ ఫౌండర్,
రివియా వాస్క్యులర్ ఇన్‌స్టిట్యూట్,
గచ్చిబౌలి, హైదరాబాద్



కాలిపోయే కాఫీలతో క్యాన్సర్

మనలో చాలా మందికి ఉదయాన్నే పొగలు కక్కే కాఫీ గొంతు దిగందే రోజు మొదలవ్వదు. అయితే 65 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించిన కాఫీలు, టీలతో నేరు కాలితే ఫర్వాలేదు. అత్యంత ప్రమాదకరమైన అన్నవాహిక క్యాన్సర్ ముప్పు పెరుగుతుందనే ఒక అధ్యయనం నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ అండ్ గ్లోబల్ స్టడీస్‌లో ప్రచురితమైంది. పదే పదే అన్నవాహిక వేడి పానీయాలకు బహిర్గతమైనప్పుడు, ఇన్‌ఫ్లమేషన్ తలెత్తి, కణాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. నిజానికి వేడి పానీయాలు క్యాన్సర్ ముప్పును పెంచుతాయనే విషయం ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గత కొన్నేళ్లుగా వేడి పానీయాలకూ, క్యాన్సర్‌కూ మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేస్తోంది. ఈ సంస్థ, 65 డిగ్రీలకు మించిన వేడి పానీయాలను క్యాన్సర్ కారకాలుగా వర్గీకరించింది. ఇక్కడ తాగే పానీయంతో సంబంధం లేదు. టీ, కాఫీ, గ్రీన్ టీ, సూప్, వేడి నీళ్లు... ఇలా 65 డిగ్రీలకు మించి వేడిగా ఉన్న ఏ పానీయాన్ని తాగినా అన్నవాహిక లోపలి పొర దెబ్బతిని, కణాల్లో మార్పులు చోటుచేసుకుని, ఆ పరిస్థితి క్యాన్సర్‌కు దారి తీస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. వేడి టీ లేదా నీళ్లు ఎక్కువగా తాగే అలవాటున్న ఇరాన్, చైనా, దక్షిణమెరికా ప్రజల్లో అత్యధికంగా అన్నవాహిక క్యాన్సర్ బయల్పడడాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సందర్భంగా ప్రస్తావిస్తోంది. ఇలాంటప్పుడు ఎంత వేడి పానీయాలు తాగడం సురక్షితం అనే ప్రశ్న తలెత్తవచ్చు. పెదవులు కాలేంత వేడిగా ఉండే టీ లేదా కాఫీ కచ్చితంగా అన్నవాహికను కూడా కాలుస్తుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి. అంత వేడిగా ఉన్నవి కనీసం 70 నుంచి 85 డిగ్రీల సెల్సియస్‌ను కలిగి ఉంటాయి. కాబట్టి టీ అయినా, కాఫీ అయినా సౌకర్యవంతంగా తాగే వీలైనంత వేడిగా ఉన్నప్పుడు, కాస్త చల్లారిన తర్వాతే తాగడం అలవాటు చేసుకోవాలి.



దంతాలు ఊడిపోతే, పైబడే వయసులో ఇవన్నీ సహజమే అని సర్దుకుపోయే వాళ్లే ఎక్కువ. కానీ దంతాల లోపం... జీవన నాణ్యతనూ, ఆయుష్షునూ తగ్గిస్తుంది. కాబట్టి 'ఫుల్ మౌత్ ఇంప్లాంట్స్'తో నాణ్యమైన కొత్త జీవితాన్ని మొదలు పెట్టాలంటున్నారు వైద్యులు.

డెంటల్ ఇంప్లాంట్స్

శాశ్వత పలువరుస కోసం...



పైబడే వయసులో పెద్దల్లో ఎముకలు క్షీణించి దంతాలు పూర్తిగా ఊడిపోతాయి. కొందరికి నోట్లో కొన్ని దంతాలే మిగిలి ఉంటే, ఇంకొందరికి ఉన్న దంతాలన్నీ కదులుతూ ఉంటాయి. ఈ కోవకు చెందిన వాళ్లందరూ ఫుల్ మౌత్ ఇంప్లాంట్స్‌ను ఎంచుకోవచ్చు. అయితే ఇందుకు కొన్ని ఆరోగ్యపరమైన అర్హతలు కూడా కలిగి ఉండాలి. శారీరకంగా చురుగ్గా ఉంటూ, ఆరోగ్య సమస్యలన్నీ అదుపులో ఉన్నవాళ్లు ఈ రకమైన ఇంప్లాంట్స్‌కు పూర్తి అర్హులు. మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలున్నప్పుడు మందులతో అదుపులోకి తెచ్చుకుని, ఈ ఇంప్లాంట్స్‌ను అమర్చుకోవచ్చు. గుండె సమస్యలున్నవారు, ఈ దంతాలను అమర్చుకోవాలనుకుంటే, రక్తం పలుచనయ్యే మందులను ఐదు రోజుల పాటు ఆపవలసి ఉంటుంది. ఈ సందర్భంలో గుండె వైద్యుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

రెండు రకాల ఇంప్లాంట్స్

ఫుల్ మౌత్ ఇంప్లాంట్స్‌లో...'టు స్టేజ్ ఇంప్లాంట్స్', 'సింగిల్ స్టేజ్ ఇంప్లాంట్స్' అనే రెండు రకాలుంటాయి. ఇవి ఎవరికంటే....

టు స్టేజ్ ఇంప్లాంట్స్: వీటిని రెండు దశల్లో అమరుస్తారు. ఆరోగ్యం మెరుగ్గా ఉండి, ఎముక దృఢంగా ఉండి, అత్యవసరంగా ఇంప్లాంట్స్ అమర్చుకోవలసిన అవసరం లేని వాళ్ల కోసం ఉద్దేశించిన ఇంప్లాంట్స్ ఇవి. ఈ ప్రక్రియలో మొదట దవడలో ఇంప్లాంట్స్‌ను అమర్చి, అవి పూర్తిగా ఎముకలో కలిసిపోయిన తర్వాత వాటికి క్యాప్స్ బిగించి, ఆ తర్వాత దంతాలను బిగిస్తారు



ఇంప్లాంట్స్ ఎవరికి?

40 నుంచి 80 ఏళ్ల వారు ఎవరైనా ఈ ఫుల్ మౌత్ ఇంప్లాంట్స్‌ను అమర్చుకోవచ్చు. అయితే మధుమేం, అధిక రక్తపోటు లాంటి సమస్యలను మందులతో అదుపులో ఉంచుకోవాలి. ఈ ఇంప్లాంట్స్ విజయావకాశాలు 96 నుంచి 98% ఉంటాయి. వీటికి జీవితకాలపు గ్యారెంటీ ఉంటుంది. పైన అమర్చుకునే క్యాప్స్‌కు రుసుము చెల్లించవలసి వస్తుంది.

సింగిల్ స్టేజ్ ఇంప్లాంట్స్: ఒక వారంలో బిగించే ఇంప్లాంట్స్ ఇవి. ఎముక క్షీణించిన వారికి ఉద్దేశించిన ఈ ఇంప్లాంట్స్‌ను బిగించిన తర్వాత, రెండు నుంచి ఐదు రోజుల్లోపు దంతాలను అమరుస్తారు. అయితే దంతాలు బిగించిన తర్వాత మూడు నెలల పాటు గట్టి పదార్థాలను తినకూడదు.

అంచనాలు పరిమితంగా...

వైద్యులు, ఉత్పత్తులు, రోగుల పరిస్థితి, స్వభావం... ఈ నాలుగు అంశాలూ ఫుల్ మౌత్ ఇంప్లాంట్ విజయావకాశాలను నిర్థారిస్తాయి. అనుభవమున్న సమర్థమైన వైద్యుల పర్యవేక్షణలో, మన్నికైన ఉత్పత్తులను ఎంచుకున్నప్పటికీ, ఇంప్లాంట్స్ పట్ల రోగులకున్న అంచనాలు వాస్తవానికి దగ్గరగా లేనప్పుడు నిరాశకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే ఎముక దృఢత్వాన్ని పూర్తిగా కోల్పోయిన వారు, దంతాలు పూర్తిగా దెబ్బతిన్నవాళ్లు.. ఇలా రోగులు పలు రకాల పరిస్థితుల్లో వైద్యులను కలుస్తూ ఉంటారు. ఇంప్లాంట్స్‌తో వీళ్లందరికీ ఒకే రకమైన ఫలితం కనిపించకపోవచ్చు. కొందరికి మెరుగైన ఫలితం కనిపించవచ్చు. ఇంకొందరికి కొంత అసౌకర్యం ఉండొచ్చు. అయితే ఇవి శాశ్వత దంతాలు కాబట్టి కొందరికి అవసరాన్నిబట్టి అదనపు చికిత్సలు చేయవలసి రావచ్చు. అయితే అన్నిటికంటే ముఖ్యంగా రోగులు ఈ ఇంప్లాంట్స్‌ను తమ శరీరంలో భాగాలుగా స్వీకరించే స్వభావాన్ని అలవరుచుకోవాలి. ఫుల్ మౌత్ ఇంప్లాంట్స్ బిగించుకున్న ఇతరులతో తమను తాము పోల్చుకోకూడదు. ఈ ఇంప్లాంట్స్‌తో జీవితం మెరుగు పడుతుందనీ, అన్నీ తినగలిగే వీలుండడం వల్ల ఆరోగ్యం పెరుగుతుందనీ, నలుగురిలో ఆత్మవిశ్వాసంగా తిరగగలిగే వీలుంటుందనే సానుకూల దృక్పథాన్ని కూడా కలిగి ఉండాలి.

ఆయుర్దాయం పెంచే దంతాలు

దంతాలు లేని వాళ్లు కొన్ని పదార్థాలకే పరిమితమైపోతారు. నమిలే వీల్లేని మెత్తని పదార్థాలకే పరిమితమైపోతారు. దాంతో పోషక లోపాలకు లోనై, రోగనిరోధకశక్తి కుంటుపడి, తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతూ ఉంటారు. దాంతో ఆయుర్దాయం తగ్గుతుంది. దంతాల లోపంతో నలుగురిలో కలవడానికి ఇష్టపడకుండా ఇంటికే పరిమితమైపోవడం వల్ల ఒంటరితనం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం కూడా తగ్గుతుంది. దంతాలు లేని వారిలో ఆహార లోపం వల్ల చేతులు వణకడం, బలహీనత లాంటివి కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి దంతాలు బిగించుకుని ఆత్మవిశ్వాసంతో పాటు ఆరోగ్యాన్నీ, తద్వారా ఆయుర్దాయాన్నీ పెంచుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

ఇంప్లాంట్స్ అమర్చిన తర్వాత తగిన జాగ్రత్తలు పాటించనప్పుడు విఫలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలా జరగకుండా ఉండాలంటే...

- దంతాలు శుభ్రంగా ఉంచుకుంటూ గార పట్టకుండా చూసుకోవాలి
- వాటర్ ఫ్లాసింగ్ చేసుకుంటూ ఉండాలి
- బఠాణీలు నమలడం, ఎముకలు కొరకడం, దంతాలతో సీసాల మూతలు తీయడం లాంటివి చేయకూడదు
- ఆరు నెలలకోసారి స్కేలింగ్ చేసుకోవాలి.

డాక్టర్ సుధీర్ చౌదరి కరణం
ఆర్థోడాంటిస్ట్ అండ్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్,
ఎడిఎస్ డెంటల్ ఇంటర్నేషనల్ సెంటర్,
గచ్చిబౌలి, హైదరాబాద్



మెదడుకు పదును ఇలా...

మెదడు చురుగ్గా ఉంచుకున్నంత కాలం, మతిమరుపు సమస్యలు దరి చేరకుండా ఉంటాయి. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన వాళ్లు మెదడుకు వ్యాయామాన్ని అందిస్తూనే ఉండాలి. అందుకోసం...

రోజుకొక కొత్త విషయం: కొత్త సమాచారంతో మెదడుకు సవాలు విసురుతూ మెదడును చురుగ్గా ఉంచుకుంటూ ఉండాలి. కొత్త అభిరుచి ఏర్పరుచుకోవడం, కొత్త భాష నేర్చుకోవడం, కొత్త సంగీత వాయిద్యం సాధన చేయడం లాంటివన్నీ మెదడుకు వ్యాయామాలే! ఇవన్నీ చేయలేనివాళ్లు కొత్త వంటకం వండడం, కొత్త విషయాలను తెలుసుకోవడం లాంటివి చేయొచ్చు.

బ్రెయిన్ గేమ్స్, పజిల్స్: సుడొకు, పజిల్స్ పూరిస్తూ వాటిని నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. ఈ ఆటల కోసం రోజుకు అరగంట కేటాయించడం వల్ల మెదడు చురుకుదనం పెరుగుతుంది. అయితే రోజూ ఒకే రకమైన బ్రెయిన్ గేమ్స్‌కు బదులుగా ఒక రోజు సుడొకు, ఒక రోజు పదవినోదం, మరొక రోజు అంకెల గారడీ లాంటివి ఆడుతూ ఉండాలి.

ధ్యానం: ధ్యానంతో మానసిక ప్రశాంతత దక్కడంతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని పరిశోధనల్లో తేలింది. క్రమం తప్పక ధ్యానం చేయడం వల్ల జ్ఞాపకశక్తితో సంబంధమున్న మెదడులోని హిప్పోపొటమస్ అనే ప్రదేశం బలపడుతుంది.

వ్యాయామం: వ్యాయామంతో మెదడు కూడా లాభపడుతుంది. ఏరోబిక్ వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ మెరుగవుతుంది. నడక, ఈత, డాన్స్.. ఇవన్నీ మెదడును చురుగ్గా ఉంచుతాయి. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి.

అనుబంధాలు: సంభాషణ, హాస్యం, అనుబంధాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. కాబట్టి స్నేహితులతో కాలక్షేపం చేయడం, కలిసి సినిమాలు చూడడం, చర్చలు జరపడం లాంటివి చేస్తూ ఉండాలి. సామాజిక సంబంధాలను పెంపొందించుకోవాలి.



అప్రమత్తం

అన్నిటికంటే ఇల్లే పదిలం అనుకుంటాం. కానీ ఇంట్లో కూడా విషాలు, హాని కారకాలు పలు రూపాల్లో దాగి ఉంటాయి. ఆరోగ్యాన్ని కుదేలు చేసే ఆ హాని కారకాలను కనిపెట్టి, వాటిని తొలగించుకుందాం!

ఇంట్లో ప్రమాదాలు

పాడైన వంటపాత్రలు

నూనె వాడకం తగ్గుతుందనే నమ్మకంతో నాన్ స్టిక్ వంటపాత్రలను వాడుకుంటూ ఉంటాం. అయితే దెబ్బతిన్న, పైపొర తొలగిపోయిన నాన్‌స్టిక్ వంటపాత్రల వాడకం ప్రమాదకరం. ఇలా పైపొర తొలగిపోయిన ప్రదేశాల నుంచి పాలీఫ్లోరోఆల్కైల్ పదార్థాలు విడుదలై పునరుత్పత్తి సమస్యలతో పాటు తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి. కాబట్టి నాన్ స్టిక్ కుక్‌వేర్‌ను స్టీలు లేదా చేత ఇనుము పాత్రలతో భర్తీ చేయాలి. సింథటిక్ పైపొర ఉండదు కాబట్టి ఆ పాత్రలు వంటకు సురక్షితమైనవి.

సింథటిక్ చక్కెరలు

డైట్ సోడాలు, షుగర్ ఫ్రీ పదార్థాలు, ఇతరత్రా తక్కువ క్యాలరీలున్న పదార్థాలన్నిట్లో సింథటిక్ చక్కెరలుంటాయి. వీటితో పదార్థాల్లోని క్యాలరీలు తగ్గే మాట వాస్తవమే అయినా, వీటి దుష్ప్రభావాలు ఎంతో తీవ్రంగా ఉంటాయి. దీర్ఘకాలం పాటు వీటిని తీసుకోవడం వల్ల మెటబాలిక్ సమస్యలతో పాటు, మధుమేహం, గుండెజబ్బుల ముప్పు పెరిగే ప్రమాదం ఉంటుంది. అలాగే సింథటిక్ చక్కెరలతో పేగుల్లోని మంచి బ్యాక్టీరియా దెబ్బతింటుంది. ఈ చక్కెరలు శరీరంలో వాపు, నొప్పులకు కారణమవుతాయి. శరీరం శక్తిని ఖర్చు చేసే వేగాన్ని కుంటుపరుస్తాయి. కాబట్టి సింథటిక్ చక్కెరలతో తయారైన పదార్థాలకు బదులుగా సహజసిద్ధ చక్కెరలతో కూడిన పండ్లను తింటూ ఉండాలి.

ప్లాస్టిక్ సీసాలు

మినరల్ వాటర్ బాటిల్ ఖాళీ అయ్యాక, దాన్లోనే నీళ్లు నింపి వాడుకునే వాళ్లున్నారు. కానీ ఈ అలవాటు అత్యంత ప్రమాదకరం. మరీ ముఖ్యంగా వాటిని వేడి జనించే పరిసరాల్లో ఉంచడం వల్ల ముప్పు మరింత పెరుగుతుంది. విషాలు ప్లాస్టిక్ సీసాలోని నీళ్లలో కలిసిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ సీసాల్లోని రసాయనాలు హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్థం చేస్తాయి. కాబట్టి వీటికి బదులుగా స్టీలు లేదా గాజు సీసాల్లో నీళ్లు నిల్వ చేసుకోవడం సురక్షితం.



ప్రాసెస్డ్ ఫుడ్స్

ఆకట్టుకునే రంగులతో కూడిన ప్యాకెట్లలో కృత్రిమ రంగులు, నిల్వ పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. వీటిని అదే పనిగా తినడం వల్ల ఊబకాయం, మధుమేహం, గుండెజబ్బులు పెరుగుతాయి. పోషకవిలువలు అత్యల్పంగా ఉండే వీటిలో చక్కెరలు, సోడియం ఎక్కువగా ఉంటాయి. కాబట్టి వీటికి ఇంట్లో స్థానం కల్పించకూడదు

సెంటెడ్ క్యాండిల్స్

పరిసరాలను పరిమళభరితం చేసే సువాసన వెదజల్లే క్యాండిల్స్ వాయు కాలుష్యాన్ని పెంచుతాయి. వీటిలోని థాలేట్స్, శ్వాస సమస్యలను పెంచుతాయి. కొవ్వొత్తులతో ఇంటి ఆకర్షణను పెంచాలనుకుంటే, సెంటెడ్ క్యాండిల్స్‌కు బదులుగా తేనెటీగల మైనం, లేదా సోయాతో తయారైన కొవ్వొత్తులనే వాడుకోవాలి.

స్నానం సబ్బులు

యాంటీబ్యాక్టీరియల్ సబ్బుల్లో, ఇల్లు శుభ్రం చేసే ఉత్పత్తుల్లో ట్రైక్లోసాన్ అనే ప్రమాదకరమైన పదార్థం ఉంటుంది. ఇది హార్మోన్ వ్యవస్థను కుదిపేయడంతో పాటు, శరీరంలో యాంటీబయాటిక్ రెసిస్టెన్స్‌ను పెంచుతుంది. కాబట్టి స్నానానికి సాధారణ సబ్బులనే ఎంచుకోవాలి. ఘాటు వాసనలు వెదజల్లే సబ్బులు, ఇల్లు శుభ్రం చేసే ఉత్పత్తుల వాడకం మానేయాలి.

సర్ఫ్‌లు, బట్టల సబ్బులు

సువాసనలు వెదజల్లే డిటర్జెంట్ పౌడర్లలో అనేక రసాయనాలు, విషాలు ఉంటాయి. ఇవి ఉబ్బసం, అలర్జీలు, హార్మోన్ల హెచ్చుతగ్గులకు దారి తీస్తాయి. కాబట్టి సువాసనలు వెదజల్లని డిటర్జెంట్ పౌడర్లు, సబ్బులు వాడుకోవాలి.

తెలుసుకుందాం

పురుష హార్మోన్ క్షీణిస్తోంది

పురుషుల్లో టెస్టోస్టెరాన్ హార్మోన్ క్రమేపీ దిగజారుతోంది. 1970ల నుంచి ప్రతి పదేళ్లకూ పురుషుల టెస్టోస్టెరాన్ దిగజారడం మొదలుపెట్టిందనీ, నేటి 22 ఏళ్ల వయసు పురుషుల్లో 1970ల నాటి 70 ఏళ్ల వృద్ధుల కంటే తక్కువ టెస్టోస్టెరాన్ ఉంటోందని జోర్నల్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రైనాలజీలో ఒక అధ్యయనం ప్రచురితమైంది. అయితే ఈ పరిస్థితికి కారణాలు లేకపోలేదు. శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, ఊబకాయం, బిస్ఫినాల్ లాంటి పర్యావరణ కలుషితాలు, విషాలు, కదలకుండా గంటల తరబడి కూర్చోవడం, నిద్ర లేమి, ఆధునిక జీవితంతో ముడిపడి ఉండే తీవ్రమైన ఒత్తిడులే ఇందుకు ప్రధాన కారణాలుగా పరిశోధకులు పేర్కొంటున్నారు. టెస్టోస్టెరాన్ పురుష హార్మోన్ క్షీణించడం వల్ల కండర క్షీణత, లైంగిక కోరికలు సన్నగిల్లడం, అసలట, నిస్సత్తువలు వేధిస్తాయి. అయితే ఈ హార్మోన్‌ను సహజసిద్ధంగా పెంచుకునే మార్గాలెన్నో ఉన్నాయి. అవేంటంటే...

వ్యాయామం: వారానికి కనీసం ఐదు రోజుల పాటు క్రమం తప్పక వ్యాయామం చేయాలి

సమతులాహారం: ప్రొటీన్, పీచు ఎక్కువగా పిండి పదార్థాలు తక్కువగా ఉండే ఆహారం ఎంచుకోవాలి. తాజా కూరగాయలు, పండ్లు ఆహారంలో చేర్చుకోవాలి

ప్రాసెస్డ్ ఫుడ్స్: శుద్ధి చేసిన పదార్థాలు, చక్కెరతో తయారైన చిరుతిండ్లు బాగా తగ్గించాలి. శీతల పానీయాలు మానేయాలి

దురలవాట్లు: ధూమపానం, మద్యపానాలకు దూరంగా ఉండాలి

ఒత్తిడి: యోగా, ధ్యానంతో ఒత్తిడిని తగ్గించుకోవాలి

నిద్ర: నిద్రవేళలు క్రమం తప్పక పాటిస్తూ కంటి నిండా నిద్ర పోవాలి.

ఆహారం: కొవ్వుతో కూడిన చేపలు, గుల్ల చేపలు, గుడ్లు, అవకాడొ, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, దానిమ్మ, డార్క్ చాక్లెట్, నట్స్ సీడ్స్ ఆహారంలో చేర్చుకోవాలి.



2026 ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు

ఢిల్లీ ఆతిథ్యం

పారిస్: వచ్చే ఏడాది ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. 2026 ఆగస్టులో జరిగే ఈ మెగా టోర్నీకి వేదికగా ఢిల్లీని ఖరారు చేసినట్టు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది. ఆదివారం ఇక్కడ ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా బీడబ్ల్యూఎఫ్ చీఫ్ ఖున్‌యింగ్ పటామ.. భారత్‌కు ఆతిథ్యం దక్కిన విషయాన్ని వెల్లడించారు. ఈ మెగా ఈవెంట్ భారత్‌లో జరగనుండడం ఇది రెండోసారి. తొలిసారిగా 2009లో హైదరాబాద్‌లో టోర్నీ జరిగింది.



కప్పు కొడితే రూ. 39.55 కోట్లు

మహిళల వన్డే వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ భారీగా పెంపు

దుబాయ్: మహిళల వన్డే ప్రపంచ కప్ విజేత ప్రైజ్‌మనీని ఐసీసీ ఊహించని మొత్తానికి పెంచింది. చాంపియన్‌గా నిలిచే జట్టు ఏకంగా రూ. 39.55 కోట్లు అందుకోనుంది. గత మెగా టోర్నీలో విజేతకు రూ. 11.65 కోట్లు దక్కగా.. అంతకు మూడు రెట్లకు పైగా మొత్తం ఈసారి చాంపియన్‌కు దక్కనుంది. ఇక, రన్నరప్‌గా నిలిచే జట్టుకు రూ. 19.77 కోట్లు (గతసారి రూ. 5.30 కోట్లు) లభించనున్నాయి. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న వన్డే వరల్డ్ కప్ ఈనెల 30న ప్రారంభం కానుంది. ఎనిమిది జట్లు మెగా టోర్నమెంట్ బరిలో దిగుతున్నాయి. చాంపియన్‌షిప్ ప్రైజ్‌మనీ దాదాపు రూ. 122.5 కోట్లు కావడం విశేషం. కిందటి టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 31 కోట్ల కంటే ఇది 297 శాతం అధికం. ఇంకా.. 2023 పురుషుల వన్డే ప్రపంచ కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 88.26 కోట్లకన్నా.. మహిళల మెగా టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ ఎంతో ఎక్కువ. అలాగే పురుషుల టోర్నీ విజేత జట్టుకు దక్కింది రూ. 35.31 కోట్లే.

ప్రైజ్‌మనీ ఇలా..

- విజేతకు- రూ.39.55 కోట్లు ● రన్నరప్‌నకు - రూ. 19.77 కోట్లు
- సెమీఫైనలిస్టులకు - రూ.9.89 కోట్లు చొప్పున
- ఐదు, ఆరు స్థానాల జట్లకు - రూ.6.16 కోట్లు చొప్పున
- ఏడు, ఎనిమిది స్థానాల జట్లకు - రూ. 2.46 కోట్లు చొప్పున
- గ్రూప్ దశలో ఒక్కో విజయానికి - రూ. 30.29 లక్షలు
- పాల్గొన్న ప్రతి జట్టుకు- అదనంగా రూ. 2.20 కోట్లు

గ్రూప్ టాపర్.. భారత్

- 15-0తో కజకిస్థాన్‌పై ఘన విజయం
- సూపర్-4కు చైనా, మలేసియా, కొరియా
- ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ హాకీలో గ్రూప్ దశను భారత్ ఘనంగా ముగించింది. ఈపాటికే సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. పూల్-ఎలో సోమవారం ఏకపక్షంగా సాగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 15-0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది. అభిషేక్ 4 గోల్స్‌తో అదరగొట్టగా, సుఖ్‌జీత్, జుగ్‌రాజ్ చెరో 3 గోల్స్ నమోదు చేశారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 9 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఇదే గ్రూప్‌లో చైనా, జపాన్ మధ్య మ్యాచ్ 2-2తో డ్రా అయింది. ఇరుజట్లూ చెరో 4 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన గోల్స్ తేడాతో చైనా రెండో స్థానంతో సూపర్-4కు చేరింది. పూల్-బి నుంచి మలేసియా, కొరియా సూపర్-4లో ప్రవేశించాయి. సోమవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో మలేసియా 15-0తో చైనీస్ తైపీపై, కొరియా 5-1తో బంగ్లాదేశ్‌పై గెలిచాయి. 9 పాయింట్లతో మలేసియా గ్రూప్-బి టాపర్‌గా నిలవగా.. రెండు మ్యాచ్‌లు గెలిచిన కొరియా 6 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే సూపర్-4 తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడనుంది.

దుబాయ్ లీగ్‌లో అశ్విన్?



న్యూఢిల్లీ: తాజాగా ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా మాజీ స్పిన్నర్ అశ్విన్ అంతర్జాతీయ లీగ్‌లు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. యూఏఈ నిర్వహించే ఇంటర్నేషనల్ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20) వేలంలో తనపేరును నమోదు చేసుకొనేందుకు నిర్వాహకులతో చర్చలు జరుపుతున్నట్టు అశ్విన్ తెలిపాడు. ఆటగాళ్ల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10 డెడ్‌లైన్. ఇంతకుముందు ఈ లీగ్‌లో డ్రాఫ్టింగ్ విధానం ద్వారా ఆటగాళ్లను ఎంపిక చేసుకోగా.. ఈ ఏడాది వేలం ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఈనెల 30న దుబాయ్‌లో వేలం జరగనుంది. లీగ్‌ను డిసెంబరు 2 నుంచి జనవరి 4 వరకు షెడ్యూల్ చేశారు.

రిబకినాకు షాక్

క్వార్టర్స్‌కు సబలెంక, స్వియటెక్, అల్కారజ్
యూఎస్ ఓపెన్


వొంద్రుసోవా


రిబకినా

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో మరో సీడెడ్ క్రీడాకారిణి ఇంటిబాట పట్టింది. వింబుల్డన్ మాజీ చాంపియన్, 9వ సీడ్ ఎలెనా రిబకినాకు నాలుగో రౌండ్లో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి మార్కెటా వొంద్రుసోవా షాకిచ్చింది. వొంద్రుసోవా 4-6, 7-5తో రిబకినా (కజకిస్థాన్)ను కంగుతినిపించి యూఎస్ ఓపెన్‌లో రెండోసారి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, టాప్ సీడ్ సబలెంక (బెలారస్) 6-1, 6-4తో క్రిస్టియానా బుక్సా (స్పెయిన్)ను, రెండో సీడ్ స్వియటెక్ 6-3, 6-1తో ఎకటరీనా (రష్యా)ను ఓడించి క్వార్టర్స్ చేరారు. బార్బరా క్రెజికోవా (చెక్) 1-6, 7-6(13), 6-3తో టేలర్ టౌన్‌సెండ్‌పై అద్భుత విజయం సాధించింది.

నొవాక్ 64వసారి: పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్, సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, టేలర్ ఫ్రిట్జ్ ముందంజ వేశారు. ఏడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-3, 6-2తో జాన్ లెన్నార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై వరుస గేముల్లో నెగ్గి రికార్డుస్థాయిలో 64వసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. అల్కారజ్ 7-6(3), 6-3, 6-4తో ఫ్రెంచ్ ప్లేయర్ ఆర్థర్ రెండర్‌కెచ్‌పై సునాయాసంగా నెగ్గాడు. ఈ క్రమంలో ఓపెన్ ఎరాలో 13సార్లు గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్ చేరిన పిన్నవయస్కుడిగా 22 ఏళ్ల అల్కారజ్ రికార్డులకెక్కాడు. అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-3తో 21వ సీడ్ థామస్ మచాక్ (చెక్)పై, అలెక్స్ డి మినార్ 6-3, 6-2, 6-2తో లియాండ్ర రైడీపై గెలిచారు. 15వ సీడ్ రుబ్లేవ్ 5-7, 3-6, 4-6తో ఫెలిక్స్ అగర్ అల్‌అస్సిమీ చేతిలో ఓడాడు. డబుల్స్ రెండో రౌండ్‌లో ఇండో-ఆసీస్ జోడీ యుకీ భాంబ్రి-మైకేల్ వీనస్ 6-1, 7-5తో ఎస్కోబార్-మిగ్వెల్ వరేలాను ఓడించింది.

మాయ ముందంజ



జూనియర్స్ సింగిల్స్‌లో భారత ప్లేయర్ మాయా రాజేశ్వరన్ రేవతి రెండో రౌండ్‌కు చేరుకొంది. బాలికల విభాగం మొదటి రౌండ్‌లో మాయ 7-6(5), 6-3తో జాంగ్ క్వియాన్ (చైనా)పై గెలిచింది. కోయంబత్తూరుకు చెందిన మాయ స్పెయిన్‌లోని రఫెల్ నడాల్ అకాడమీలో శిక్షణ తీసుకొంటోంది. బాలుర విభాగం తొలి రౌండ్‌లో హితేష్ 2-6, 4-6తో జెర్రీడ్ గెయిన్స్ (అమెరికా) చేతిలో, క్రిష్ త్యాగి 3-6, 1-6తో లుడ్విగ్ హెడే (స్పెయిన్) చేతిలో ఓడారు.

ప్రజ్ఞానంద @ 4

చెస్ వరల్డ్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద కొత్త మైలురాయిని చేరుకున్నాడు. కెరీర్‌లో అత్యధికంగా 2785 ఎలో రేటింగ్‌కు చేరాడు. దాంతో ఫిడే క్లాసికల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అతడు అత్యుత్తమంగా నాలుగో స్థానానికి చేరుకున్నాడు. తద్వారా అత్యుత్తమ ర్యాంక్ సాధించిన భారత ఆటగాడిగా మరో ఘనతనూ ప్రజ్ఞానంద అందుకున్నాడు. సింక్వెఫీల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతో ప్రజ్ఞానందకు ఆరు రేటింగ్ పాయింట్లు లభించాయి. కార్ల్‌సన్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, అమెరికన్ గ్రాండ్‌మాస్టర్లు నకముర, కరువాన రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. తెలంగాణ జీఎం అర్జున్ ఐదు, వరల్డ్ చాంపియన్ గుకేష్ ఆరో ర్యాంక్ దక్కించుకున్నారు.

ఇరాన్ చేతిలో భారత్ ఓటమి

కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్

హిసార్ (తజకిస్థాన్): కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను విజయంతో ప్రారంభించిన భారత జట్టు.. తమ రెండో మ్యాచ్‌లో మాత్రం తడబడింది. గ్రూప్-బిలో భాగంగా సోమవారం జరిగిన పోరులో 133వ ర్యాంకర్ భారత్ 0-3తో 20వ ర్యాంకర్ ఇరాన్ చేతిలో పరాజయం పాలైంది. అమిర్‌హుస్సేన్, అలీ, మెహ్దీ తరెమి తలా గోల్ చేశారు. తమకంటే ఎన్నో రెట్లు మెరుగైన పటిష్ఠ ఇరాన్‌కు భారత్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కజకిస్థాన్‌ను భారత్ ఓడించిన సంగతి తెలిసిందే. గ్రూప్‌లో తమ చివరి మ్యాచ్‌ను భారత్ ఈనెల 4న అఫ్ఘానిస్థాన్‌తో ఆడనుంది.

మరోసారి క్షమాపణ కోరుతున్నా

చెంపదెబ్బ వీడియోపై హర్భజన్

న్యూఢిల్లీ: చెంపదెబ్బ వివాదాన్ని మళ్లీ తెరపైకి తేవడం ఎందుకంటూ మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశ్నించాడు. ఐపీఎల్ తొలి సీజన్‌లో శ్రీశాంత్ చెంపపై భజ్జీ కొట్టిన వీడియోను ఇటీవల లీగ్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ విడుదల చేసిన విషయం తెలిసిందే. 'అందరూ మర్చిపోయిన ఆ విషయాన్ని గుర్తుకుతెస్తున్నారు. దీని వెనుక వారికేదైనా స్వార్థపూరిత ఉద్దేశం ఉండొచ్చు. అప్పటి నా ప్రవర్తనపై ఎన్నోసార్లు క్షమాపణ చెప్పా. ఇప్పటికీ బాధగానే ఉంది. వినాయకుడి సాక్షిగా మరోసారి క్షమించమని కోరుతున్నా' అని భజ్జీ తెలిపాడు.

పైరేట్స్‌పై యోధాస్ గెలుపు

ప్రొ కబడ్డీ లీగ్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో యూపీ యోధాస్ 34-31 స్కోరుతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. మ్యాచ్ ప్రథమార్ధంలో ఆరు పాయింట్ల ఆధిక్యంతో ఉన్న పైరేట్స్.. ఆ తర్వాత రైడింగ్‌లో వెనుకంజలో నిలిచింది. ద్వితీయార్థంలో అద్భుతంగా పుంజుకున్న యూపీ యోధాస్‌లో రైడర్ భవానీ రాజ్‌పుత్ వరుసగా పాయింట్లు రాబట్టి అదరగొట్టాడు. యూపీ జట్టులో గగన్ గౌడ ఏడు పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలవగా, మరో రైడర్ భవానీ రాజ్‌పుత్ 5, డిఫెండర్లు సుమిత్ 5, అన్షు సింగ్ 5 పాయింట్లు రాబట్టారు. పైరేట్స్‌లో అయాన్ 9, మణిందర్‌సింగ్ 7 పాయింట్లు సాధించారు. రెండో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 41-19 స్కోరుతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుగా ఓడించింది.

టెస్టులకు ఓవర్టన్ విరామం

లండన్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ ముందు ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి నిరవధిక విరామం తీసుకుంటున్నట్టు ప్రకటించాడు. ఇకపై పరిమిత ఓవర్ల ఆటపైనే దృష్టి సారిస్తానని స్పష్టం చేశాడు. మూడేళ్ల బ్రేక్ తర్వాత అతను ఇటీవలి అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో చోటు దక్కించుకుని ఆఖరి టెస్టు ఆడాడు. 'ఇకపై మూడు ఫార్మాట్లలో కొనసాగలేను. శారీరకంగా, మానసికంగా అసాధ్యంగా అనిపిస్తోంది. అందుకే టెస్టుల నుంచి విరామం తీసుకుంటున్నా. ఇక నుంచి నా దృష్టంతా వైట్ బాల్ క్రికెట్‌పైనే' అని ఓవర్టన్ పేర్కొన్నాడు. 2022లో టెస్టు అరంగేట్రం చేసిన ఓవర్టన్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు.

రూపాయికి సుంకాల పోటు

సరికొత్త ఆల్‌టైం కనిష్ఠానికి పతనం • రూ.88.10కి చేరిక

త్వరలో రూ.90కి చేరే అవకాశం

ముంబై: ట్రంప్ సుంకాల దాటికి మన కరెన్సీ విలువ వేగంగా కరుగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. మరో పైసా నష్టపోయి రూ.88.10 వద్ద ముగిసింది. రూ.88.33 వద్ద ఆల్‌టైమ్ ఇంట్రాడే కనిష్ఠాన్ని సైతం నమోదు చేసింది. స్టాక్ మార్కెట్లు లాభాల్లో పయనించినప్పటికీ.. ట్రంప్ భారత్‌పై విధించిన 50 శాతం సుంకాల ప్రభావంతో పాటు అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న అనిశ్చితి, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమైంది. మన కరెన్సీకి మద్దతుగా ఫారెక్స్ మార్కెట్ కార్యకలాపాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకునేందుకు అవకాశాలున్నప్పటికీ, అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మున్ముందు నెలల్లో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.90కి చేరే అవకాశాల్లేకపోలేవని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త అదితి గుప్తా అన్నారు.

సూచీలకు జీడీపీ, జీఎస్‌టీ జోష్

సెన్సెక్స్ 555 పాయింట్లు జంప్

ముంబై: గత వారం వరుసగా మూడు రోజులు నష్టాలు చవిచూసిన భారత స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మళ్లీ లాభాల బాటపట్టాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 554.84 పాయింట్లు ఎగిసి 80,364.49 వద్దకు చేరగా.. నిఫ్టీ 198.20 పాయింట్ల వృద్ధితో 24,625.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.2 లక్షల కోట్లు పెరిగి రూ.448.85 లక్షల కోట్లకు (5.09 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. ఐటీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్ మార్కెట్ ర్యాలీకి దోహదపడింది. జూన్‌తో ముగిసిన క్వార్టర్‌లో జీడీపీ వృద్ధి రేటు 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతానికి పుంజుకోవడంతో పాటు ఈవారంలో జరగనున్న జీఎస్‌టీ మండలి సమావేశంలో ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల తగ్గింపునకు ఆమోదం లభించవచ్చని.. దీంతో ఆర్థిక వ్యవస్థలో వినియోగం మరింత పెరగనుందన్న అంచనాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

పసిడి సరికొత్త రికార్డు

10 గ్రాముల ధర రూ.1,05,670

బంగారం వరుసగా ఆరో రోజు ఎగబాకి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరింది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,05,670కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.800 పెరుగుదలతో కొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.1,04,800కు ఎగబాకింది. కిలో వెండి సైతం రూ.1,000 పెరిగి కొత్త గరిష్ఠ స్థాయి రూ.1.26 లక్షలకు చేరింది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.86 లక్షల కోట్లు

ఆగస్టులో 6.5 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆగస్టులో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.5 శాతం వృద్ధితో రూ.1.86 లక్షల కోట్లు దాటాయి. దేశీయంగా వ్యాపార లావాదేవీలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. పండగ సీజన్ కూడా ప్రారంభమవడంతో మున్ముందు నెలల్లో జీఎస్‌టీ వసూళ్లు మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ జూలైలో నమోదైన రూ.1.96 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే మాత్రం గత నెలలో వసూళ్లు కాస్త తగ్గాయి. మరిన్ని విషయాలు..

- ఆగస్టులో దేశీయ ఆర్థిక లావాదేవీల నుంచి వసూలైన స్థూల పన్ను ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9.6 శాతం పెరిగి రూ.1.37 లక్షల కోట్లుగా నమోదైంది. దిగుమతుల నుంచి పన్ను వసూళ్లు మాత్రం 1.2 శాతం తగ్గి రూ.49,354 కోట్లకు పరిమితం అయ్యాయి.
- ఆగస్టులో జీఎస్‌టీ రిఫండ్లు వార్షిక ప్రాతిపదికన 20 శాతం తగ్గి రూ.19,359 కోట్లుగా నమోదయ్యాయి. అందులో ఎగుమతులకు సంబంధించిన రిఫండ్లు రూ.8,346 కోట్లకు తగ్గడం సుంకాల ప్రభావానికి స్పష్టమైన సంకేతమని ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు.
- రిఫండ్ల అనంతరం జీఎస్‌టీ నికర ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. 2024 ఆగస్టులో నమోదైన నికర ఆదాయంతో పోలిస్తే 10.7 శాతం అధికం ఇది.
- పండగ సీజన్‌లో డిమాండ్ వృద్ధి నవంబరు వరకు కొనసాగనుందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి అన్నారు. అయితే, ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో మాత్రం వసూళ్లు కాస్త తగ్గుముఖం పట్టవచ్చన్నారు.

ఆగస్టులో 'ఆటో'కు నిరాశ

న్యూఢిల్లీ: ఆగస్టు నెలలో ప్యాసింజర్ వాహన కంపెనీల టోకు విక్రయాలు తగ్గాయి. దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీతో పాటు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ అమ్మకాల్లో క్షీణత నమోదైంది. ఈ నెలలో వాహనాలపై జీఎస్‌టీ రేట్లు గణనీయంగా తగ్గవచ్చన్న ఆశలతో కస్టమర్లు తమ కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం ఇందుకు ప్రధాన కారణమైంది. మారుతి సుజుకీ దేశీయ టోకు విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 8 శాతం తగ్గగా.. హ్యుండయ్ మోటార్స్ నుంచి డీలర్లకు సరఫరాలు 11 శాతం తగ్గాయి. మహీంద్రా సేల్స్ 9 శాతం, టాటా మోటార్స్ అమ్మకాలు 7 శాతం క్షీణించాయి. టయోటా విక్రయాలు మాత్రం 2 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహనాల విభాగంలో బజాజ్ ఆటో దేశీయ టోకు విక్రయాలు 12 శాతం తగ్గగా.. టీవీఎస్ మోటార్ సేల్స్ 28 శాతం పెరిగాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 57 శాతం పుంజుకున్నాయి.

బిజినెస్

భారత రిటైల్ బ్యాంకింగ్‌కు డాయిష్ బ్యాంక్ గుడ్‌బై

ఆస్తుల విక్రయానికి బిడ్ల ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత్‌లో రిటైల్ బ్యాంకింగ్ ఆస్తులను విక్రయించాలని జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి కలిగిన దేశీయ, అంతర్జాతీయ రుణదాతల నుంచి బిడ్లను కూడా ఆహ్వానించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. డాయిష్ బ్యాంక్ మన దేశంలో 17 శాఖల ద్వారా రిటైల్ బ్యాంకింగ్ సేవలందిస్తోంది. రిటైల్ బ్యాంకింగ్ విభాగ లాభాలను పెంచేందుకు ఈ ఏడాది అంతర్జాతీయంగా దాదాపు 2,000 ఉద్యోగాలకు కోత పెట్టడంతో పాటు బ్రాంచీల సంఖ్యను సైతం గణనీయంగా తగ్గించుకోనున్నట్లు డాయిష్ బ్యాంక్ సీఈఓ క్రిస్టియన్ సీవింగ్ ఈ మార్చిలో ప్రకటించారు. ఆ ప్రణాళికలో భాగంగానే భారత్ రిటైల్ బ్యాంకింగ్ నుంచి పూర్తిగా నిష్క్రమించాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

● యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) ఆంధ్రప్రదేశ్‌లో తన కింగ్‌ఫిషర్ బ్రాండ్ బీర్ల ఉత్పత్తిని మరింత పెంచింది. తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల లీజుకు తీసుకున్న ఇలియోస్ బ్రూవరీలోనూ ఈ బీర్ల ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపింది. ఈ బ్రూవరీలో నెలకు 4.5 లక్షల కేసుల కింగ్‌ఫిషర్ బీర్లు ఉత్పత్తి చేయవచ్చు. శ్రీకాకుళం జిల్లాలోనూ కంపెనీకి నెలకు 12 లక్షల కేసుల కింగ్‌ఫిషర్ బీర్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్లాంటు ఉంది. ఏపీలో పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని ఇలియోస్ బ్రూవరీలోనూ ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2 తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	570
వరంగల్	532	గోదావరి	565
చిత్తూరు	578	విశాఖపట్నం	570
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	122
వరంగల్	95	గుంటూరు	115
కరీంనగర్	95	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	100
కర్నూలు	95	నెల్లూరు	105
విశాఖపట్నం	126	అనంతపురం	105
గోదావరి	122		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,05,880 ▲	97,050 ▲	1,36,000 ▲
విజయవాడ	1,07,500 ▲	1,01,000 ▲	1,26,150 ▲
విశాఖపట్నం	1,07,430 ▲	97,050 ▲	1,36,000 ▲
రాజమండ్రి	1,05,870 ▲	97,050 ▲	1,26,300 ▲
ప్రొద్దుటూరు	1,06,250 ▲	97,750 ▲	1,26,000 ▲
ముంబై	1,04,493 ▲	95,716 ▲	1,22,800 ▲

విస్తరణ బాటలో బొండాడ ఇంజనీరింగ్

- రెండేళ్లలో డేటా సెంటర్ల వ్యాపారంలోకి..
- 2030 నాటికి 100 కోట్ల డాలర్ల టర్నోవర్ లక్ష్యం
- సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బొండాడ ఇంజనీరింగ్ డేటా సెంటర్ల వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. వచ్చే రెండేళ్ల కాలంలో ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టాలని చూస్తున్నట్లు సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు వెల్లడించారు. హైదరాబాద్ సహా అనుకూలమైన వనరులు ఉన్న నగరాల్లో ఈ సెంటర్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా సంస్థ ఈ మధ్యనే రక్షణ రంగ ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మిస్సైల్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి సేవలను ఈ విభాగం ద్వారా అందించనున్నట్లు రావు చెప్పారు. ఇందుకోసం రక్షణ రంగంలోని ప్రభుత్వ రంగ సంస్థలతో చర్చలు సాగిస్తున్నట్లు రావు తెలిపారు. రెన్యువబుల్ ఎనర్జీ, టెలికాం రంగాల్లో కంపెనీ కీలకంగా ఉందన్నారు.

ఈ ఏడాది మరో రూ.2,700 కోట్ల ఆర్డర్లు: ప్రస్తుతం బొండాడ ఇంజనీరింగ్ ఆర్డర్ బుక్ రూ.5,400 కోట్లుగా ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కొత్తగా రూ.2,700 కోట్ల ఆర్డర్లు దక్కించుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు రాఘవేంద్ర రావు వెల్లడించారు. కాగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం రూ.1,571 కోట్లుగా ఉండగా నికర లాభం రూ.120 కోట్లుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయంలో 80 శాతం, లాభంలో 60-70 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. 2030 నాటికి సంస్థ మొత్తం ఆదాయాన్ని 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,800 కోట్లు)కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రావు తెలిపారు. సోలార్ ఐపీపీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ.9000 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌ను దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి 400 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) కాంట్రాక్ట్‌ను అందుకున్నట్లు రావు తెలిపారు.

మార్కెట్లోకి సామ్‌సంగ్ గెలాక్సీ ఏ17 5జీ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సామ్‌సంగ్ ఇండియా మార్కెట్లోకి గెలాక్సీ ఏ17 5జీ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ కంపెనీ ఎంఎక్స్ బిజినెస్, వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ ఈ ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగల సీజన్‌ను పురస్కరించుకుని గెలాక్సీ ఏ సిరీస్ విభాగంలో ఏ17ను అత్యుత్తమ ఏఐ ఫీచర్లు, సెక్యూరిటీ ఫీచర్లు, అందుబాటు ధరల్లో తీసుకువచ్చినట్లు చెప్పారు. 50 ఎంపీ ప్రధాన కెమెరా, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్, 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ అమోలెడ్ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకతలని ఆయన తెలిపారు. 6జీబీ ప్లస్ 128 జీబీ మెమరీ, 8జీబీ ప్లస్ 128 జీబీ మెమరీ, 8జీబీ ప్లస్ 256 జీబీ మెమరీతో అందుబాటులో ఉండనున్న గెలాక్సీ ఏ17 5జీ స్మార్ట్‌ఫోన్ ధరలు వరుసగా రూ.18,999, రూ.20,499, రూ.23,499గా ఉన్నాయి. 2019లో గెలాక్సీ ఏ సిరీస్ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకురాగా ఈ ఏడాది జూన్ నాటికి మొత్తం 9.6 కోట్ల ఫోన్లను విక్రయించినట్లు బబ్బర్ తెలిపారు. డిసెంబరు నాటికి వీటి విక్రయాలు 10 కోట్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నట్లు బబ్బర్ వెల్లడించారు.


కలిసిరానున్న విస్తరణ

పెరగనున్న ఆదాయం : కిమ్స్ హాస్పిటల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహారాష్ట్రలోని థానే, బెంగళూరుల్లో ఏర్పాటు చేసిన కొత్త హాస్పిటల్స్‌తో కిమ్స్ హాస్పిటల్ ఆదాయం మరింత పెరగనుంది. ప్రస్తుతం ఒక్కో పడక (బెడ్)పై రూ.45,000గా ఉన్న సగటు ఆదాయం (ఏఆర్‌పీఓబీ) త్వరలోనే రూ.55,000కు చేరే అవకాశం ఉందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎఫ్ఓ సచిన్ అశోక్ సాల్వీ ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. థానేలో ఈ ఏడాది మే నెలలో ప్రారంభించిన కిమ్స్ హాస్పిటల్ ద్వారా ఒక్కో బెడ్‌పై సగటున రూ.55,000 నుంచి రూ.60,000 వరకు ఆదాయం లభిస్తోంది. గత నెల బెంగళూరులో ప్రారంభమైన హాస్పిటల్ నుంచి ఒక్కో పడకపై సగటున రూ.75,000 వరకు ఆదాయం లభిస్తోందని సాల్వీ తెలిపారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఒక్కో బెడ్‌పై కంపెనీకి వచ్చే సగటు ఆదాయం ప్రస్తుత రూ.45,000 నుంచి రూ.55,000కు చేరుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ రెండు హాస్పిటల్స్ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ స్థూల లాభం రూ.60 కోట్ల నుంచి రూ.75 కోట్ల మేర పెరిగే అవకాశం ఉందని సాల్వీ చెప్పారు.

మోసం చేయగలిగేవాడే గొప్ప నేత

రాజకీయాల్లో నిజాలు మాట్లాడటంపై నిషేధం ఉంది: గడ్కరీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: తాను ఉన్న రాజకీయ రంగంలో హృదయాంతరాల్లోంచి నిజాలు మాట్లాడటంపై నిషేధం ఉందని, ఈ రంగంలో ప్రజలను మోసం చేయగలిగేవాడే నేతల్లోకెల్లా గొప్ప నేత అనిపించుకుంటాడని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నాగపూర్‌లో సోమవారం అఖిల భారతీయ మహానుభావ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడారు. బతకడానికి దగ్గరిదారులు (షార్ట్‌కట్స్) వెతకొద్దని.. నిబద్ధత, నిజాయితీ, విశ్వసనీయతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దగ్గరిదారులు సత్వర ఫలితాలు ఇవ్వొచ్చునేమో గానీ, దీర్ఘకాలంలో విశ్వసనీయతను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. విజయం ఎప్పుడూ సత్యం వెంటే ఉంటుందని, భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా ఎప్పుడైనా చివరికి సత్యమే గెలుస్తుందని చెప్పాడని పేర్కొన్నారు.

ఉపరాష్ట్రపతి నివాసం ఖాళీ చేసిన ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి, దక్షిణ ఢిల్లీలోని ఛతర్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు మారారు. తన పదవికి రాజీనామా చేసిన ఆరు వారాల తరువాత ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఛతర్‌పూర్‌లోని గడైపూర్ ప్రాంతంలో ఉన్న ఈ ఫామ్‌హౌస్ ఐఎన్ఎల్‌డీ నాయకుడు అభయ్ చౌతాలాకు చెందినది. మాజీ ఉపరాష్ట్రపతిగా ఆయనకు కేటాయించాల్సిన టైప్-8 అధికారిక నివాసం లభించే వరకు ఇది తాత్కాలిక ఏర్పాటు అని అధికారులు తెలిపారు. ఆరోగ్య సమస్యలున్నాయని జూలై 21న తన పదవికి రాజీనామా చేసిన ధన్‌ఖడ్, అప్పటి నుంచి పార్లమెంటుహౌస్ దగ్గర్లో వైస్ ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌లో ఉంటున్నారు.

జనగణనకు 14 వేల కోట్లు ఇవ్వండి: ఆర్జీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: దేశంలో చేపట్టనున్న జనగణన కోసం రూ.14,618.95 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్జీఐ) ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖకు ప్రతిపాదనలతో కూడిన నివేదికను అందజేసింది. రెండు దశల్లో చేపట్టే జనాభా లెక్కింపునకు 35 లక్షల మందికి పైగా క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం ఉందని పేర్కొంది. వీరికి శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రక్రియ మొత్తం డిజిటల్‌గానే సాగనుందని వివరించింది. ప్రతిపాదిత మొత్తాన్ని రెండు దశల లెక్కింపునకు వినియోగించనున్నట్టు తెలిపింది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు తొలిదశ, 2027, ఫిబ్రవరి నుంచి రెండో దశ లెక్కింపు చేపట్టనున్నట్టు వివరించింది.

మెడిసిన్ ట్యూబ్‌లతో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు

ముంబై, సెప్టెంబరు 1: ఆస్పత్రుల్లో చికిత్స సమయంలో మందులు సరఫరా చేయడానికి, ద్రవపదార్థాలను శరీరంలోకి పంపడానికి ఉపయోగించే ట్యూబ్‌ల నిర్వహణ సరైన పద్ధతిలో చేపట్టకపోవడం వల్ల రోగులు అనేక రకాల బ్లడ్ ఇన్ఫెక్షన్లకు గురవుతున్నారని తాజా అధ్యయనంలో గుర్తించారు. దేశవ్యాప్తంగా 54 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, 200కిపైగా ఐసీయూల్లో ఏడేళ్లపాటు నిర్వహించిన ఈ అధ్యయనంలో మెడిసిన్ ట్యూబ్‌ల నిర్వహణలోపం కారణంగా 8,600కిపైగా కేసుల్లో తీవ్రమైన ఇన్ఫెక్షన్లను గుర్తించారు. సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లుగా పేర్కొంటున్న వీటి వల్ల ముఖ్యంగా నవజాత శిశువులు అధికంగా ప్రభావితమైనట్టు కనుగొన్నారు. ఇన్ఫెక్షన్ల బారినపడిన రోగుల్లో దాదాపు 40 శాతం మంది రెండు వారాల్లోనే చనిపోయారని ఈ అధ్యయనం పేర్కొంది. ప్రతి వెయ్యి సెంట్రల్ లైన్ రోజులకు దాదాపు 9 సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయని తెలిపింది. ఈ అధ్యయనం వివరాలు ఇటీవల లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అఫ్గాన్‌లో భూకంపం



(మొదటి పేజీ తరువాయి)

విరిగిపడే ప్రమాదం ఉండడంతో సహాయ బృందాలు వెళ్లడం కష్టంగా మారింది. తూర్పు రాష్ట్రాలైన కునార్, నంగర్‌హార్‌లలో ఆదివారం అర్ధరాత్రి భూమి కంపించింది. భూమిలోపల పది కిలోమీటర్ల (5 మైళ్లు) లోతులో భూకంప కేంద్రం నమోదయింది. రెక్టార్ స్కేల్‌పై దీని తీవ్రత 6.0 పాయింట్లుగా రికార్డయింది. అనంతరం రాత్రంతా అయిదుసార్లు భూమి కంపించింది. కునార్ ప్రావిన్స్‌లో మొత్తం మూడు గ్రామాలు పూర్తిగా తుడిచిపెట్టుకొని పోయాయి. ఈ ప్రాంతంలో మట్టితో నిర్మించిన ఇళ్లే అధికం కావడంతో మృతుల సంఖ్య మరింతగా పెరిగే సూచనలు ఉన్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అయిదు రాష్ట్రాల్లోని సుమారు 10.20 లక్షల మందిపై భూకంప ప్రభావం ఉంటుందని అమెరికా భూగర్భ సర్వే విభాగం అంచనా వేసింది. రోడ్లు పూర్తిగా పాడవడంతో సహాయ బృందాలు వెళ్లలేకపోతున్నాయి. దాంతో సైన్యమే విమానాల ద్వారా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తోంది. 40 విమానాలు సేవలు అందిస్తున్నాయని, ఇంతవరకు 420 మంది క్షతగాత్రులను తరలించినట్టు సైన్యం ప్రకటించింది. నష్టం అధికంగా ఉండడంతో ఆదుకోవాలని తాలిబన్ ప్రభుత్వం అన్ని దేశాలను కోరింది. 2021లో ఆఫ్గాన్‌లో తాలిబాన్ ప్రభుత్వం ఏర్పాటయిన నుంచి చాలా దేశాలు సహాయాన్ని నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో తాలిబన్ ప్రభుత్వం చేసిన ఈ వినతి



భూకంప బాధితులకు వ్యవసాయక్షేత్రాల్లోనే తాత్కాలిక చికిత్స అందిస్తున్న దృశ్యం

ప్రాధాన్యం సంతరించుకొంది. అంతర్జాతీయంగా తమను ఆదుకోవాలని ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ కోరారు. భారీ వర్షాలు కురుస్తుండడం, రోడ్లు పూర్తిగా పాడవడంతో సహాయ బృందాలు వెళ్లలేకపోతున్నాయని ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల సమన్వయ విభాగం అధికారి కేట్ కారే చెప్పారు. నీటి వనరులు కలుషితం కాకుండా జంతువుల కళేబరాలను వెంటవెంటనే తొలగిస్తున్నట్టు తెలిపారు.

అండగా ఉంటాం: మోదీ

అఫ్గాన్‌లో భూకంపం కారణంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. అండగా ఉంటామని, మానవతా సాయం అందిస్తామని ప్రకటించారు. మరోవైపు తక్షణ సాయం కింద భారత్ 15 టన్నుల ఆహార పదార్థాలను కాబూల్ నుంచి కునార్‌కు పంపించిందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయ్ శంకర్ ఎక్స్ ద్వారా తెలిపారు. 1,000 ఫ్యామిలీ టెంట్లను పంపించినట్టు పేర్కొన్నారు. మంగళవారం నుంచి పలు రకాల సహాయ సామగ్రిని పంపిస్తామని పేర్కొన్నారు. ఆయన అఫ్గాన్ విదేశాంగ శాఖ మంత్రి మావ్లావీ అమీర్ ఖాన్ ముత్తాకీతో మాట్లాడారు. అఫ్గాన్‌లోని తమ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియా గుటెర్రస్ ప్రకటించారు. మృతులకు సంతాపం తెలుపుతూ పోప్ లియో సందేశం పంపారు. సాధ్యమైనంత మేర సాయం అందిస్తామని చైనా కూడా ప్రకటించింది. తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తరువాత మూడు పెద్ద భూకంపాలు సంభవించడం గమనార్హం.

అమెరికాలో ఉద్యోగం పోతే ఇంటికి పోతాం..

45% హెచ్-1బీ భారతీయుల మనోగతం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: అమెరికా విధిస్తున్న నిబంధనలు హెచ్-1బీ వీసాలపై అక్కడ పనిచేస్తున్న భారతీయ వృత్తి నిపుణుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఒకవేళ ఉద్యోగం కోల్పోతే నిర్దేశిత సమయంలో అమెరికాను వారు వీడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగం కోల్పోతే ఎక్కడికి వెళ్తారు అనే దానిపై అజ్ఞాత కమ్యూనిటీ యాప్ బ్లైండ్ సర్వేలో ప్రశ్నించగా.. భారత్‌కు తిరిగి వెళ్తామని 45% మంది భారతీయ వృత్తినిపుణులు తేల్చి చెప్పేశారు. మరో దేశానికి వెళ్తామని 26 శాతం మంది పేర్కొన్నారు. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని 29 శాతం మంది చెప్పారు. ఇక అమెరికాను విడిచివెళ్లడానికి చెబుతున్న ప్రధాన ఆందోళనల విషయానికి వస్తే.. జీతాల్లో కోతలు (25%), నాణ్యత లేని జీవితం (24%), సాంస్కృతిక లేదా కుటుంబ సర్దుబాట్లు (13%), తక్కువ ఉద్యోగ అవకాశాలు (10%) వంటివి ఉన్నాయి. మళ్లీ అమెరికా వర్క్ వీసాను ఎంచుకుంటారా అంటే.. కేవలం 35% మంది మాత్రమే ఎంచుకుంటామన్నారు.

నకిలీ పాస్‌పోర్టు, వీసాలపై కొరడా!

- మోసానికి పాల్పడితే కఠిన దండన
- ఏడేళ్ల జైలు, 10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: నకిలీ పాస్‌పోర్టు, వీసాలతో దేశంలోకి వచ్చినా, ఇక్కడే తిష్ఠవేసినా.. ఇతర దేశాలకు వెళ్లే ప్రయత్నం చేయాలని అనుకున్నా ఇకపై కఠిన దండన తప్పదు. నకిలీ పాస్‌పోర్టులు, వీసాలపై కేంద్రం కొరడా ఝుళిపించనుంది. నకిలీరాయుళ్లను గుర్తించి కఠినంగా శిక్షించనుంది. దీనికి సంబంధించి ఈ ఏడాది పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించిన 'వలసదారులు, విదేశీయుల చట్టం-2025'ను సెప్టెంబరు 1 నుంచి(సోమవారం) అమల్లోకి తీసుకువచ్చినట్టు కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి నితీశ్‌కుమార్ వ్యాస్ పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం.. నకిలీలకు పాల్పడే వారికి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు, రూ.10 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఈ చట్టాన్ని అత్యంత కఠినంగా అమలు చేయనున్నట్టు వ్యాస్ తెలిపారు. పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ బిల్లుకు ఈ ఏడాది ఏప్రిల్ 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో ఇది చట్టంగా మారింది. ఈ చట్టంలోని సెక్షన్-1లో పేర్కొన్న సబ్ సెక్షన్-2 ప్రకారం దీనిని సెప్టెంబరు 1 నుంచి కేంద్రం అమల్లోకి తీసుకువచ్చింది.

దాచేందుకు కుదరదు!

- ఈ చట్టం ప్రకారం.. దేశంలోని వ్యాపార, వాణిజ్య సహా అన్ని సంస్థలు విదేశీయుల వివరాలను వెల్లడించాలి.
- హోటళ్లు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు.. ఇలా అన్ని సంస్థలు కూడా.. తమ వద్దకు వచ్చే విదేశీయుల వివరాలను దాచడానికి వీల్లేదు.
- ఇక, వీసాల గడువు తీరిపోయిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు ఈ చట్టం ఉపకరిస్తుంది.
- విమానాలు, నౌకలలో ప్రయాణించే విదేశీయుల వివరాలను కూడా ఆయా సంస్థల కంపెనీలు వెల్లడించాలి. విదేశీయులు తరచుగా పర్యటించే పర్యాటక ప్రాంతాలపై పూర్తి నియంత్రణ కేంద్రానికే ఉంటుంది.
- వలసలు, వీసా, పాస్‌పోర్టు, విదేశీయులు.. తదితర అంశాలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న నాలుగు వేర్వేరు చట్టాలను రద్దు చేశారు.

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌పై 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వినియోగాన్ని సవాలు చేస్తూ దాఖలయిన ప్రజా ప్రయోజన వ్యాజ్యా (పిల్)న్ని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా బంకుల్లో 20 శాతం ఇథనాల్‌ను కలిపిన పెట్రోల్ (ఈబీపీ-20)ని విక్రయిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొంటూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా ఈ పిల్‌ను దాఖలు చేశారు. 2023కు ముందు తయారు చేసిన బైకులు, కార్లు ఈబీపీ-20 వినియోగానికి అనువుగా లేవని తెలిపారు. ఈబీపీ-20 కారణంగా వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజిన్లు పాడవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల బంకుల్లో ఇథనాల్ రహిత సాధారణ పెట్రోలు విక్రయించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఆ వాదనను ఖండించారు. ఈబీపీ-20 కారణంగా చెరకు రైతులకు మేలు కలుగుతుందని చెప్పారు. పిటిషన్ దాఖలు చేసిన మల్హోత్రా పేరుకు మాత్రమే కక్షిదారు అని, ఆయన వెనుక లాబీ ఉందని తెలిపారు. ప్రభుత్వం అన్ని విషయాలను పరిశీలిస్తోందని చెప్పారు. దీనితో ఏకీభవించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం పిల్‌ను తిరస్కరించింది.

వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.51.50 తగ్గింపు

- వరుసగా ఆరోసారి దిగివచ్చిన ధర
- ఏటీఎఫ్ ధర 1.4 శాతం తగ్గింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌తోపాటు విమాన ఇంధనం ధర (ఏటీఎఫ్)ను ప్రభుత్వరంగ చమురు కంపెనీలు సోమవారం తగ్గించాయి. హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాటిలో వినియోగించే వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ (19 కిలోలు) ధరను కంపెనీలు రూ.51.50 మేర తగ్గించడంతో ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,580కు చేరుకుంది. తాజా తగ్గింపుతో వాణిజ్య ఎల్పీజీ రేట్లు వరుసగా ఆరోసారి తగ్గినట్టయింది. ఇంతకుముందు ఆగస్టు 1న ఈ సిలిండర్ ధర రూ.33.50 మేర తగ్గింది. ఏప్రిల్ నుంచి చూస్తే ఈ సిలిండర్ ధర మొత్తంగా రూ.223 మేర దిగివచ్చింది. ఇక గృహావసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధర మాత్రం యథాతథంగా ఉంది. కాగా ఏటీఎఫ్ ధరను చమురు కంపెనీలు 1.4 శాతం మేర తగ్గించాయి. దీంతో ఢిల్లీలో కిలో లీటరు ఏటీఎఫ్ ధర రూ.1,308.41 తగ్గి రూ.90,713.52కు చేరుకుంది. ఇంతకు ముందు వరుసగా రెండుసార్లు ఏటీఎఫ్ ధరలను కంపెనీలు పెంచాయి. భౌగోళిక రాజకీయ ఆందోళనలు, వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో అందుకనుగుణంగా దేశీయంగా ధరలు పెరిగాయి.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

అందర్నీ ఆకట్టుకుంటుంది



మౌళి తనుజ్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకుడు. ఆదిత్య హాసన్ నిర్మించారు. కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మాతలు బన్నీవాసు, వంశీ నందిపాటి ఈనెల 12న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా బన్నీవాసు మాట్లాడుతూ 'యూత్‌కి నచ్చే కంటెంట్, కుటుంబ ప్రేక్షకులను మెప్పించే మంచి వినోదం ఉన్న చిత్రమిది. ఎక్కడా అశ్లీలత ఉండదు. ప్రేమ, చదువు నేపథ్యంలో ఆసక్తికరంగా సాగుతుంది' అని అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ 'ఈ సినిమాను చూసిన వెంటనే ఇది థియేటర్‌లో బ్లాస్ట్ అవుతుందని అనిపించింది. యంగ్‌టీమ్ పనిచేసిన చిత్రమిది. వారి ఎనర్జీ, తపన చిత్రంలో కనిపిస్తుంది. మన చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఈటీవీ విన్ నిర్మించే చిత్రాలుంటాయి' అని చెప్పారు.

స్టైలిష్ లుక్!



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. మంగళవారం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ స్టైలిష్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'స్టైల్లో, స్వాగ్‌లో, బాక్సాఫీస్‌కు ఉస్తాద్ లాంటి పవన్‌కల్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గొప్ప ఫీస్ట్‌లా ఉంటుంది' అని మైత్రీ మూవీమేకర్స్ పేర్కొంది. 'నా హీరో, అన్న, స్ఫూర్తి.. ఒక్కగానొక్క పవన్‌కల్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను ఆయనను తెరపై ఎలా చూడాలనుకుంటున్నానో ఈ పోస్టర్ ద్వారా పరిచయం చేస్తున్నా' అని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. ఈ సినిమాలో పవన్ శక్తిమంతమైన పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

వరుస ప్రాజెక్టులు చేస్తా

అనుష్క

'మా ఇళ్లలో జరిగే పెళ్లిళ్లకు కూడా వెళ్లడం లేదు. అందరూ ఎప్పుడు కనిపిస్తావ్ అని అడుగుతున్నారు. ప్రస్తుతం మంచి కథలను వింటున్నాను. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తాను. అందరి ముందుకూ వస్తాను' అని అన్నారు అనుష్క శెట్టి. క్రిష్ దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'ఘాటి' ఈ నెల 5న విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె రానాతో ఫోన్‌లో మాట్లాడుతూ 'ఇదొక వయొలెంట్ మూవీ. ఈ కథ ఇప్పటి సమాజంలోని పరిస్థితులకు సరిగ్గా సరిపోతుంది. 'బాహుబలి', 'అరుంధతి' తర్వాత నా ఉత్తమ చిత్రాల వరుసలో 'ఘాటి' నిలుస్తుంది. చిత్ర నేపథ్యం, విజువల్స్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తాయి. క్రిష్ కథను నడిపించిన విధానం అద్భుతంగా ఉంటుంది' అని చెప్పారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'ఇటీవలె క్రిష్‌ను కలిశాను. 'ఘాటి' గురించి ఆయన చెప్పిన విషయాలు చాలా ఆసక్తికరంగా అనిపించాయి. ప్రీమియర్‌కి తప్పకుండా వస్తా' అని తెలిపారు.



థియేటర్లలోనే చూడాల్సిన సినిమా



తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో నటించిన 'మిరాయ్' చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో మంచు మనోజ్ పవర్‌ఫుల్ పాత్ర పోషించారు. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తేజ మాట్లాడుతూ 'యాక్షన్, ఫాంటసీ, డివోషన్, ఎమోషనల్ అంశాలు ఉన్న సినిమా ఇది. కచ్చితంగా థియేటర్‌లోనే చూడాల్సిన సినిమా 'మిరాయ్'. పీపుల్ మీడియా సంస్థలో నాకు ఇది రెండో సినిమా. మరిన్ని చిత్రాలు చేయాలని ఉంది.. 'మిరాయ్' అంటే హోప్ ఆఫ్ ఫ్యూచర్ అని అర్థం. దీనికి మరో మీనింగ్ కూడా ఉంది. అదేమిటో సినిమాలో చూసి మీరు కచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారు. దర్శకుడు కార్తీక్ విజన్ వల్లే ఈ సినిమా సాధ్యమైంది. ఆయన కథ చెప్పే విధానం ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు తేజ సమాధానాలు ఇస్తూ 'హనుమాన్ అంజనాద్రి అనే ఓ ఫాంటసీ ప్లేస్‌లో జరిగిన కథ. ఈ సినిమా కోసం థాయ్‌లాండ్ వెళ్లి 20 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. సినిమాలో మీరు చూసే స్టంట్స్ అన్నీ నేను స్వయంగా చేసినవే' అని చెప్పారు.

పదోన్నతుల్లో ఆరోగ్యశాఖ రికార్డు

» 600 మంది వైద్యులు.. వంద మందికిపైగా అధికారులకు ప్రమోషన్స్

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో 2024-25 సంవత్సరం పదోన్నతుల పండుగగా చెప్పుకోవచ్చు. ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈ ప్యానల్ ఇయర్‌లో దాదాపు 600 మంది వైద్యులు, మరో వంద మందికిపైగా అధికారులకు పదోన్నతులు లభించాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్(డీఎస్‌హెచ్), డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్), ఆయుష్ విభాగం, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఇలా ప్రతి విభాగంలో వైద్యులకు, సిబ్బందికి పదోన్నతులు లభించాయి. చివరికి 20 ఏళ్ల నుంచి పదోన్నతులకు నోచుకోని గ్రూప్-1 అధికారులకు కూడా డిప్యూటీ డైరెక్టర్ నుంచి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతులు లభించాయి. డ్రగ్స్ విభాగంలో కూడా ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లకు జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతులు కల్పించారు. డీఎంఈ చరిత్రలోనే 13 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అదనపు డైరెక్టర్లు(ఏడీ)గా పదోన్నతులు కల్పించారు. వీరితోపాటు డీఎంఈలో ఈ ఏడాది 217 మంది వైద్యులు పదోన్నతి పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్లు 96 మంది ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 108 మంది అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోట్ అయ్యారు. బోధన అనుభవం ఉన్న అసోసియేట్‌కు ప్రొఫెసర్లుగా తొలిసారి అవకాశం కల్పించిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికి దక్కుతుంది. తద్వారా 150 మందికిపైగా వైద్యులు లబ్ధి పొందారు. సీఎం చంద్రబాబు ఆమోదంతో వీరికి పదోన్నతులు లభించాయి. ఈ మినహాయింపు ఇవ్వక పోతే వీరందరికీ పదోన్నతులు రావాలంటే దాదాపు నాలుగేళ్ల సమయం పట్టేది. డీఎస్‌హెచ్‌లోనూ 321 మంది వైద్యులకు పదోన్నతులు కల్పించారు. వీరిలో 34 మంది సివిల్ సర్జన్ స్పెషలిస్టులు, 78 మంది డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్టులు, 109 మంది డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్‌గా పదోన్నతులు పొందారు. మరో 100 మంది డెంటల్ అసిస్టెంట్ సర్జన్ల నుంచి డిప్యూటీ డెంటల్ సర్జన్లుగా పదోన్నతి పొందారు. డీహెచ్‌లోనూ సీనియర్ వైద్యులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా, డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతులు లభించాయి. తద్వారా ఈ ఏడాది పదోన్నతుల్లో ఆరోగ్య శాఖ రికార్డు సృష్టించిందని చెప్పవచ్చు. గతంలో పదోన్నతులు, పోస్టింగ్స్ అంటే భారీగా పైరవీలు, ముడుపుల వ్యవహారం నడిచేది. ఈ ప్యానల్ ఇయర్‌లో అవేమీ లేవు. కేవలం అర్హతే ప్రామాణికంగా పారదర్శక వాతావరణంలో పదోన్నతులు కల్పించి, పోస్టింగ్స్ ఇచ్చారు. గతంలో పదోన్నతుల విషయంలో ఆలస్యం జరిగినట్లు ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో నిర్ణీత సమయంలో అర్హులైన వైద్యులందరికీ పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.

స్వచ్ఛతకు ప్రోత్సాహం!

» మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు స్వచ్ఛ అవార్డులు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా శానిటేషన్, పరిశుభ్రతను నిర్వహించే పలు శాఖలు, సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహించి.. 'స్వచ్ఛాంధ్ర అవార్డులు-2025' ప్రదానం చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు ఇవ్వాలని భావించింది. స్వచ్ఛాంధ్ర మిషన్‌లో చురుకుగా పనిచేసిన వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు, పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు, పరిశుభ్రతను అలవాటు చేసేందుకు ఈ అవార్డులు ఇవ్వనున్నారు. అక్టోబరు 2న ఈ పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ అవార్డుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ప్రకటించింది.

పింఛను సొమ్ము 2.13 లక్షలతో పరార్

» తూర్పుగోదావరి జిల్లా చంద్రేడు గ్రామంలో ఘటన

రంగంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పంచాల్సిన పింఛను సొమ్ము రూ.2.13 లక్షలతో సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పరారయ్యాడు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం చంద్రేడులో సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. చంద్రేడు గ్రామ సచివాలయానికి ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ నిమిత్తం ప్రభుత్వం రూ.14,03,000 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రంగంపేట ఆర్‌సీబీ బ్రాంచ్‌లోని పెన్షన్ ఖాతాలో జమ చేసింది. సచివాలయ సంక్షేమ, విద్యా సహాయకులు ఆగస్టు 30నే ఆ మొత్తాన్ని డ్రా చేసి పంపిణీకి బాధ్యులైన అధికారులకు అందజేశారు. అందులో రూ.2,13,500 వెటర్నరీ అసిస్టెంట్ జుత్తుక గణేశ్‌కు ఇచ్చి ఆయన వద్ద రశీదు తీసుకున్నారు. అయితే గణేశ్ సోమవారం విధులకు హాజరు కాకుండా, ఉదయం నుంచి పెన్షన్లు పంపిణీ చేయకుండా, సెల్‌ఫోన్ స్విచాఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో పింఛనుదార్లు ఆందోళనకు గురయ్యారు. ఎంపీడీవో వీవీ సాయిబాబు సంక్షేమ సహాయకులు, పంచాయతీ కార్యదర్శుల నివేదిక ఆధారంగా రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో గణేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. గణేశ్ గతంలో పనిచేసిన పెదపూడి మండలంలో కూడా ఇలాంటి అవకతవకలకు పాల్పడినట్టు సమాచారం ఉందని సాయిబాబు పేర్కొన్నారు. కాగా, చంద్రేడులో పెన్షన్ల పంపిణీకి అంతరాయం లేకుండా వెంటనే కొత్త పీడీవోను నియమించినట్టు ఆయన తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలతో గణేశ్‌ను సస్పెండ్ చేసినట్టు వివరించారు.

వైద్య విద్య ప్రవేశానికి '4 ఏళ్ల స్థానికత' తప్పనిసరి

» తెలంగాణ ప్రభుత్వ జీవో 33ను సమర్థించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు లైన్ క్లియరైంది. వైద్య విద్యలో ప్రవేశానికి 9 నుంచి 12వ తరగతి వరకు.. నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అంటూ రాష్ట్ర ప్రభుత్వం 2017లో జారీ చేసిన జీవో-33ని సుప్రీంకోర్టు సమర్థించింది. గత ఏడాది ఆ జీవోలో చేసిన సవరణను కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమోదించింది. ఆ జీవోను వ్యతిరేకిస్తూ.. హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్, మరో 160 మంది గతంలో హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.! దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత హైకోర్టు ధర్మాసనం విద్యార్థులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై తెలంగాణ సర్కారు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. గత నెల 5న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. సోమవారం 32 పేజీల తీర్పును వెలువరించింది. గత ఏడాది స్థానికత అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించి, సీట్లు పొందిన విద్యార్థులకు తమ తీర్పు వర్తించదని తెలిపింది. వైద్యవిద్యలో ప్రవేశాలకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ఈ అంశానికి సంబంధించిన అన్ని పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. స్థానికత విషయంలో 4క్యాటగిరీల ఉద్యోగుల పిల్లలకు మినహాయింపులను సూచించింది.

కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌దే ప్రధాన పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన వ్యక్తిగత దాడిని ఓర్చుకుంటూ వచ్చాను. ఇప్పుడు పార్టీ అధినేత కేసీఆర్‌పై సీబీఐ విచారణ అంటే కడుపుమండి వాస్తవాలు బయటపెడుతున్నా.. రేపటి నుంచి సోషల్‌మీడియా వేదికగా.. నాపై ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తే.. తోలుతీస్తా..' అని హెచ్చరించారు. మహోన్నత వ్యక్తిత్వం ఉన్న కేసీఆర్‌పై సీబీఐ విచారణ చేపట్టే పరిస్థితి రావడం వేదనకు గురిచేస్తోందన్నారు. 'హరీశ్‌రావు, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండా.. టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను గాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్.. ' అని తేల్చిచెప్పారు. ఇంకోవైపు.. కవిత వ్యాఖ్యలను కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమె తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయమనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందంటున్నారు. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లి మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టమని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు ఆయనకు సూచించారు.

సస్పెండ్ చేస్తే సొంత పార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే ఆమె అడుగులు ఎటు వైపు అన్న చర్చ మొదలైంది. అయితే మొదట్నుంచీ ఆమె స్పష్టతతోనే ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి తీపి కబురు

తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎఫ్‌వోఎస్ ప్లాంట్

- **నిజామాబాద్ సమీపంలో 2027 కల్లా నిర్మాణం పూర్తి**
- **బీఐఆర్ఏసీ సహకారంతో నిర్మిస్తున్న రివిలేషన్స్ బయోటెక్**
- **చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఎఫ్‌వోఎస్ వినియోగం**
- **ఏడాదికి 20 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం.. 700 మందికి ఉద్యోగావకాశాలు**

హైదరాబాద్/నిజామాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భారత బయో టెక్నాలజీ, ఆహార ప్రాసెసింగ్ రంగానికి ఊతమిచ్చేలా రివిలేషన్స్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణలోని నిజామాబాద్ సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రక్టో ఒలిగో శాకరాయిడ్స్(ఎఫ్‌వోఎస్) తయారీ యూనిట్ ఏర్పాటవుతోంది. సంవత్సరానికి 20 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ) ఆర్థిక సహాయం అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి విశేష సహకారం అందిస్తోంది. రివిలేషన్స్ బయోటెక్, బీఐఆర్ఏసీ ఇప్పటికే దీనికి సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిజామాబాద్ మెగా ఫుడ్ పార్క్‌లో నిర్మాణంలో ఉన్న ఈ యూనిట్ ఆగస్టు 2027 నాటికి పూర్తి కానుంది. దీని ద్వారా 200 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు, 500 మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టు భారత ప్రభుత్వ 'మేక్ ఇన్‌ఇండియా'లో భాగంగా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం మాత్రమే కాకుండా, భారత్‌ను ప్రపంచ స్థాయి ఎఫ్‌వోఎస్ ఎగుమతిదారుగా నిలపడం లక్ష్యంగా పెట్టుకుంది.

నిజామాబాదే ఎందుకు?

"భారతదేశం ప్రస్తుతం మధుమేహ వ్యాధి విజృంభణతో ఇబ్బంది పడుతోంది. చక్కెరకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయమైన ఎఫ్‌వోఎస్‌ను ఉపయోగించడం వల్ల ఈ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుంది. ఎఫ్‌వోఎస్ తయారీకి చక్కెర ఏకైక ప్రధాన ముడిపదార్థం. తెలంగాణలోని నిజామాబాద్ ఒక ప్రధాన చక్కెర ఉత్పత్తి కేంద్రం కావడంతో, ఇక్కడ ఎఫ్‌వోఎస్ ప్లాంట్ ఏర్పాటు కావడం ద్వారా రాష్ట్రంలోని చెరుకు సాగు దీర్ఘకాలిక స్థిరత్వానికి తోడ్పడుతుంది" అని రివిలేషన్స్ బయోటెక్ ప్రతినిధి పేర్కొన్నారు. ఎఫ్‌వోఎస్ ఒక సహజ ప్రీబయాటిక్. ఇది న్యూట్రాసూటికల్స్ ఫంక్షనల్ బేవరేజెస్ వంటి వాటిలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇది జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేస్తుందని శాస్త్రీయంగా రుజువైంది. రివిలేషన్స్ బయోటెక్ ఎన్నో సంవత్సరాల పాటు పరిశోధనలు చేసి వినూత్న పర్యావరణహితమైన తయారీ పద్ధతిని అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఎఫ్‌వోఎస్‌ను అత్యంత వేగంగా, పర్యావరణానికి అనుకూలంగా ఉత్పత్తి చేయడం సాధ్యమైంది. ఇప్పటికే సంస్థ స్వీట్ స్పాట్ అనే బ్రాండ్ పేరుతో చక్కెరకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా రిటైల్ వినియోగదారులకు ఎఫ్‌వోఎస్‌ను విడుదల చేసింది. ఈ ఉత్పత్తి ఆరోగ్యంపై దృష్టి పెట్టే వినియోగదారుల్లో మంచి ఆదరణ పొందింది. "ఈ యూనిట్ భారత బయోటెక్నాలజీ ప్రయాణంలో ఒక చారిత్రక మైలురాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఎఫ్‌వోఎస్ ప్లాంట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడం ద్వారా దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడమే కాకుండా, భారతదేశాన్ని ప్రపంచ న్యూట్రాస్యూటికల్ రంగంలో ప్రముఖ స్థానంలో నిలుపుతుంది." అని రివిలేషన్స్ బయోటెక్ ప్రతినిధి తెలిపారు.

సవాళ్లకు సై..



కొత్త కానిస్టేబుళ్లకు స్మార్ట్ శిక్షణ

- **నయా నేరాల కట్టడికి అధునాతన పోలీసింగ్**
- **త్వరలో డ్యూటీలోకి వస్తున్న ఆరువేల మంది**
- **సైబర్ కమాండోలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**
- **ఏఐపై అవగాహన.. నిపుణులతో క్లాసులు..**
- **నంబర్ వన్ ట్రైనింగ్**
- **పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో త్వరలో ప్రారంభం**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

లాఠీ పట్టుకో.. దొంగలను వెంబడించు.. అనేది పాత ధోరణి. డేటా సేకరించు.. నేరస్తుల ఆట కట్టించు.. అనేది కొత్త మార్గం. ఆధునిక నేరాల కట్టడికి ఆధునిక పోలీసింగ్‌కు పోలీస్ శాఖ సిద్ధమవుతోంది. ఫ్యూడల్ పోలీసింగ్‌కు టాటా చెప్పి హ్యూమన్ టచ్‌తో కూడిన కార్యచరణకు శ్రీకారం చుట్టనున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కటంటే ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా భర్తీ కాలేదు ఈ కారణంగా పోలీసు శాఖను మానవ వనరుల కొరత వేధిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తర్వాత పోలీసు కానిస్టేబుళ్లుగా 6,024 మంది కొత్తగా ఎంపికయ్యారు. సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టే సైబర్ కమాండోల్లా వీరందరినీ తీర్చిదిద్దబోతున్నారు. ఇటీవలి ఫలితాల్లో ట్రైనీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన యువకులకు ఈ నెలలో శిక్షణ మొదలు కాబోతోంది. ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి అయింది. పొరుగు రాష్ట్రాల్లో విద్యాభ్యాసం చేసిన వారి సర్టిఫికెట్ల పరిశీలనకు ఆయా రాష్ట్రాలకు పంపిన ఏపీ పోలీసు శాఖ, మరో వైపు శిక్షణకు రంగం సిద్ధం చేస్తోంది. విజయనగరం, ఒంగోలు, తిరుపతి, అనంతపురంలోని పోలీసు శిక్షణా కళాశాలలతో(పీటీసీ) పాటు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని డీటీసీల్లో మూడున్నర వేల మంది సివిల్ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం కాబోతోంది. మరోవైపు 2,500మంది ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు బెటాలియన్లలో ట్రైనింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే ఆరు వేల మందిలో 810మంది బీటెక్, ఎంటెక్, బీసీఏ లాంటి టెక్నికల్ కోర్సులు చేసిన విద్యావంతులున్నారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారిలో అత్యధికంగా డిగ్రీ పట్టభద్రులు 4,051మంది ఉండగా ఎంబీఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎల్ఎల్‌బీ, ఎంఏ లాంటి ఉన్నత విద్య చదివిన వాళ్లు కూడా ఉన్నారు. ఇలాంటి మానవ వనరుల్ని సద్వినియోగం చేసుకోవడంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఇటీవల ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించారు. సమాజాన్ని భయపెడుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలను ఎదుర్కునేలా పోలీసుల్ని సంసిద్ధం చేయడం ఎలా? అనే అంశంపై సమీక్షించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అంది పుచ్చుకున్న అధునాతన పద్ధతులు, మన రాష్ట్రంలో అమలు చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులపైనా సమీక్షించారు. దేశంలోనే నెంబర్ వన్ పోలీస్‌గా ఏపీని నిలబెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు లక్ష్యాలను నిర్దేశించారు. ఇందులో ప్రధానమైన సైబర్ నేరాలు, ఫోరెన్సిక్, క్రిమినాలజీ వంటి వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై ఐజీలు ఆకే రవికృష్ణ(సైబర్), పాలరాజు(ఫోరెన్సిక్), డీఐజీ సత్య యేసుబాబు(ట్రైనింగ్) కసరత్తు చేస్తున్నారు.

ఈ-క్లాసులు.. స్టూడియో సెమినార్లు..

కానిస్టేబుల్ శిక్షణ నాలుగు పీటీసీలతోపాటు జిల్లా కేంద్రాల్లోని డీటీసీల్లో తొమ్మిది నెలల పాటు జరుగుతుంది. శారీరకంగా, మానసికంగా సిద్ధం చేసి చట్టాల అమలుపై అవగాహన కల్పిస్తారు. క్రమశిక్షణతో పాటు నేర దర్యాప్తులో మెలకువలు, విధి నిర్వహణలో అప్రమత్తత, బాధితులతో ప్రవర్తించే తీరు తదితర అంశాలపై పోలీసు ట్రైనింగ్ కాలేజీల్లోని డీఎస్పీ, సీఐ ర్యాంకు అధికారులు తర్ఫీదు ఇస్తారు. అయితే ఇదంతా మూస పద్ధతి అంటూ పెదవి విరుస్తోన్న వారికి సమాధానంగా అధునాతన పద్ధతుల్లో పోలీసు శిక్షణ ప్రారంభం కాబోతోంది. మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలోని టెక్ టవర్‌లో ఒక ప్రత్యేక స్టూడియోను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. అక్కడికి సైబర్ నిపుణులతో పాటు ఫోరెన్సిక్, ఇన్వెస్టిగేషన్, ఆర్థిక మోసాలు, మహిళలపై అఘాయిత్యాలు.. తదితర నేరాలపై అవగాహన ఉన్న నిపుణులతో క్లాసులు చెప్పిస్తారు. శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు టెక్ టవర్ స్టూడియో ద్వారా ఆన్‌లైన్ లింక్ పంపి ఉదయం నుంచి సాయంత్రం మధ్యలో ఏ సమయంలో ఏ క్లాసు ఉంటుందో ముందు రోజు షెడ్యూల్ పంపుతారు. ఐపీసీ స్థానంలో వచ్చిన బీఎన్ఎస్.. సీఆర్‌పీసీకి ప్రత్యామ్నాయంగా వచ్చిన బీఎన్ఎస్ఎస్.. ఎవిడెన్స్ యాక్ట్ బదులు తెచ్చిన భారతీయ సాక్ష్య అభియాన్‌ను కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన వాటిపై కూలంకషంగా వివరిస్తారు. ప్రధానంగా పోలీసులకు సవాలు విసురుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై ప్రతి పోలీసుకు అవగాహన పెంచడమే లక్ష్యమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ప్రతి పోలీసుకూ 'ఐ గాట్ కర్మయోగి'

అధికారులు, సిబ్బంది తమ పనితీరు మెరుగు పరుచుకోవడానికి కేంద్ర హోంశాఖ 'ఐ గాట్ కర్మయోగి' యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేసే ఉద్యోగులు ఎప్పటికప్పుడు తమ పనితీరును మెరుగు పరుచుకోవడానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. ప్రతి పోలీసు తమ యాండ్రాయిడ్ మొబైల్‌లో దీనిని ఇన్‌స్టాల్ చేసుకునేలా పోలీసు శాఖ ప్రోత్సహిస్తోంది. సమకాలీన సవాళ్లను ఎప్పటికప్పుడు ఎదుర్కొనేలా ఇందులో నిపుణులు చెప్పే క్లాసులు విధుల్లో ఉన్న పోలీసులు కుదిరినప్పుడల్లా వినొచ్చు. తమకు దేనిపై అవగాహన లేదనే అంశాన్ని కూడా ఎంపిక చేసుకుని చూసుకోవచ్చు. డిజిటల్ ఫోరెన్సిక్, క్రిమినాలజీ, సైబర్ నేరాలు తదితర సవాళ్లను అధిగమించేందుకు కర్మయోగి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పోలీసు శిక్షణ విభాగం డీఐజీ సత్య యేసుబాబు తెలిపారు.

ఆధునిక యుగం వైపు ఏపీ పోలీసింగ్: డీజీపీ



"కాలంతో పాటు నేరాల్లోనూ సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు ప్రతి పోలీసును తీర్చిదిద్దడమే పోలీసు శాఖ లక్ష్యం.. సంప్రదాయ పోలీసింగ్‌తో పాటు ఆధునిక యుగం వైపు ఏపీ పోలీసింగ్‌ను తీసుకెళ్లబోతున్నాం..' అని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా అన్నారు. ఒకప్పుడు మావోయిస్టు సమస్యను ఎదుర్కోవడానికి గ్రేహౌండ్స్ ఏర్పాటైందని, ఇప్పుడు సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు సవాల్ విసురుతున్నాయని తెలిపారు. "సైబర్ పోలీసు కమాండోలను తయారు చేస్తున్నాం. నిరంతర శిక్షణ ఇస్తాం. మరో వైపు ట్రైనీ కానిస్టేబుల్లో 810మంది బీటెక్, ఎంటెక్ చదివిన వారున్నారు.. వారిని సైబర్ కమాండోలుగా మలుస్తాం. ఏఐ పోలీసింగ్‌ను అందిపుచ్చుకునేలా సిద్ధం చేస్తాం. సంప్రదాయ పోలీసింగ్‌తో పాటు బ్లాక్ చైన్ టెక్నాలజీని కూడా నేర్పిస్తాం" అని వివరించారు. నేరాల కట్టడికి ఇప్పటికే రాష్ట్రంలో లక్షకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రతి పోలీసు స్టేషన్‌కూ డ్రోను ఇవ్వబోతున్నామని తెలిపారు. "ఐదు జిల్లాల్లో ఏఐ పోలీసింగ్ రాబోతోంది.. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ను బలోపేతం చేశాం.. మహిళలపై నేరాలకు పాల్పడిన వారు జీవిత కాలం జైల్లో గడిపేలా యావజ్జీవ శిక్షలు పడుతున్నాయి. అన్ని విభాగాలను బలోపేతం చేసి దేశంలో ఏపీ పోలీసు జెండాను మొదటి స్థానంలో ఎగుర వేయాలనే ప్రణాళికతో పని చేస్తున్నాం." అని గుప్తా వివరించారు.

నేటి నుంచి తురకపాలెంలో వైద్యశిబిరాలు

15 రోజులపాటు నిర్వహణ..

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరు జిల్లా తురకపాలెంలో ప్రబలిన జ్వరాల కట్టడికి జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇక్కడ ప్రమాదకర మెలియోయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో... గ్రామంలో మంగళవారం నుంచి 15 రోజులపాటు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ఫీవర్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం నుంచి 15 రోజుల పాటు రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ వైద్య శిబిరాలు అందుబాటులో ఉంటాయి. జ్వరం, ఆయాసం, దగ్గు ఉన్న వారు ఈ శిబిరాలకు నాగలక్ష్మి సూచించారు. ఈ జ్వరాలకు కారణమయ్యే బర్కోల్డేరియా సూడోమల్లీ బ్యాక్టీరియా మట్టిలో, నీటిలోనూ ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాయిల్, వాటర్ శాంపిల్స్ సేకరణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇక, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ సబిత, డాక్టర్ తేజ ఆధ్వర్యంలో వైద్య బృందం తురక పాలెలో చేసిన సర్వేలో జూలైలో 20 మంది, ఆగస్టులో 20 మంది జ్వరాలతో మృతి చెందినట్లు తేలింది.

వసుధ ఫార్మా డైరెక్టర్ ఆత్మహత్య

- **మార్చిలో చీఫ్ గ్లోబల్ బిజినెస్ ఆఫీసర్, డైరెక్టర్ అమెరికాలో అరెస్టు**
- **అక్రమంగా ఫెంటానిల్ ఉత్పత్తి.. వందల మంది మరణం?**

విశాఖపట్నం/ఉక్కునగరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో గల వసుధ ఫార్మా కెమికల్స్ డైరెక్టర్ (వర్క్స్) మంతెన వెంకట సూర్య నాగవర ప్రసాదరాజు (61) ఆత్మహత్య చేసుకున్నారు. వెయ్యి కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన కంపెనీ డైరెక్టర్ పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడడం కలకలం రేగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ పోలీసుల కథనం మేరకు.. కుటుంబంతో కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న వరప్రసాదరాజు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు.. పరిచయస్తులను వాకబు చేశారు. అయినా ఆచూకీ లభించ లేదు. ఆదివారం ఉదయం ఆయన సెల్‌కు బంధువైన ఇందుకూరి సత్యనారాయణ కాల్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తి లిఫ్ట్ చేసి.. వరప్రసాదరాజు ప్రగతి మైదానంలో పడిపోయి ఉన్నట్టు చెప్పడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందారు. ఆయన పక్కన పురుగుల మందు డబ్బా, వాటర్ బాటిల్ ఉన్నాయి. స్టీల్‌ప్లాంటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు ముందు ఆయన లేఖ రాశారా? అంటే పోలీసులు సమాధానం చెప్పడం లేదు. ఇతర వివరాలు చెప్పడానికి కూడా నిరాకరిస్తున్నారు.






అనకాపల్లి జిల్లా పరవాడలోని వసుధ ఫార్మా కంపెనీ (ఇన్‌సెట్)మంతెన సూర్య నాగవర ప్రసాదరాజు

కంపెనీ డైరెక్టర్ అమెరికాలో అరెస్టు

వసుధ ఫార్మా కెమికల్స్ కంపెనీ 1994లో ఏర్పాటైంది. దీనికి ఎంవీ రామరాజు సీఎండీగా వ్యవహరిస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న వరప్రసాదరాజు బల్క్ డ్రగ్ తయారీ రంగంలో చాలాకాలంగా పనిచేస్తున్నారు. 2007 నుంచి వసుధలో పనిచేస్తున్నట్టు సమాచారం. కంపెనీకి చెందిన ప్రాజెక్టు వర్క్‌లన్నీ ఆయన సమన్వయం చేస్తుంటారు. కంపెనీ అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో ఉండగా, ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని కావూరి హిల్స్‌లో ఉంది. ఈ కంపెనీ 'ఫెంటానిల్' అనే మందును తయారుచేసి అమెరికా, తదితర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తోంది. దానిని నొప్పి నివారణకు ఉపయోగిస్తారు. అయితే ఫెంటానిల్ వినియోగంతో అమెరికాలో 12 నెలల కాలంలో వందల మంది మరణించారనేది ప్రధాన ఆరోపణ. దీనిపై అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ స్ట్రింగ్ ఆపరేషన్ నిర్వహించి ఈ డ్రగ్ వసుధ ఫార్మా నుంచి వస్తోందని గుర్తించింది. దీంతో ఈ సంస్థకు చెందిన టాప్ ఎగ్జిక్యూటివ్, చీఫ్ గ్లోబల్ బిజినెస్ ఆఫీసర్ తన్వీర్ అహ్మద్ మొహమద్ హుస్సేన్ పార్కర్ (63), మార్కెటింగ్ డైరెక్టర్ మంతెన వెంకట నాగ మధుసూదనరాజులను ఈ ఏడాది మార్చి 20న న్యూయార్క్‌లో అరెస్టు చేశారు. వసుధ ఫార్మా టర్నోవర్ ఏడాదికి రూ.1,150 కోట్లు. సుమారుగా 450 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కంపెనీ నిధులను ఈ సంస్థ అక్రమంగా రియల్ ఎస్టేట్ రంగంలోకి మళ్లించిందనే అనుమానాలతో ఆదాయ పన్ను శాఖాధికారులు 2023 మార్చి 20న ఏకకాలంలో 50 చోట్ల సోదాలు నిర్వహించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు విశాఖలో వర్క్ డైరెక్టర్ వెంకట సూర్య నాగ వరప్రసాదరాజు ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు 2,977 కోట్లు



- **నికర జీఎస్టీలో 13.82 శాతం పెరుగుదల**
- **21 శాతం పెరిగిన స్థూల జీఎస్టీ వసూళ్లు**
- **పెట్రో ఉత్పత్తుల్లోనూ 9 శాతం అధికం**
- **భారీగా పెరిగిన వృత్తి పన్ను వసూళ్లు**
- **వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ వెల్లడి**

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆగస్టులో జీఎస్టీ నికర వసూళ్లు రూ. 2,977 కోట్లకు చేరాయని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ తెలిపారు. గత నెలలో జీఎస్టీ స్థూల వసూళ్లు రూ. 3,989 కోట్లకు చేరుకున్నాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వరుసగా 5 నెలల పాటు నికర, స్థూల జీఎస్టీలు పెరుగుతూ వచ్చాయన్నారు. 2024 ఆగస్టుతో పోలిస్తే ఈఏడాది ఆగస్టులో నికర జీఎస్టీ వసూళ్లు 13.82 శాతం, స్థూల జీఎస్టీ వసూళ్లు 21 శాతానికి పైగా పెరిగాయి. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం నెలవారీ వసూళ్లలో ఇదే అత్యధికం. 2025 ఆగస్టులో ఎస్‌జీఎస్‌టీ (రాష్ట్ర జీఎస్టీ) రూ. 1,364 కోట్లకు చేరింది. గత ఏడాది ఆగస్టులో వసూలైన ఎస్‌జీఎస్టీ కంటే ఇది 13.82 శాతం అధికం. ఈ ఆగస్టులో ఐజీఎస్టీ రూపంలో రూ. 1,613 కోట్లు వచ్చాయి. గత ఆగస్టు కంటే ఇది 3.76 శాతం ఎక్కువ. ఇక పెట్రో అమ్మకాల్లో పెరుగుదల స్థిరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది ఆగస్టులో పెట్రో ఉత్పత్తుల నుంచి రూ. 1,389 కోట్ల ఆదాయం వచ్చిందని బాబు.ఎ తెలిపారు. గత ఆగస్టు కంటే ఇది 9 శాతం అధికమని చెప్పారు. వృత్తి పన్ను వసూళ్లు కూడా ఈ ఆగస్టులో 42.3 శాతం పెరిగాయన్నారు.


అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో యడబల్లి సుమిత్రమ్మకు పింఛను అందజేస్తున్న సీఎం చంద్రబాబు


పెన్షన్ పంపిణీకి ములక్కాయలపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు నమస్కరిస్తున్న వృద్ధురాలు


రాజంపేట మండలం బోయనపల్లెలోని దోభీ ఘాట్ వద్ద రజకులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


రాజంపేటలో సీఎం చంద్రబాబుకు హారతులు ఇస్తున్న మహిళలు

విమర్శలకు భయపడితే..

అక్కడే ఆగిపోతాం

కొత్తగా ఆలోచిస్తేనే ఉత్తమ ఫలితాలు: చంద్రబాబు

> ఏ విషయంలోనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తపనతో పనిచేయాలి. అప్పుడు మార్పు కచ్చితంగా వస్తుంది. వినూత్నంగా ఆలోచనలు చేయాలి.. రొటీన్‌కు భిన్నంగా పనిచేస్తే ఫలితాలు కూడా అద్భుతంగా ఉంటాయి.
>
> - సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గతాన్ని గుర్తుపెట్టుకుంటూ.. ఆ స్ఫూర్తితో భవిష్యత్‌కు ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొత్తగా ఆలోచిస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని, తన రాజకీయ జీవితంలో దానినే ఓ విధానంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విమర్శలకు భయపడి సంస్కరణలకు దూరంగా ఉండిపోకూడదని, భయపడితే అక్కడే ఆగిపోతామని స్పష్టంచేశారు. తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయానికి తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిసారి సీఎంగా బాధ్యతలు తీసుకున్న సమయంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయని, వాటిని ఎదుర్కొని దృఢ నిర్ణయాలతో పాలన సాగించానని చెప్పారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇచ్చానని, విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చానని తెలిపారు. 'నేను సీఎం అయిన కొత్తలో రంగారెడ్డి జిల్లాలో 10 ఉన్నత పాఠశాలలు కూడా లేవు. అలాంటి చోట 240 ఇంజనీరింగ్ కాలేజీలు తీసుకొచ్చాం. అప్పట్లో రంగారెడ్డి అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉండేది, ఇప్పుడు సుసంపన్న ప్రాంతంగా మారింది. ఒకప్పుడు హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో భూములు ఇస్తామంటే కంపెనీలు ముందుకొచ్చేవి కావు. వారిని ఒప్పించి, మౌలిక సదుపాయాలు కల్పించి సంస్థలను ఏర్పాటు చేశాం. హైటెక్స్ నాక్ వంటి సంస్థలను తెచ్చాం. హైటెక్స్ దేశంలోనే పెద్ద కన్వెన్షన్ సెంటర్‌గా నిలిచింది' అని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో అత్యంత కఠినంగా ఉన్నామని, సీమలో గానీ, హైదరాబాద్ సిటీలో గానీ అలా వ్యవహరించబట్టే మార్పు తీసుకురాగలిగామన్నారు.

పేరున్న ప్రముఖులను తీసుకొచ్చి..

ఏదైనా కార్యక్రమం తలపెట్టినప్పుడు జాతీయస్థాయిలో మంచి పేరు ఉన్న ప్రముఖులను తీసుకొచ్చి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చామని చంద్రబాబు తెలిపారు. నీరు-మీరు, పచ్చదనం-పరిశుభ్రత వంటి కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లేందుకు వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్ వంటి వాళ్లను తీసుకొచ్చి ప్రచారం చేయించామన్నారు. ఇంకుడు గుంతలు వంటి కార్యక్రమాలకు అధికప్రాధాన్యం ఇచ్చామని, ఇవి సత్ఫలితాలిచ్చాయన్నారు. 'అనంతపురం జిల్లాలో పదేళ్లలో 8 ఏళ్లు కరువు ఉండేది. రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. దీంతో నాడు ఇన్‌పుట్ సబ్సిడీ పెట్టాం. తొలిసారి ఈ విధానం తెచ్చింది మనమే. మహిళా శక్తిని సమర్థంగా వినియోగించుకోవాలన్న సంకల్పంతో పని చేశాం.' అని చెప్పారు.

సత్యసాయిబాబా కోరితే..

'పుట్టపర్తి సత్యసాయిబాబా ఒకసారి నన్ను పిలిచి.. అందరినీ పిలిచినట్లే నన్నూ బంగారూ అని పిలిచి.. పుట్టపర్తి చుట్టుపక్కల తాగునీటి సమస్య గురించి మాట్లాడారు. తానే తాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తానని.. ప్రభుత్వం వాటి నిర్వహణ బాధ్యత చూడాలని కోరారు. నేను సరేనన్నాను.' అని చంద్రబాబు వివరించారు.

కులవృత్తులకు చేయూత..

ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవాళ్లమని, ఆదరణ వంటి పథకాలతో ఎంతో చేయూతనిచ్చామని సీఎం తెలిపారు. 'నేడు కులవృత్తుల్లో మార్పులు వచ్చాయి. వాటికి అనుగుణంగా ఆయా వర్గాలకు చేయూతనివ్వాలి. గతంలో సక్సెస్ అయిన పాలసీలను అధ్యయనం చేసి, నేటి అవసరాలకు అనుగుణంగా మార్చాలి' అని సూచించారు. ఆయన్ను కలిసినవారిలో మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్య ప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్, డీజీపీ గుప్తా, పలువురు ఐఏఎస్‌లు ఉన్నారు.

దమ్ముంటే సభకు రండి

(మొదటి పేజీ తరువాయి)

రూ.15 వేలు వికలాంగ పింఛను అందజేశారు. తర్వాత బోయనపల్లెలో రజకులతో మాట్లాడారు. అనంతరం తాళ్లపాకలో ఏర్పాటుచేసిన ప్రజావేదికలో మాట్లాడారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ముచ్చటించారు. కార్యకర్తల సమావేశంలో, తర్వాత బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో ఒక ఫేక్ పార్టీ ఉందని.. అవినీతితో పేపర్, టీవీ పెట్టుకుని అన్నీ తప్పులే రాస్తున్నారని మండిపడ్డారు. 'పోలవరం మేం కడితే దానిని కూలుస్తారు.. ప్రజారాజధాని అమరావతి ఉండాలని మనం ఆకాంక్షిస్తే అమరావతిని ఎడారి చేశారు.. మనం రోడ్లు వేస్తే.. రోడ్లన్నీ గుంతలు పెట్టారు.. అలాంటి పార్టీకి నేను సవాల్ విసురుతున్నా.. అసెంబ్లీకి రండి.. అసెంబ్లీలో చర్చిద్దాం.. అసెంబ్లీలో సమాధానం చెప్పే ధైర్యం సత్తా మాకుంది. మీరు చేసిన తప్పుడు పనులు.. ఫేక్ మీడియాలో రాసే తప్పుడు కథనాలకు మేం సమాధానం చెప్పాలా..' అని నిలదీశారు. రానున్న ఎన్నికల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వమే ఏర్పడుతుందని చెప్పారు. పులివెందులలో కూడా కూటమి గెలుస్తుందన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

అప్పు చేసి బాగుపడిన వాళ్లు ఎవరైనా ఉన్నారా?

గత ప్రభుత్వం అప్పులు చేసి ప్రజలను మోసం చేసింది. ఎక్కడైనా అప్పులు చేసిన కుటుంబం బాగుపడిందా? అందుకే ఆదాయాన్ని పెంచి.. అభివృద్ధి చేసి అందులో పేదవాడిని ఆదుకుంటున్నాను. గతంలో హైదరాబాద్‌లో నేను ఐటీ అంటే అందరూ ఎగతాళి చేశారు. ఈ రోజు చూస్తే నేను ప్రారంభించిన ఐటీ ప్రపంచంలో తెలుగువారికి గుర్తింపు తెస్తోంది.. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా అక్కడ తెలుగులో మాట్లాడితే వంద మంది చేరతారు. తెలుగు మాట్లాడే వారు అన్ని దేశాలకూ వెళ్తున్నారు. 30 ఏళ్లలో హైదరాబాద్ విశ్వనగరంగా తయారైంది.

భయం నుంచి స్వేచ్ఛ..

2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోనూ విధ్వంసం జరిగింది. ప్రజలు భయం భయంగా బతికారు. ఐదేళ్లూ వారి ముఖాల్లో నవ్వులు లేవు. ఏమీ మాట్లాడలేని పరిస్థితి. ఈ తరుణంలో నేను, పవన్ కల్యాణ్ కలిసి పోటీ చేయాలనుకున్నాం. బీజేపీ కూడా ముందుకు వచ్చింది. ముగ్గురం 94 శాతం స్ట్రైక్ రేట్‌తో.. ఎప్పుడూ లేనంత మెజారిటీతో గెలిచాం ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. భయం లేకుండా మాట్లాడగలుగుతున్నారు. ఎమ్మెల్యేలు తప్పుచేసినా నిలదీయగలుగుతున్నారు. ఇదీ మేం కల్పించిన స్వేచ్ఛ. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొట్టాలి. మంచి ప్రభుత్వానికి అండగా నిలబడాలి. గత ఏడాది విజయం మన సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతోంది. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి అనేక సంస్కరణలకు నాంది పలికారు. నేను మొదటి నుంచీ సంస్కరణలు అమలు చేశాను. దేశం అభివృద్ధి కావాలి.. మనం కూడా దేశంలో ఒక భాగం. టీడీపీ ఎప్పుడూ ప్రజల కోసమే అధికారాన్ని ఉపయోగిస్తుంది. ఆ రోజుల్లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేశారు. నేను సీఎం అయ్యాక.. నాడు యునైటెడ్ ఫ్రంట్, నేడు ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్నాను.


రాజంపేట టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్‌మోహన్ రాజును అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

జీవితానికి ఇంకేం కావాలి..?

గతంలో బావులు, వాగులు, వంకలు వద్దకు రజకులు వెళ్లి దుస్తులు ఉతికి తీసుకొచ్చేవారు. వారి కష్టాలను చూసి.. ఊళ్ల మధ్యలో దోబీ ఘాట్లను కట్టి బోర్లు వేయించాం. ఇప్పుడు దోబీఘాట్లలో వృద్ధ రజకులు నన్ను చూసి 20 ఏళ్ల క్రితం మీరే కట్టించారు సార్ అని చెబితే నాకెంతో ఆనందంగా ఉంది. ఒకచోట రజకుడు.. ఇస్త్రీ పెట్టె మీరే ఇచ్చారు సార్ అని చెప్పడం చూస్తే.. జీవితంలో ఇంకేం కావాలని అనిపించింది. టీడీపీ, ఎన్డీఏ బీసీలకు అన్ని విధాలా న్యాయం చేస్తున్నాయి. సమైక్య రాష్ట్రంలో ఆదరణ-1, ఆదరణ-2 పథకాలు ప్రవేశపెట్టాను.

రాబోయే రోజుల్లో సంజీవని ప్రాజెక్టు

ఆరోగ్య, ఆనంద సమాజం కోసం ప్రయత్నిస్తున్నాను. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోయే రోజుల్లో సంజీవని అనే ప్రాజెక్టు తీసుకొస్తున్నాను. ఇది వినూత్నమైన ప్రాజెక్టు. టెక్నాలజీ సాయంతో విజయవంతమవుతుంది. పేదవాడి ఆరోగ్యం కాపాడే విధంగా.. ఏ మందు అవసరమో ఆ మందు తీసుకొస్తాం. ఎక్కువ బియ్యం తినడం వల్ల కార్బోహైడ్రేట్స్ పెరిగి బీపీ, షుగర్ వస్తున్నాయి. భవిష్యత్‌లో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండడానికి సంజీవని ఎంతో ఉపయోగపడుతుంది. అంతకుముందు మధ్యాహ్నం 12.20 గంటలకు హెలికాప్టర్లో రాజంపేటలోని హెలిప్యాడ్ వద్ద సీఎం దిగారు. జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, షాజహాన్‌బాషా తదితరులు స్వాగతం పలికారు.

14 ఏళ్లుగా మంచంలోనే..!

రాజంపేట మండలం ములక్కాయలపల్లెలో సుమారు 14 ఏళ్లుగా మంచంలోనే జీవనం సాగిస్తున్న యడబల్లి సుమిత్రమ్మ(54)కు ముఖ్యమంత్రి స్వయంగా రూ.15 వేలు దివ్యాంగ పింఛనుగా అందజేశారు. ఆమె అనారోగ్య సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె భర్త వెంకటేశ్వర్‌రాజుతో మాట్లాడారు. తాను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నానని.. భార్య అనారోగ్యం పాలై మంచానికే పరిమితమవడంతో అష్టకష్టాలు పడుతున్నామని రాజు చెప్పాడు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. అనంతరం బోయనపల్లె గ్రామంలో దోబీఘాట్‌కు చేరుకుని రజకులతో మాట్లాడారు. టి.ఆదిలక్ష్మి, బి.లక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి, హరిప్రసాద్, జయరాం, నరసింహులు, పెంచలయ్య, సంటయ్య తదితరులతో ఆప్యాయంగా మాట్లాడారు. వృత్తి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బోయనపల్లె ప్రజలు ఆయనకు మంగళ హారతులు పడుతూ నీరాజనాలు పలికారు.

ఎరువుల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం

- విజిలెన్స్ తనిఖీల్లో భారీగా బయట పడ్డ నిల్వలు
- 2,845 టన్నులు స్వాధీనం.. 199 కేసులు నమోదు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల అక్రమ విక్రయాలపై విజిలెన్స్ బృందాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. ఎక్కడా అక్రమ విక్రయాలు జరగకూడదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఆ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున దాడులు నిర్వహిస్తున్నాయి. తాజాగా విజిలెన్స్ సోదాల్లో భారీగా ఎరువుల అక్రమ నిల్వలు, విక్రయాలు బయటపడ్డాయి. ఆగస్టు 23-31 మధ్య 286 విజిలెన్స్ బృందాలు 598 ఎరువుల దుకాణాల్లో సోదాలు చేశాయి. ఈ సందర్భంగా అక్రమంగా విక్రయిస్తున్న రూ. 1.83 కోట్ల విలువైన 934.19 మెట్రిక్ టన్నుల నిల్వల్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. నిత్యావసర వస్తువుల చట్టంలోని సెక్షన్ 6ఏ కింద 67 కేసులు నమోదు చేశారు. అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 4.29 కోట్ల విలువైన 1,911 టన్నుల ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దీనికి సంబంధించి 124 కేసులు నమోదు చేశారు. నిబంధనలు అతిక్రమించిన మరో 8 దుకాణాల యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టారు. మొత్తం 2,845 టన్నుల ఎరువుల్ని స్వాధీనం చేసుకుని, 199 కేసులు నమోదు చేశారు. ఎరువుల విక్రయాలపై సోమవారం రాత్రి ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రైతుల్ని ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించే ఎరువుల దుకాణాదారులు, డీలర్లను ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. అన్నదాతలకు ఎక్కడైనా ఎరువులు, పురుగు మందుల కొరత రానీయొద్దని నిర్దేశించారు.

కాకినాడ పోర్టుకు 40 వేల టన్నుల యూరియా

- ఇండోనేషియా నుంచి భారీ నౌకలో రాక.. 2 రోజుల్లో పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టుకు సోమవారం 40వేల టన్నుల యూరియా వచ్చింది. ఇండోనేషియా నుంచి భారీ నౌకలో తీసుకొచ్చారు. రాష్ట్రంలో యూరియా కొరతగా ఉన్న నేపథ్యంలో ఇండోనేషియా నుంచి ప్రత్యేకంగా యూరియాను దిగుమతి చేసుకున్నారు. ఖరీఫ్‌లో ప్రతి ఏటా ఇతర దేశాల నుంచి యూరియా దిగుమతి అవుతుంది. ఈ ఖరీఫ్‌లో భారీవర్షాల వల్ల పంటలు ముంపునకు గురయ్యాయి. దీంతో యూరియా అధికంగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ యూరియాను మరో రెండురోజుల్లో ఏపీతోపాటు ఇతర రాష్ట్రాలకు కేటాయించే అవకాశాలున్నట్లు సీపోర్టు అధికారులు వెల్లడించారు. కేటాయింపుల అనంతరం యూరియాను ఆయా జిల్లాలకు ప్రత్యేక రైల్వే ర్యాక్‌లు, లారీల ద్వారా తరలిస్తారు.

రాష్ట్రానికి టోక్యో వర్సిటీ బృందం

- భారత్‌లో క్యాంపస్ ఏర్పాటుకు ప్రయత్నాలు.. నేడు అమరావతికి

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత టోక్యో యూనివర్సిటీని రాష్ట్రానికి తెచ్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. సోమవారం ఆ విశ్వవిద్యాలయం బృందం విజయవాడ వచ్చింది. ఉన్నత విద్య, ఐటీ, సీఆర్‌డీఏ శాఖల అధికారులు వారితో ప్రాథమికంగా చర్చించారు. తమ అవసరాలను బృందం స్థానిక అధికారులకు వివరించింది. అమరావతిలో ఉన్న అవకాశాలను రాష్ట్ర అధికారులు ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. మంగళవారం అమరావతిలో ఆ బృందానికి భూమిని చూపించనున్నారు. ఇక్కడ కల్పించబోయే మౌలిక సదుపాయాలను అధికారులు వివరిస్తారు. అనంతరం సీఎం చంద్రబాబుతో ఆ బృందం భేటీ అవుతుంది. ఈ చర్చల ఆధారంగా క్యాంపస్ ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటారు. అయితే ఈ వర్సిటీ ప్రాంగణాన్ని ఎలాగైనా రాష్ట్రానికి తీసుకురావాలని అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. టోక్యో వర్సిటీకి జపాన్‌లో తప్ప ప్రపంచంలో ఎక్కడా క్యాంపస్‌లు లేవు. మొదటిసారి ఇతర దేశాల్లో ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని ఆ దేశం నిర్ణయించింది. అందులో భాగంగా భారత్‌లో వర్సిటీ బృందాలు పర్యటిస్తున్నాయి. మన దేశంలో అమరావతి, చెన్నై నగరాలను, గుజరాత్ రాష్ట్రాన్ని పరిశీలిస్తున్నారు. మన దేశంలోని యూనివర్సిటీల తరహాలో ఎక్కువ భూములు కూడా అవసరం లేదని టోక్యో వర్సిటీ ప్రతినిధులు చెప్పినట్లు తెలిసింది. 50 ఎకరాల్లో క్యాంపస్ ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదన పెట్టారని సమాచారం. కాగా టోక్యో విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయిలో 25వ ర్యాంకులో కొనసాగుతోంది. టోక్యో వర్సిటీ క్యాంపస్ రాష్ట్రానికి వస్తే అది సువర్ణావకాశమే అవుతుంది.

30 ఏళ్లలో ఒక్క రోజూ సెలవు తీసుకోలేదు!

> గత 30 ఏళ్లుగా అనారోగ్యమంటూ ఒక్కరోజు కూడా లీవ్ తీసుకోకుండా పనిచేస్తున్నా.. ఏ రోజూ అనారోగ్యం ఉందని కూడా చెప్పలేదు. కష్టపడుతున్న ప్రభుత్వ యంత్రాగాన్ని పనిచేయించి.. ప్రజలకు ఉపాధి కల్పించి వారి భవిష్యత్ బాగుకు కృషి చేస్తున్నాను. భర్త చనిపోతే ఆ నెల నుంచే భార్యకు పింఛను ఇచ్చే విధానం తీసుకొచ్చాను. ఒక నెల తీసుకోకపోయినా మరుసటి నెలలో పింఛన్లు ఇస్తున్నాం. దేశంలోనే సామాజిక పింఛన్లకు ఆద్యుడు స్వర్గీయ ఎన్టీఆర్. ఆయన తొలుత రూ.30 ఇచ్చారు. 30 ఏళ్ల క్రితం నేను తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 1995లో పింఛన్‌ను రూ.75కి పెంచాను. 2014లో నవ్యాంధ్ర సీఎంనైనప్పుడు రూ.200 పెన్షన్‌ను రూ.వెయ్యి, తర్వాత 2 వేలు చేశా. ఇప్పుడు రూ.4,000కి తీసుకెళ్లా. వృద్ధులకు, వితంతువులకు పది రెట్లు.. దివ్యాంగులకు 12 రెట్లు పెంచింది టీడీపీయే. ఎన్ని ఇబ్బందులున్నా ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్నాం.. ప్రజలు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి.
>
> - చంద్రబాబు

దార్శనికుడు.. చంద్రబాబు

అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, న్యూఢిల్లీ, విజయవాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు స్పందించారు. సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈమేరకు సోమవారం ఓ ప్రకటన చేశారు. 'భవిష్యత్తును ఊహించి, దూరదృష్టితో, ప్రణాళికబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాల చేపట్టే దార్శనికుడు సీఎం చంద్రబాబు. చంద్రబాబుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం. ప్రజా రాజధాని అమరావతి, పోలవరంతో పాటు పారిశ్రామికాభివృద్ధి లక్ష్యంగా 2014లో పాలన మొదలుపెట్టారు. 2024లో మరింత క్లిష్ట పరిస్థితుల్లో పాలనా పగ్గాలు తీసుకున్నారు. కఠిన సవాళ్లు ముందున్నా దృఢచిత్తంతో పాలన వ్యవస్థను ముందుకు తీసుకువెళ్తున్నారు' అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.


చంద్రబాబు తొలిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆ పార్టీ నేతలు

పనిలో బాస్: లోకేశ్

ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ స్పందిస్తూ... 'ముప్పై సంవత్సరాలు కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదు. సజీవ వారసత్వానికి నిదర్శనం. హైటెక్ సిటీ నుంచి క్వాంటమ్ వ్యాలీ వరకు, బయోటెక్ ఆకాంక్షల నుంచి డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థల వరకు చంద్రబాబు అభివృద్ధి ప్రస్థానం సజీవంగా సాగుతూనే ఉంది. అమరావతిని భవిష్యత్తు ఆశలకు ప్రతిబింబంగా నిర్మించాలనే మన సంకల్పానికి ఆయన సూచిక. హృదయపూర్వక శుభాకాంక్షలు సర్. నిరంతరం అభివృద్ధి.. సంక్షేమం కోసం తపించే వ్యక్తిని ఇంట్లో నాన్న అని.. పనిలో బాస్ అని పిలుచుకోగలగడం నా అదృష్టం' అని పేర్కొన్నారు.

టీడీపీ కార్యాలయంలో సంబరాలు

మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమ, అశోక్‌బాబు, నెట్టెం రఘురాం, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. కాగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుకు మాజీ మంత్రి యనమల, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంకు గవర్నర్ అభినందనలు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రజలకు మరింత కాలం సేవ చేయాలని, భగవంతుడు ఆయనకు మంచి ఆరోగ్యం కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు. సోమవారం ఈ మేరకు గవర్నర్ కార్యాలయం ఓ ప్రకటన చేసింది. ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తి చేసుకోవడం అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎంను కలసిన వీహెచ్‌పీ నేతలు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) అఖిల భారత కార్యనిర్వాహక కార్యదర్శి మిలింద్ పరాందే సోమవారం సాయంత్రం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో దేవాలయాల నిర్వహణ, అభివృద్ధి, ధార్మిక ప్రచారం, సేవా కార్యక్రమాలపై వీహెచ్‌పీ ప్రతినిధులు పవన్‌తో చర్చించారు. సమావేశంలో వీహెచ్‌పీ నేతలు గోకరాజు గంగరాజు, టి.సత్యరవికుమార్, ఒబిలిశెట్టి వెంకటేశ్వరు పాల్గొన్నారు.

53 ఎకరాలు ఆక్రమించిన దేవిరెడ్డి

మే నెలలో ఫిర్యాదు.. స్వాధీనానికి ఆదేశం

(కడప-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో కడప జిల్లాలో వైసీపీ నేతలు విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడ్డారు. విలువైన భూములను స్వాధీనం చేసుకున్నారు. అధికార యంత్రాంగం కూడా వారికి సహకరించింది. జగన్‌కు నమ్మిన బంటు, ఎంపీ అవినాశ్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-5గా ఉన్న దేవిరెడ్డి శంకర్‌రెడ్డి పులివెందుల నియోజకవర్గంలో ఏకంగా 53 ఎకరాలు ఆక్రమించేశాడు. లింగాల మండలం దొండ్లవాగు సమీపంలో సర్వే నంబర్లు 15, 150, 361-పీ1, 380/1లో మొత్తం 53.15 ఎకరాల ప్రభుత్వ భూమిని తప్పుడు పత్రాలతో అధీనంలో ఉంచుకుని, తన కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. అక్కడ చీనీ, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. అవి ప్రభుత్వ భూములని తెలిసినా కూడా నాడు అధికార యంత్రాంగం కనీసం అటు వైపు చూసే సాహసం చేయలేదు. వైసీపీ నేతల భూకబ్జాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు రాసింది. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఈ ఏడాది మేలో ఆ భూకబ్జాలపై ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు విచారించి.. ప్రభుత్వ భూములుగా గుర్తించారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకోవలసిందిగా కలెక్టర్ శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు.



లిక్కర్ స్కామ్‌లో మరో వైసీపీ నేత

- విజయానంద రెడ్డిని విచారించిన సిట్

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అతనొక ఎర్రచందనం స్మగ్లర్. పలుమార్లు అరెస్టై జైల్లో నెలల తరబడి ఉన్నాడు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాకతో అతని దశ దిశ అన్నీ తిరిగాయి. చిత్తూరు నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించాడు. అది దక్కకపోయినా ఐదేళ్లపాటు అన్నీ తానై చెలాయించాడు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవిని అడ్డు పెట్టుకుని రూ. కోట్లు సంపాదించాడు. వైసీపీ కీలక నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో కలిసి దక్షిణాఫ్రికాలో మైనింగ్‌లో పెట్టుబడులు పెట్టే స్థాయికి చేరాడు. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్నా కూటమి ఊపులో ఓటమి పాలయ్యాడు. అతనెవరో కాదు చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి. వైసీపీ హయాంలోని లిక్కర్ స్కామ్‌లో సిట్ సోమవారం విజయానంద రెడ్డిని విచారించింది. చెవిరెడ్డితో నిరంతరం అంటకాగిన విజయానంద రెడ్డి పాత్ర లిక్కర్ స్కామ్‌లో వెలుగులోకి వచ్చింది. మద్యంను డిపోల నుంచి షాపులకు తరలించేందుకు ఆయన కాంట్రాక్టు పొందారు. పొరుగు రాష్ట్రాల్లో రవాణా చేసే ట్రాన్స్‌పోర్టర్లకు ఇస్తున్న మొత్తం కన్నా ఎక్కువకు దక్కించుకున్నాడు. అందులో అధిక మొత్తం వైసీపీ పెద్దలకు ఇచ్చాడు. తాను సంపాదించిన సొమ్ము పెట్టుబడులు పెట్టేందుకు చెవిరెడ్డితో కలిసి పలుమార్లు ఆఫ్రికా దేశాలకు వెళ్లొచ్చాడు. ఎన్నికల సమయంలో చెవిరెడ్డి సూచన మేరకు లిక్కర్ ముడుపుల్ని వైసీపీ అభ్యర్థులకు చేరవేసినట్లు సిట్ గుర్తించింది. వీటన్నింటిపై సుదీర్ఘంగా సిట్ అధికారులు సోమవారం ప్రశ్నించారు. మొదట తనకు ఏమీ తెలియదని, మద్యం సరఫరా కాంట్రాక్టు మాత్రమే చేశానని చెప్పిన అతను.. సిట్ అధికారులు చూపిన ఆధారాలతో గుట్టు విప్పక తప్పలేదు. రాత్రి 9 గంటల వరకూ ప్రశ్నించిన సిట్ అధికారులు మరోమారు రావాలంటూ పంపించినట్లు తెలిసింది.

కడప జిల్లాలో లోకేశ్, జగన్

కడప/పులివెందుల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని కమలాపురం నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు సీకేదిన్నె గ్రామంలో స్మార్ట్ కిచెన్ సెంటరును, అనంతరం పెండ్లిమర్రిలో గవర్నమెంటు డిగ్రీ కాలేజీని ప్రారంభిస్తారు. తరువాత కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌లో రూ. 50 కోట్లతో నిర్మించిన టెక్నో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ, రూ.120 కోట్లతో నిర్మించిన టెక్నోడ్రమ్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కమలాపురం పార్టీ కార్యకర్తలతో సమావేశం అవుతారు. సాయంత్రం 6.10కి కడప ఎయిర్‌పోర్టు నుంచి విజయవాడకు తిరిగి వెళతారు. లోకేశ్ సోమవారం రాత్రి కడపకు చేరుకుని ఇక్కడి భారత్ ఇంజనీరింగ్ కాలేజీలో బస చేశారు.

పులివెందులకు జగన్..

తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ సీఎం జగన్ సోమవారం పులివెందుల చేరుకున్నారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ చేపట్టారు. జడ్పీటీసీ ఉప ఎన్నిక తీరుపై ఆరా తీశారు. ఎన్నికల్లో పోరాడకుండా టీడీపీకి సరెండర్ అయ్యారంటూ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా, మంగళవారం ఉదయం 7.30 సమయంలో ఇడుపులపాయలోని వైఎస్ సమాధి వద్ద జగన్ నివాళులు అర్పించనున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సోమవారం సాయంత్రం ఇడుపులపాయకు చేరుకున్నారు. మంగళవారం వైఎస్ సమాధి వద్ద నివాళులర్పించనున్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌కు
అమరావతిలో 50 ఎకరాలు

- 133 బిట్, 5కే గేట్స్ కంప్యూటర్ ఏర్పాటుకు సిద్ధమైన ఐబీఎం
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు 365 గంటలపాటు ఉచిత ఇంటర్నెట్
- ఉత్తర్వు జారీ చేసిన ఐటీశాఖ కార్యదర్శి



అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో సమాచార, సాంకేతిక రంగం విప్లవం జోరందుకోనుంది. 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ'ని ప్రారంభించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. దీనిలో భాగంగా అమరావతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్(ఏక్యూసీసీ)ని ఏర్పాటు చేసేందుకు వీలుగా సోమవారం రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతిలో ఏక్యూసీసీ ఏర్పాటు కు 50 ఎకరాలను కేటాయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేయనున్నారు. ఈ ఏక్యూసీసీలో 133 బిట్‌ను ఇన్‌స్టాల్ చేసేందుకు, 5కే గేట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు ఐబీఎం ముందుకు వచ్చింది. చదరపు అడుగుకు రూ.30 చొప్పున చెల్లించాలని, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు నాలుగేళ్లపాటు ఏడాదికి 365 గంటలు ఉచితంగా ఇంటర్నెట్ సేవలు అందించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికి ఐబీఎం అంగీకరించింది.

జగన్ పత్రికపై కేసు నమోదు

అమరావతి/గుంటూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా తప్పుడు కథనం ప్రచురించిన జగన్ పత్రికపై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రేతపత్రికపై కేసు నమోదైంది. డీఎస్పీల పదోన్నతుల్లో జాప్యానికి అవినీతి కారణం అంటూ 'పైసా మే ప్రమోషన్' పేరుతో జగన్ పత్రిక దురుద్దేశపూర్వకంగా ఓ కథనం ప్రచురించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దురుద్దేశంతో కుట్ర పూరితంగా తప్పుడు కథనాన్ని ప్రచురించి పోలీసు శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించిన జగన్ పత్రిక ఎడిటర్, బ్యూరో చీఫ్, క్రైమ్ రిపోర్టర్లపై చట్టపరమైన చర్య తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. దీంతో తాడేపల్లి పోలీసులు మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దుష్ప్రచారం చేయడం, వర్గ వైషమ్యాలను రేకెత్తించడం, కుట్ర పూరితంగా వ్యవహరించడం వంటి బీఎన్ఎస్ సెక్షన్లు ఎఫ్ఐఆర్‌లో ఉన్నాయి.

ఏసీబీ కస్టడీకి ఐపీఎస్ సంజయ్

విజయవాడ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగం కేసులో ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌ను మూడు రోజుల పాటు ఏసీబీ కస్టడీకి కోర్టు అప్పగించింది. సోమవారం విజయవాడ ఏసీబీ కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అగ్నిమాపక శాఖలో ఎన్‌వోసీల జారీకి సంబంధించి యాప్ రూపకల్పన, సీఐడీలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన సదస్సుల పేరుతో కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేశారని ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకున్న చాణక్య

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడు బూనేటి చాణక్య(ఏ8) బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సోమవారం వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరపు న్యాయవాది స్పందిస్తూ.... పిటిషన్‌ను ఉపసంహరించుకొని బెయిల్ కోసం ఏసీబీ కోర్టును ఆశ్రయించేందుకు స్వేచ్ఛనివ్వాలని కోరారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతిచ్చారు.

పిల్ల, నకిలీ కాంగ్రెస్‌లను రాష్ట్రంలో లేకుండా చేయండి

- బీజేపీ శ్రేణులకు మాధవ్ పిలుపు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'పిల్ల కాంగ్రెస్ వైసీపీ... గత ఐదేళ్ల దుష్ట, దుర్మార్గ పాలనలో రాష్ట్రాన్ని దోచేసింది. పిల్ల కాంగ్రెస్, నకిలీ కాంగ్రెస్ రాష్ట్రంలో వేళ్లూనుకోకుండా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన బీజేపీ జిల్లా స్థాయి విస్తృత సభలో ఆయన మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ దేశానికి తీరని అన్యాయం చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ తల్లిని సభ్యసమాజం తలదించుకునేలా దూషించిన రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన రాజకీయ నాయకుడిగా అనర్హుడు' అన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'బెర్రీ బోరర్'తో జాగ్రత్తగా ఉండాలి

- కాఫీ తోటల్లో తెగులు నియంత్రణకు సీసీఆర్ఐ పలు సూచనలు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ అరకులోయ గిరిజన ప్రాంతంలో కాఫీ తోటలకు సోకిన బెర్రీ బోరర్ తెగులుతో జాగ్రత్తగా ఉండాలని సెంట్రల్ కాఫీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీసీఆర్ఐ) పేర్కొంది. తెగులు బాగా సోకిన కాఫీ పండ్లను గుంత తీసి పాతి పెట్టాలని, బ్రోకాట్రాప్‌లను ఏర్పాటు చేసుకోవాలని, తెగులు సోకిన పండ్లను ఇతర ప్రాంతాలకు తరలించవద్దని సూచించారు.

అన్నమయ్య ఇక అంతేనయ్యా: షర్మిల

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 1(ఆంధ్ర జ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకు పోయి 5 ఏళ్లు దాటినా పునర్నిర్మాణానికి దిక్కేలేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. అన్నమయ్య ప్రాజెక్టు కన్నీటి వ్యథకు శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు.

నిడమర్రులో తొలి 'లీప్' మోడల్ స్కూల్

- ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి

మంగళగిరి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2029-30 విద్యాసంవత్సరం నాటికి పాఠశాల విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 'లీప్' (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. పైలట్ ప్రాజెక్టుగా గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో తొలి లీప్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నారు. రూ.15కోట్లతో నిడమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలను లీప్ మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

చేయని చదునుకు సాయం!



నెల్లూరు జిల్లా ముత్తుకూరులో 25 లక్షలు ఖర్చుపెట్టి చదును చేసిన భూమి ఇదే

(మొదటి పేజీ తరువాయి)

చదును పనులను ఉపాధి హామీ పథకం నిధులతో సాగించింది. కాంట్రాక్టర్లుగా మారిన వైసీపీ నాయకుల్లో చాలామంది ఈ పనులు దక్కించుకున్నారు. అయితే, ఉపాధిలో అనుమతి లేని పనులుగా వీటిని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తేల్చింది. జగన్ సర్కారుకు మొట్టికాయలు వేసింది. ఆ తర్వాత గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి హౌసింగ్ విభాగానికి ఈ పనులను అప్పటి ప్రభుత్వం బదిలీ చేసింది. అప్పటినుంచి హౌసింగ్‌లో ఇష్టారాజ్యంగా దోపిడీ కొనసాగింది. జగనన్న కాలనీల్లో చదును పనులు చేపట్టకుండానే బిల్లులను వైసీపీ నేతలకు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారులు తీవ్రంగా కష్టపడుతున్నారు. ఫలితంగా పనుల్లేకుండానే జగనన్న ఇళ్ల కాలనీ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ అక్రమాలను నివారించలేని పరిస్థితి ఏర్పడింది.

సాగు.. తున్న తనిఖీలు

గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటి స్థలాల లెవలింగ్‌పై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ విచారణకు చంద్రబాబు ప్రభుత్వం ఆదేశించింది. అసెంబ్లీ జీరో అవర్‌లో లెవలింగ్ అవకతవకలపై చర్చ రావడం, పలు పత్రికల్లో కథనాలు రావడం, రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణ తేజ రంగంలోకి దిగారు. ఆ పనులు తనిఖీ చేసిన తర్వాతే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఎక్కడికక్కడ పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ ఈఈలు, ఉపాధి పథకం సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు, అవసరమైన చోట ఇతర శాఖల ఇంజనీర్లతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి సమగ్రమైన విచారణ చేసి సిఫారసులు చేయాలని జిల్లా కలెక్టర్లుకు కృష్ణతేజ సూచించారు. ఆయా జిల్లాల్లో ఆయా పనులకు సంబంధించి 25 శాతం పెండింగ్ చెల్లింపుల పనుల జాబితాను ఆయా డ్వామా పీడీల నుంచి సేకరించాలని, నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? లేదా?, గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన సీనరేజ్ చార్జీలు ఆయా పనులు చేసిన వెండర్లు చెల్లించారా లేదా? తదితర నిబంధనలను తనిఖీ సందర్భంగా పాటించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు ఆయా పనులకు సంబంధించి పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత ఇంటి స్థలాల లెవలింగ్ పనుల బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అయితే కమిషనర్ ఆదేశించి 8 నెలలవుతున్నా ఇంకా తనిఖీలు కొన...సాగుతూనే ఉన్నాయి. జిల్లాల్లో కొన్ని చోట్ల గతంలో పనులు నిర్వహించిన సందర్భంలో ఉన్న అధికారులే ఇప్పటికీ ఉన్నారు. దీంతో విచారణ తూతూ మంత్రంగా సాగుతున్నదన్న విమర్శలు వస్తున్నాయి.

వైసీపీ నేతలకు దోచిపెట్టారు..

స్థానిక నేతలకు అప్పనంగా దోచిపెట్టేందుకు ఇంటి స్థలాల లెవలింగ్ పనులను గత ప్రభుత్వం ఎంచుకుంది. ఉపాధి హామీ పథకంలో చేపట్టేందుకు అనుమతి లేకపోయినప్పటికీ.... పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదీ సహకారంతో అడ్డగోలుగా పనులు చేపట్టారు. సుమారు రూ.1125 కోట్ల పనులు చేపట్టి సుమారు రూ.1500 కోట్లకు పైగా బిల్లులను వైసీపీ నేతలు బిల్లులు అప్‌లోడ్ చేశారు. అయితే, ఉపాధిలో ఈ పనులకు అనుమతి లేదని.... చెల్లింపులు చేయరాదని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీంతో ఎలాగైనా వైసీపీ నేతలకు ఈ బిల్లులు చెల్లించాలన్న ఉద్దేశంతో ఈ బిల్లులు చెల్లింపుల ప్రక్రియ హౌసింగ్ ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. గ్రామీణాభివృద్ధిశాఖ వద్ద ఉన్న పనుల బిల్లులను హౌసింగ్‌కు మార్చారు. ఈ క్రమంలో పలు పనులకు సంబంధించి మొత్తం కొలతలను మార్చేసి భారీ స్కాంకు తెరదీశారు. సుమారు రూ.460 కోట్ల ఉపాధి నిధులను సర్దేశారని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది.

రికవరీ చేస్తాం : ప్రభుత్వం

క్వాలిటీ కంట్రోల్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో చాలా చోట్ల రికార్డు చేసిన మేర పనులు లేవని తేలింది. అయినా, అప్పటి వైసీపీ నేతలను బిల్లులు ఇప్పించేందుకు హౌసింగ్‌లోని కొందరు అధికారులు అమిత ఉత్సాహం చూపుతున్నారు. వైసీపీ నేతలకు ఇవ్వాల్సిన మొత్తం బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీఓలతో కోర్టులకు స్టేట్‌మెంట్‌లు ఇప్పిస్తున్నారు. ఇప్పటివరకు 23 మంది వైసీపీ నేతలు కోర్టును ఆశ్రయించారు. ఏలూరు నుంచి ఇద్దరు, నెల్లూరు నుంచి ఐదుగురు, బాపట్ల నుంచి ఆరుగురు, ప్రకాశం నుంచి ఒకరు, పల్నాడు నుంచి ఆరుగురు, ఎన్టీఆర్ జిల్లాలో ముగ్గురు వైసీపీ నేతలు కోర్టుకెళ్లారు. కాగా, క్వాలిటీ కంట్రోల్ నివేదికను కోర్టు దృష్టికి తీసుకెళ్లకుండా కొందరు ఎంపీడీవోలు పూర్తిబిల్లులు చెల్లించినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఆ ఎంపీడీవోల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేస్తామని ఉపాధి హామీ డైరక్టర్ షణ్ముక్‌కుమార్ సోమవారం సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ సందర్భంగా హెచ్చరించారు.

ఉపాధి సిబ్బందికి ఊరట!

- పదోన్నతులపై త్వరలో అన్ని కేడర్లతో భేటీకి నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సిబ్బంది సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. 'నిర్వేదంలో ఉపాధి సిబ్బంది' శీర్షికన ఈనెల 30 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ స్పందించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి ఊరట కలిగించేలా.. వారితో ఈ నెలలోనే సమావేశం ఏర్పాటుకు నిర్ణయించారు. జిల్లాల నుంచి ఆయా కేడర్ల ప్రతినిధులను ఈ సమావేశానికి పిలవనున్నారు. ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, కమిషనర్ కృష్ణతేజ, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ ఒక్కోరోజు ఒక్కో కేడర్ సిబ్బందితో సమావేశమై, వారి సమస్యలు తెలుసుకుంటారు. వారికి అందాల్సిన ప్రయోజనాలపై చర్చిస్తారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఎఫ్‌టీఓలుగా చేయడం, ఆయా కేడర్ల గ్రేడ్ ఫిక్సేషన్ పెండింగ్ సమస్యలు, సిబ్బంది జీతాల వ్యత్యాసం, పీఆర్‌సీ ప్రకారం జీతాల పెంచే విషయంపె మాట్లాడనున్నారు. పంచాయతీ రాజ్ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ చేపట్టిన విధంగానే గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బందికి పదోన్నతులు, జీతాలు పెంపు, గ్రాట్యుటీ తదితర అంశాలపై చర్చించే అవకాశముంది.

రైతుకు తప్పనున్న తిప్పలు!

ఆధార్ యూజర్ ఏజెన్సీగా రెవెన్యూ శాఖ

- భూమి రికార్డుల నిర్వహణ, అనుసంధానం కోసం కేంద్రం ఎంపిక
- నోటిఫికేషన్ జారీచేసిన రాష్ట్రప్రభుత్వం
- అథెంటికేషన్ కోసం ప్రైవేటు ఏజెన్సీల చుట్టూ ఇక తిరగక్కర్లేదు
- రెవెన్యూ ఆఫీసుల్లోనే ఆధార్ సేవల కేంద్రం అక్కడే ఐరిస్, అథెంటికేషన్
- వెబ్‌ల్యాండ్‌లోని రైతు భూరికార్డుతో ఆధార్ నంబర్ అనుసంధానం



అమరావతి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూ వ్యవహారాలకు సంబంధించిన ఆధార్ సేవల నిర్ధారణకు వినియోగదారుల సేవల సంస్థ (యూజర్ ఏజెన్సీ)గా రాష్ట్ర రెవెన్యూ శాఖ ఎంపికైంది. ఈ మేరకు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ(యూఐఏ), కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ రాష్ట్రప్రభుత్వానికి సమాచారం ఇచ్చాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖను భూముల సంబంధిత వ్యవహారాల్లో ఆధార్ యూజర్ ఏజెన్సీగా ఎంపిక చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు (జీవోలు 309, 310) జారీ చేసింది. దీంతో ఆధార్‌తో భూముల అనుసంధాన ప్రక్రియలో రెవెన్యూ శాఖ పాత్ర మరింత కీలకం కానుంది. ప్రస్తుతం ఆధార్ నిర్ధారణ యూజర్ ఏజెన్సీలు.. ప్రైవేటు సంస్థలు, ఏజెన్సీల చేతుల్లో ఉన్నాయి. వెబ్‌ల్యాండ్‌లో రైతుల వివరాలు, ఆధార్‌ను సీడింగ్ చేయాలంటే తొలుత ప్రైవేటు ఏజెన్సీ వద్దకు వెళ్లి ఐరిస్ డేటా ఇస్తున్నారు. ఆధార్ అథెంటికేషన్ ప్రైవేటుగా చేయాల్సి వస్తోంది. దీనివల్ల రికార్డుల సవరణ, ఇతర అంశాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆధార్ అనుసంధానం కాలేదన్న పేరుతో రైతులకు పంటల బీమా, పంటల పెట్టుబడి వంటి సంక్షేమ పథకాలు కూడా సకాలంలో దక్కడం లేదు. ఆధార్ సీడింగ్ జరగడం లేదని ఇటీవలి కాలంలో కొన్ని వేల మంది రైతులకు అన్నదాత సుఖీభవ స్కీం కింద పంట పెట్టుబడి జమకాలేదు. దీంతో రెవెన్యూ శాఖ నియంత్రణలో ఉన్న వెబ్‌ల్యాండ్‌లోని భూమి రికార్డులకు ఆధార్ అనుసంధాన పనులను ఇకపై పూర్తిస్థాయిలో ఆ శాఖ చేస్తేనే సమస్యలన్నిటికీ పరిష్కారం దొరకుతుందని అధికారులు భావించారు. అందుకే భూముల వ్యవహారాల్లో ఆధార్ నిర్ధారణ సేవలను చేపట్టేందుకు యూజర్ ఏజెన్సీగా ఆ శాఖనే ఎంపిక చేయాలని కేంద్రాన్ని, యూఐఏని కోరారు. రెవెన్యూ శాఖ కూడా స్వచ్ఛందంగా ముందుకు రావడంతో దానికి బాధ్యతలు అప్పగిస్తూ యూఐఏ, కేంద్రం ఆదేశాలిచ్చాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం కూడా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సేవలను కొనసాగించేందుకు రెవెన్యూ శాఖ ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) సహకారం తీసుకోనుంది. తాజా నిర్ణయంతో ప్రతి తహశీల్దార్ కార్యాలయం పరిధిలోనే రైతులు, భూయజమానుల కోసం ఆధార్ సేవల కేంద్రం ఏర్పాటు కానుంది. ఇది అమల్లోకొస్తే, మండల రెవెన్యూ కార్యాలయాల్లోనూ వెబ్‌ల్యాండ్‌లో రైతుల భూములకు వారి ఆధార్‌ను అనుసంధానం చేస్తారు. దీనివల్ల రైతులు ప్రైవేటు ఏజెన్సీల చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది. ఈ సేవలందించేందుకు రెవెన్యూ శాఖ చట్టబద్ధమైన ఫీజులు వసూలు చేస్తుంది.

రైతు ఏం చేయాలి..?

రైతుల భూములకు ఆధార్ అనుసంధానం ఇప్పుడు తప్పనిసరైంది. సెంటు భూమి ఉన్నా దాని రికార్డుతో రైతు ఆధార్ అనుసంధానం చేయాలి. తాజా పరిణామాలతో రైతులు మండల రెవెన్యూ ఆఫీసులకు వెళ్లినప్పుడు తమ భూమి రికార్డుతో ఆధార్ అనుసంధానం కోరుతూ దరఖాస్తు ఇవ్వాలి. ఆ వెంటనే అక్కడి అథెంటికేషన్ కేంద్రంలో సంబంధిత రైతు వేలిముద్రలు, ఐరిస్‌డేటా తీసుకుంటారు. ఆధార్ డేటాను సరిపోల్చి రైతు ఆధార్ నంబర్‌ను వెబ్‌ల్యాండ్‌లోని భూమి రికార్డుతో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో దీనిని మరింత సులభమైన ప్రక్రియగా మారుస్తామని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

త్వరలో 20 ఉద్యోగ నోటిఫికేషన్లు

- వివిధ శాఖల్లో 80 పోస్టుల భర్తీ
- ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ఖాళీల భర్తీకి త్వరలో 20 నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. వీటిద్వారా సుమారు 80 పోస్టులు భర్తీ చేస్తామని ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రాజాబాబు వెల్లడించారు. ఈ నెలాఖరుకే ఈ నోటిఫికేషన్లు జారీ అవుతాయని తెలిపారు. సోమవారం విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో.. అటవీ శాఖలో ఉద్యోగ నోటిఫికేషన్ల స్క్రీనింగ్ పరీక్షలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులు 691, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు 100 భర్తీకి ఇటీవల నోటిఫికేషన్లు జారీ చేశామన్నారు. ఈ నెల 7న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 287 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులు ఓఎంఆర్ షీట్లపై వివరాలను పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. ఒకసారి సమాధానం రాసి, దాన్ని వైట్‌నర్ లేదా ఇతర మార్గాల్లో చెరిపివేస్తే, ఆ పేపర్లను ఇన్‌వాలిడ్‌గా పరిగణిస్తారని తెలిపారు. ప్రతి మూడు తప్పులకు ఒక మైనస్ మార్కు ఉంటుందన్నారు. కాగా, స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల జాబితాలు శాప్ నుంచి రానందున గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ఫలితాలు నిలిచి పోయాయని తెలిపారు. స్పోర్ట్స్ కోటా మినహా మిగిలిన పరీక్షల ఫలితాల ప్రక్రియ మొత్తం పూర్తయిందన్నారు. గ్రూప్-2లో 1634 మంది అభ్యర్థుల కంటిచూపు, 24 మంది అభ్యర్థుల వినికిడి రిపోర్టులు అందాల్సి ఉందన్నారు. గ్రూప్-1, 2 ఫలితాలపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని అభ్యర్థులను కోరారు. కాగా, త్వరలో విడుదల చేసే నోటిఫికేషన్లలో తక్కువ పోస్టులున్నందున అన్నింటికీ కలిపి ఒకేసారి పరీక్షలు నిర్వహించాలని భావిస్తోంది.

జగన్‌కు మహిళల ఉసురు

- స్త్రీలను అవమానాలకు గురి చేసిన ఫలితం
- తల్లి, చెల్లి చీరలపైనా తప్పుడు ప్రచారం: అనిత
- పిడుగురాళ్లలో స్త్రీశక్తి విజయోత్సవ సభ



పిడుగురాళ్లలో స్త్రీశక్తి విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యేలు యరపతినేని, మాధవి, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమావేశాలకు రాకుండా బయట తప్పించుకు తిరుగుతున్న జగన్‌తో కలిపి అసెంబ్లీలో 23 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. సోమవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు 35 వేల మంది మహిళలతో స్త్రీశక్తి విజయోత్సవ ర్యాలీ, సభ నిర్వహించారు. ముఖ్యఅతిథి అనిత మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మహిళలను అనేక రకాలుగా అవమానాలకు గురి చేసిందన్నారు. తల్లి, చెల్లిని మోసం చేసి ఇంటి నుంచి బయటకు గెంటిన జగన్‌కు గత ఎన్నికల్లో మహిళల ఉసురు తగిలిందని చెప్పారు. తల్లి, చెల్లి కట్టుకున్న చీరలపై కూడా తప్పుడు ప్రచారం చేయించారన్నారు. రాష్ట్రంలో మహిళల జోలికి వస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని జగన్ నాశనం చేశాడన్నారు. త్వరలోనే విద్యుత్ శాఖలో ఏఈ, లైన్‌మెన్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బిహార్‌లో డీలర్లపై లాఠీచార్జి దారుణం

- ఏపీ రేషన్ డీలర్ల సంఘం

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలో తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న డీలర్లపై పోలీసుల లాఠీ చార్జి, వాటర్ కేనన్లు ప్రయోగించడం దారుణమని రేషన్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు దివి లీలా మాధవరావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. డీలర్ల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అక్కడి ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ గడువు రేపటి వరకు పెంపు

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ గడువు పొడిగించినట్లు ఉన్నత విద్యా మండలి తెలిపింది. రిజిస్ట్రేషన్ గడువు సోమవారంతో ముగియగా బుధవారం వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంది. 4 వరకు విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక, 5న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుంది. 8న సీట్లు కేటాయిస్తారు. కాగా, డిగ్రీ కోర్సులకు ఇప్పటి వరకు 1,61,227 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 1,58,566 మంది కౌన్సెలింగ్ ఫీజు చెల్లించారని, 1,38,558 మంది దరఖాస్తులు సమర్పించారని ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీఎస్ కృష్ణమూర్తి చెప్పారు.

కాకాణి బెయిలు షరతు సడలింపు

- నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి హైకోర్టు అనుమతి

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిలు మంజూరు చేస్తూ విధించిన ఓ షరతును హైకోర్టు సడలించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేస్తూ విధించిన షరతులను సవరించాలని కోరుతూ వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేశారు. కాకాణి తరపు సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... 'కేసు దర్యాప్తు ముగిసి, చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని షరతు పెట్టారు. అలాగే దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని మరో షరతు విధించారు. రెండూ షరతులు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. మరోవైపు పిటిషనర్‌పై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులలో బెయిల్ మంజూరు చేస్తూ కోర్టులు షరతులు విధించాయి. ఆ కేసులలో కూడా దర్యాప్తు అధికారుల ముందు హాజరుకావాల్సి ఉంది. నెల్లూరు జిల్లాలో ప్రవేశించకూడదన్న షరతు కారణంగా దర్యాప్తు అధికారి ముందు హాజరుకాలేని పరిస్థితి ఉంది. కోర్టు విధించిన షరతును ఉల్లంఘించినట్లు అవుతుంది. ఓ కేసులో గూడూరు కోర్టు మూడు నెలలు లేదా చార్జ్‌షీట్ దాఖలు వరకు తమ పరిధిదాటి బయటకు వెళ్లడానికి వీల్లేదని ఆదేశాలు ఇచ్చింది. మరో 5 కేసుల్లో బీఎన్ఎస్ఎస్ 35(3)కింద పోలీసులు నోటీసులు ఇచ్చారు. దర్యాప్తు అధికారులు కోరినప్పుడు వారి ముందు హాజరుకావాల్సి ఉంది' అని వివరించారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కేసు దర్యాప్తు ముగిసి, చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని విధించిన షరతు సడలిస్తూ జిల్లాలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

శాశ్వత బోధన సిబ్బందిని నియమించకుండా
నాణ్యమైన విద్య ఎలా సాధ్యం?

- కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం దక్కడంలేదు
- కేజీబీవీల్లో శాశ్వత నియామకాలపై మీ వైఖరి చెప్పండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం.. విచారణ 15కు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సర్వశిక్ష అభియాన్ పథకం కింద నడిచే విద్యాసంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించకుండా అందులో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం ఎలా సాధ్యమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ప్రశ్నించింది. అణగారిన వర్గాల పిల్లల అభ్యున్నతి కోసం, వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీల)ను ఏర్పాటు చేసి, కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆశించిన ప్రయోజనం దక్కడంలేదంది. శాశ్వత ప్రాతిపదికన బోధన సిబ్బందిని నియమించే వ్యవహారంపై వైఖరిని తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి, పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శిలను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 15వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కొండపల్లిలో జలపాతాల కనువిందు



భారీ వర్షాలకు కొండపల్లి రిజర్వు ఫారెస్టులో జలపాతాలు హొయలొలుకుతున్నాయి. ఎత్తయిన కొండల పైనుంచి పచ్చని చెట్ల మధ్యలో జాలువారుతున్న జలపాతాలు పర్యాటకులను కట్టి పడేస్తున్నాయి. కొండపల్లి ఖిల్లాకు వెళ్లే ఘాట్ రోడ్డు మార్గంలో ఈ వాటర్ ఫాల్స్ కనిపిస్తున్నాయి. మొత్తం 8 జలపాతాల వరకూ ఇక్కడ ఉన్నాయి. అలాగే, మూలపాడు వద్ద, దొంగమర్ల బావి వద్ద కూడా మరి కొన్ని జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. కొంగుధార, జడల కొలను, బేబీ చిత్రకూట్ వంటి జలపాతాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. అయితే, ఈ జలపాతాలు చూడాలంటే అడవి దారిలో ట్రెక్కింగ్ చేయాల్సిందే!.

-ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం

గాల్లో తేలినట్టుందే..!

- రాష్ట్రంలో తొలిసారిగా కైలాసగిరిపై అద్దాల స్కై బ్రిడ్జి ఏర్పాటు
- విశాఖ తీరంలో సిద్ధమవుతున్న మరో పర్యాటక ఆకర్షణ



కైలాసగిరిపై ఏర్పాటు చేసిన స్కై బ్రిడ్జి

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గాలిలో తేలియాడుతున్న అద్దాల బ్రిడ్జిపై నుంచి సాగర అందాలను వీక్షిస్తుంటే... ఆ మజానే వేరు..! మాటల్లో వర్ణించలేని ఈ మధురానుభూతిని ప్రకృతి ప్రేమికులకు అందించేందుకు విశాఖ తీరంలో కైలాసగిరిపై 'స్కై బ్రిడ్జి' సిద్ధమవుతోంది. విశాఖలోనే కాదు.. రాష్ట్రంలోనే తొలిసారిగా ఇలాంటి అద్దాల బ్రిడ్జి త్వరలోనే పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న పర్యాటక కేంద్రం కైలాసగిరిపై పీపీపీ విధానంలో ఈ స్కై బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం రూ.7 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. కేరళలో ఈ తరహా ప్రాజెక్టు స్ఫూర్తితో దానికి కాస్త మార్పులు చేసి ఇక్కడ కైలాసగిరిపై టైటానిక్ షిప్ వ్యూ పాయింట్ పక్కనే స్కై బ్రిడ్జిని నిర్మించారు. ఇది కొండపై నుంచి సముద్రం వైపు సుమారు వంద అడుగుల పొడవు ఉంటుంది. కేంటీ లివర్ విధానంలో కింద ఎటువంటి ఆధారం లేకుండా నిర్మించారు. భారత్‌లోనే అతిపెద్ద కేంటీ లివర్ గ్లాస్ వంతెనగా ఇది నిలవనుంది. సముద్రపు గాలికి తుప్పు పట్టని స్టీల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. అద్దాలు, ఇతర రోప్‌లు బెంగళూరు నుంచి తెప్పించారు. దీనిపైకి ఒకేసారి 100 మంది పర్యాటకులు వెళ్లి సముద్రం, పరిసర ప్రాంతాల అందాలను వీక్షించవచ్చు. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభిస్తామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.